# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 10 నవంబర్ 2025 | సంపుటి: 29 | సంచిక: 42 | వెల: రూ.7 | పేజీలు: 12+8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## జపాన్‌లో భారీ భూకంపం

**సునామీ హెచ్చరికలు జారీ**

జపాన్ ఈశాన్య తీరంలో 6.7 తీవ్రతతో భారీ భూకంపం

తాత్కాలికంగా నిలిచిపోయిన బుల్లెట్ రైలు సర్వీసులు

అణు విద్యుత్ కేంద్రానికి ఎలాంటి ప్రమాదం లేదని వెల్లడి



2

## కేటీఆర్ జాతకంలో
# అధికార యోగం లేదు

**రాసిపెట్టుకోండి.. 2034 వరకూ మాదే అధికారం**

చంద్రబాబు, వైఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నాం

కేటీఆర్ దశ బాగా లేదు... కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం లేదని ఎద్దేవా

పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని విమర్శలు

మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**"రాసిపెట్టుకోండి.. తెలంగాణలో మరో 8 ఏళ్ల పాటు మా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు, 2029 జూన్‌లో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు వస్తాయి. 2034 జూన్ వరకు మేమే పాలిస్తాం" అని రేవంత్ రెడ్డి పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పలువురు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.**



**హైదరాబాద్, నవంబర్ 9 (నినాదం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేటీఆర్ జాతకంలో అధికార యోగం అనే రేఖే లేదని, ఆయన దశ బాగోలేనప్పుడు తండ్రి కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ప్రయోజనం ఉండదని ఎద్దేవా చేశారు. పుత్ర వాత్సల్యంతో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారని ఆయన అభివర్ణించారు. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ ఎన్నికల ప్రచారం చూస్తుంటే 'పుష్ప' సినిమాలోని శ్రీలీల ఐటమ్ సాంగ్ గుర్తుకొస్తోందని అన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ పదేళ్ల ..మిగతా 2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
# ప్రచారానికి తెర

**జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రచారం ఆదివారం సాయంత్రం ముగిసింది. మరో రెండు రోజుల్లో పోలింగ్ జరగనుంది. 6 గంటల తర్వాత స్థానికేతరులు నియోజకవర్గం వదిలి వెళ్లాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. జూబ్లీహిల్స్ పరిధిలో వైన్స్, పబ్బులు మూసివేయాలని ఆదేశించింది. నవంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.**

**- హైదరాబాద్, నవంబర్ 9 (నినాదం)**




జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ మీడియా సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సోమవారం రాత్రి ఈవీఎంలు కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ స్టేషన్లకు తరలిస్తామని ఆయన వెల్లడించారు. ఈసారి ఒక్కో పోలింగ్ స్టేషన్ లో 4 బ్యాలెట్ యూనిట్లు ఉంటాయి. 139 పోలింగ్ లొకేషన్స్‌లో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశాం. మూడంచెల భద్రత ఉంటుంది. 45 FST, 45 SST టీమ్స్ నియోజకవర్గం లో పని చేస్తున్నాయి. 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో ఉండనున్నారని ..మిగతా 2లో

## బిహార్‌లో ముగిసిన
# రెండో విడుత ఎన్నికల ప్రచారం



**పాట్నా, నినాదం:** బిహార్‌లో ఎన్నికల ప్రచారం ముగిసింది. రేపు విడుతలో ఎల్లుండి 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఆదివారం చివరిరోజు అగ్రనేతలు రంగంలోకి దిగారు. కూటమి తరుపున సభలు, రోడ్‌షోలు, సమావేశాల్లో ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. బిహార్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆర్జేడీ వామపక్షాలతో కూడిన మహాగట్ బంధన్ (మహా కూటమి)తరుఫున రాహుల్‌గాంధీ ఎన్నికలు ప్రచారం చేశారు. 1302 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

**మా వైపే జూబ్లీహిల్స్ ఓటర్లు: మంత్రి శ్రీధర్ బాబు**

2



## టెలివిజన్ కార్మికులకు
# అండగా ఉంటాం

**సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, నవంబర్ 9 (నినాదం):** టెలివిజన్ కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆదివారం బేగంపేట్ లోని హరిత ప్లాజా హెూటల్ లో "తెలంగాణ టెలివిజన్ డెవలప్ మెంట్ ఫోరం" ఆధ్వర్యంలో నిర్వహించిన "కార్తీక మాస ఆత్మీయ సమ్మేళనం"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ..మిగతా 2లో

# రేషన్ @ కరెప్షన్

**డీలర్ల సహకారం.. దుకాణం వద్దనే దందా..**

సన్న బియ్యం ఇచ్చినా ఫలితం శూన్యం

ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న డీలర్లు

మొద్దు నిద్రలో సివిల్ సప్లై అధికారులు

**ఇల్లందు, నవంబర్ 9 (నినాదం):** పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఉచితంగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నాయి. ఈ రెండు ప్రభుత్వాల లక్ష్యాన్ని స్వయంగా రేషన్ డీలర్లు దళారులతో చేతులు కలిపి నిర్వీర్యం చేస్తున్నారు.

2



## ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు




**రామ మందిరానికి కాంగ్రెస్ మద్దతిచ్చినా అండగా నిలిచేవాళ్లం: మోహన్ భగవత్**

కాషాయం మాకు గురువు లాంటిది, అందుకే ఆ జెండాను ఎగరేస్తాం

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

**– బెంగళూరు, నవంబర్ 9 (నినాదం)**

2



## ట్రంప్ వల్లే యుద్ధం ఆగింది

**మరోసారి ప్రశంసించిన పాక్ ప్రధాని**

2

## 5 రాష్ట్రాల్లో తెలంగాణ
# సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్

**రూ.95 కోట్లు మోసం చేసిన 81 మంది అరెస్ట్**

2

## ఒక్క ఛాన్స్ పేరుతో ఏపీ నష్టపోయింది

**బీహార్‌లో అటువంటి పరిస్థితి తెచ్చుకోవద్దు**




ఎన్డీయేను గెలిపిస్తే బీహార్ సర్వతోముఖాభివృద్ధి..

బీహార్ ఓటర్లకు నారా లోకేశ్ విజ్ఞప్తి

ఎన్డీయే కూటమి తరపున బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఏపీ మంత్రి

2

""ఒక్క ఛాన్స్" పేరుతో 2019లో ఆంధ్రప్రదేశ్ ఓటర్లు వైసీపీకి అవకాశం ఇచ్చి తీవ్రంగా నష్టపోయారు.. ఆ ఒక్క ఛాన్స్ వల్ల రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. ఒక్క ఛాన్స్ వల్ల పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. మొత్తంగా ఒక్క ఛాన్స్ ఇవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయింది. ఇప్పుడు అదే పరిస్థితిని మీరు కొనితెచ్చుకోవద్దు. వికసిత్ భారత్ లక్ష్యసాధనలో బీహార్ పాత్ర చాలా కీలకం. బీహార్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మరోమారు ఎన్డీయేను గెలిపించండి' అంటూ ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బీహార్ యువతకు విజ్ఞప్తి చేశారు.

**–పాట్నా, నవంబర్ 9 (నినాదం)**

## కాంగ్రెస్ అభ్యర్థి
# నవీన్‌ను గెలిపించండి

**జూబ్లీహిల్స్‌లో అభివృద్ధికి బాటలు వేయండి**

రెహమత్‌నగర్‌లో పొంగులేటి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. విశేష స్పందన



గత 12 ఏళ్లుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించలేదని, ఫలితంగా ఇక్కడ అభివృద్ధి కుంటుపడినందున ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని జూబ్లీహిల్స్ రెహ్మత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.

2

**– హైదరాబాద్, నవంబర్ 9 (నినాదం)**



కొల్లూరు కాలనీ వాసులకు 24 గంటల్లో
# హామీలు నెరవేర్చాం

త్వరలో మరిన్ని సమస్యల పరిష్కారం

కాంగ్రెస్ పాలనకు ఇది నిదర్శనం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2



## ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

**హైదరాబాద్, నవంబర్ 9 (నినాదం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే అందరి పార్టీ కాంగ్రెస్ వైపే నియోజకవర్గ ఓటర్లంతా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఆయన ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను గురించి ఓటర్లకు వివరించారు. నగరాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సలహాలు సూచనలు స్వీకరించారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పాలకులు నగరాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను నిర్మించి మొత్తంనగరాన్ని అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. కానీ... క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి వేరని, ఇప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని చాలా కాలనీలు, బస్తీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్లప్రజలు సానుకూలంగా ఉన్నారన్నారు. అయినా... తమ ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ బురద జల్లే రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. పదే పదే మా ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేస్తూ ఈ ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడేలా నిపుణుల మార్గనిర్దేశంలో పకడ్బందీ ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని పునరుద్ఘాటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి కాంగ్రెస్ అభ్యర్థికి మాత్రమే ఉందన్నారు. పది మందికి మంచి చేయాలనుకునే నవీన్ యాదవ్ గెలిస్తే ఈ నియోజకవర్గానికి మంచి జరుగుతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## టెలివిజన్ కార్మికులకు అండగా ఉంటాం

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు "ఎంటర్‌టైన్‌మెంట్ రంగం" కీలక చోదక శక్తిగా మారిందని, ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించేందుకు టెలివిజన్ కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయం సందర్భం లేకుండా ఎంతో కష్టపడతారని, వారి త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. రాష్ట్రంలో టెలివిజన్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ముఖ్యంగా కార్మికుల ఆర్థిక, సామాజిక భద్రతా సమస్యలపై తమ ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని, వారి పట్ల సీఎం రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా ఉన్నారని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నాయకత్వంలో త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సంఘం ప్రతినిధులు సురేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

## 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్

**హైదరాబాద్, నవంబర్ 9 (నినాదం):** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన 81 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరిపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ పోలీసుల కథనం ప్రకారం, సైబర్ నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో... ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 81 మందిని అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు. నిందితుల నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అరెస్టులతో దేశంలోని అనేక సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడినట్లయిందని అధికారులు తెలిపారు.

## ట్రంప్ వల్లే యుద్ధం ఆగింది..

**వాషింగ్టన్, నవంబర్ 9 (నినాదం):** భారత్, పాకిస్తాన్ మధ్య గత మే నెలలో తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలను చల్లార్చి, యుద్ధాన్ని నివారించింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపేనని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి ప్రశంసించారు. ఆయన 'ధైర్యవంతమైన, నిర్ణయాత్మక నాయకత్వం' వల్లే కాల్పుల విరమణ సాధ్యమైందని కొనియాడారు. శనివారం అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన 'విక్టరీ డే' పరేడ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో షెహబాజ్ మాట్లాడుతూ "ట్రంప్ జోక్యంతో దక్షిణాసియాలో శాంతి పునరుద్ధరింపబడింది. ఒక పెద్ద యుద్ధం నివారించబడింది, తద్వారా లక్షలాది మంది ప్రాణాలు నిలిచాయి" అని పేర్కొన్నారు.

## జపాన్‌లో భారీ భూకంపం

**మియాకో, నవంబర్ 9 (నినాదం):** జపాన్‌లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దేశ ఈశాన్య ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ భూకంపం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, బుల్లెట్ రైలు సర్వీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:03 గంటలకు సంరికు తీరానికి సమీపంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కారణంగా ఇవాతె రాష్ట్ర తీరాన్ని మీటరు ఎత్తు వరకు సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఒఫునాటోలో 10 సెంటీమీటర్ల ఎత్తున, మియాకోలో ఓ మోస్తరు అలలు తీరాన్ని తాకినట్లు అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన తోహోకు షింకన్‌సెన్ బుల్లెట్ రైలు సర్వీసులను కొద్దిసేపటికే పునరుద్ధరించినట్లు ఆపరేటర్ జేఆర్ ఈస్ట్ ప్రకటించింది. ఈ ఘటనపై జపాన్ ప్రధాని సనాయే తకైచి 'ఎక్స్' వేదికగా స్పందించారు.

# కేటీఆర్ జాతకంలో అధికార యోగం లేదు

మొదటి పేజీ తరువాయి...

పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేశారని ఆరోపించారు. "వ్యవసాయం, విద్య, వైద్యం.. ఇలా ఏ రంగంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం విజయం సాధించలేదు. వేల కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా? కానీ మా ప్రభుత్వం కాళేశ్వరం లేకుండానే రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తి చేసి చూపించింది" అని తెలిపారు. కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, ప్రజలకు ఉపయోగపడని కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతిభవన్, సచివాలయం వంటి భవనాలు మాత్రమే నిర్మించారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రవేశపెట్టిన ఏ పథకాన్నీ రద్దు చేయలేదని, వాటిని కొనసాగిస్తూనే కొత్త హామీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రాష్ట్ర గీతం వంటి హామీలను నెరవేర్చామని గుర్తుచేశారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపామని, ఎవరూ సాహసించని కులగణనను ప్రారంభించామని గర్వంగా చెప్పారు. రాష్ట్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై కూడా రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమని, రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలను గుజరాత్‌కు తరలించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సెమీ కండక్టర్ కంపెనీ తరలింపునకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై



సీబీఐ విచారణకు ఆదేశించినా, కేంద్రం ఎందుకు దర్యాప్తు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ తెచ్చుకుంటే దేశం మొత్తం గెలిచినట్లేనని సవాల్ విసిరారు. రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలను వారు ఎంతో ప్రోత్సహించారని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. "జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారింది. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పునాది వేసిన ఐటీ రంగం నగర అభివృద్ధికి కీలకంగా మారింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకంగా మారాయి. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశాయి. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు నగరంలో ఏర్పాటయ్యాయి. దేశానికి వచ్చిన వాటిలో 70 శాతం ఇక్కడికే వచ్చాయి. ప్రపంచాన్నే శాసించే సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. నగరం నాలెడ్జ్ సిటీగా మారిందంటే అందుకు గతంలో కాంగ్రెస్ సీఎంలు తీసుకున్న నిర్ణయాలే కారణం. అభివృద్ధి మాత్రమే కాదు.. సంక్షేమంలోనూ వారు తమదైన ముద్ర వేశారు. 2004–2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉంటూ హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశాయి.

### అన్ని రంగాల్లోనూ కేసీఆర్ ప్రభుత్వం విఫలం..

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో త్యాగాలు చేసింది. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి 4 కోట్ల మంది ప్రజలకు ఇచ్చింది. భారత రాష్ట్ర సమితి హయాంలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. వ్యవసాయం, విద్య, వైద్యం.. ఇలా అన్ని రంగాల్లోనూ విఫలమయ్యారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరానికైనా నీరు ఇచ్చారా? కాళేశ్వరం లేకుండానే మా ప్రభుత్వం అత్యధికంగా వరి పంటను ఉత్పత్తి చేసింది. గత పాలకులు ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా? కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులన్నీ పెండింగులోనే పెట్టారు. ఎలాంటి ప్రయోజనం లేని కమాండ్ కంట్రోల్ సెంటర్, ప్రగతిభవన్, సచివాలయం మాత్రమే కేసీఆర్ పూర్తిచేశారు.

### కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతివ్వలేదు

కేటీఆర్ జీవితంలోనే అధికారం అనే రేఖ లేదు. కుమారుడి విషయంలో కేసీఆర్ ధృతరాష్ట్రుడిలా మారారు. కేటీఆర్ దశే బాగాలేకపోతే కేసీఆర్ ఎన్ని దిశలు మార్చినా ఏం లాభం? కేటీఆర్ ఎన్నికల ప్రచారం పుష్ప సినిమాలో శ్రీలీల ఐటమ్‌సాంగ్‌ను గుర్తుకు తెస్తోంది. 3 నెలలు అవుతున్నా కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి ఇవ్వలేదు. కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్ని కూడా నేను రద్దు చేయలేదు. వాటిని కొనసాగిస్తూ అదనంగా అనేక కొత్తపథకాలు తీసుకొచ్చాను. ఎస్సీ వర్గీకరణపై ఎవరూ చేయని సాహసం చేశాను. వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలిపాను. దేశంలో ఎవరూ చేయని కులగణనను రాష్ట్రంలో చేసి చూపించాను. తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించాను. మహిళలకు ఉచిత ప్రయాణం సహా అనేక ఎన్నికల హామీలు నెరవేర్చాను.

### భాజపాకు డిపాజిట్ వస్తే దేశం మొత్తం గెలిచినట్లే

రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు గుజరాత్ తరలి వెళ్లేందుకు భాజపా నేతలు కృషి చేస్తున్నారు. సెమీ కండక్టర్ల కంపెనీ ఆ రాష్ట్రానికి తరలించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి యత్నిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపాది ఫెవికాల్ బంధం. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాం. ఇప్పటి వరకు విచారణ ఎందుకు ప్రారంభించలేదు? జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో డిపాజిట్ తెచ్చుకుంటే భాజపా దేశం మొత్తం గెలిచినట్లే. మరో 8 ఏళ్లు మేమే అధికారంలో ఉంటాం. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు రావు. 2029 జూన్‌లో జమిలి ఎన్నికలు వస్తాయి. నేను చెప్పేది రాసి పెట్టుకోండి.. 2034 జూన్ వరకూ కాంగ్రెస్సే అధికారంలో ఉంటుంది"అని రేవంత్ అన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. ప్రచారానికి తెర

మొదటి పేజీ తరువాయి...

ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. "561 కంట్రోల్ యూనిట్లు, 595 వీవీ ప్యాట్స్, 2,394 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. పోలింగ్ స్టేషన్ల నుంచి వెబ్ కాస్టింగ్ లైవ్ స్ట్రీమింగ్ ఉంటుంది. అన్ని పోలింగ్ స్టేషన్స్ వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఓటర్ల క్యూ మెయింటెన్ చేయడానికి %చీజజ% వాలంటీర్లు పని చేయనున్నారు. పోలింగ్ స్టేషన్ల వద్ద మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ పారామిలిటరీ బలగాలు బందోబస్తులో ఉంటాయి. డ్రోన్ల ద్వారా మానిటరింగ్ చేస్తాం. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఓటర్లకు డబ్బులు పంపే అంశంపై ఆర్‌బీఐతో మీటింగ్ పెట్టాం. ఆర్‌బీఐ మానిటరింగ్ ఉంటుంది. ఇప్పటినుంచి 11 సాయంత్రం వరకు వైన్ షాప్‌లు క్లోజ్ ఉంటాయి. ఓటర్లందరూ ముందుకు వచ్చి ఓటు వినియోగించుకోవాలి" అని ఆర్వీ కర్ణన్ తెలిపారు.

### 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు..

హైదరాబాద్ జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. 65 లొకేషన్స్ లో 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద పారా మిలిటరీ బలగాలు ఉంటాయి. అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసుల బందోబస్తు ఉంటుంది. ఎన్నికల ఉల్లంఘన కేసులు 27 నమోదయ్యాయి. ఇప్పటివరకు 3 కోట్ల 60 లక్షల నగదు పట్టుకున్నాం. ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాం. ఇప్పటివరకు ఎలాంటి లా అండ్ ఆర్డర్ ఘటనలు జరగలేదు. 230 రౌడీ షీటర్లను బైండ్ ఓవర్ చేశాం. 1,761 లోకల్ పోలీసులు బందోబస్తులో ఉంటారు. 8 కంపెనీల బలగాలు బందోబస్తులో ఉంటాయి కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జరుగుతున్న ఈ ఉపఎన్నిక కోసం ప్రధాన పార్టీలు సర్వశక్తులూ ఒడ్డి ప్రచారం చేశాయి. ప్రత్యేకించి అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రచారాన్ని హోరెత్తించాయి. మరోవైపు బీజేపీ సైతం గెలుపు కోసం తీవ్రంగా శ్రమించింది. అయితే విజయం ఎవరిని వరిస్తుందో, ప్రజానాడి ఏమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు. సుమారు 4 లక్షల ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో తమ మనోగతాన్ని వెల్లడించేందుకు ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే ఆ పార్టీ ప్రజాపాలనకు లేదా బీఆర్ఎస్‌ను ప్రజలు మళ్లీ ఆదరిస్తే ఆ పార్టీ చెబుతున్న ప్రజావ్యతిరేకతకు ఈ ఉపఎన్నిక ఫలితం రెఫరెండం అవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌ను గెలిపించండి

మొదటి పేజీ తరువాయి...

ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం మంత్రి పొంగులేటి రెహ్మత్ నగర్ డివిజన్‌లోని కార్మికనగర్, బ్రహ్మ శంకర్ నగర్, రామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు, కార్యకర్తలతో మమేకమయ్యారు. సాయంత్రం రెహమత్ నగర్ నుంచి బోరబండ వరకు మంత్రి పొంగులేటి నిర్వహించిన భారీ ర్యాలీకి విశేష స్పందన లభించింది. వేలాదిమంది కాంగ్రెస్ జెండాలు చేతబూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగలేటి స్ఫూర్తిదాయకంగా ప్రసంగిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పొంగులేటి ప్రసంగానికి ప్రజలు భారీగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన 23 నెలలుగా తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసి జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఈ ప్రాంతానికి ఎంతో సుపరిచితుడూ, యువకుడైన నవీన్ యాదవ్ కు అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గడిచిన 12 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించలేదు. 10 సంవత్సరాలు బీఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉ



న్నప్పుడు ఈ నియోజకవర్గంలో ఆ పార్టీకి చెందిన ఎంఎల్ ఏ ఉన్నాగానీ ఈ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పేరుకే సంపన్నుల నియోజకవర్గం.. వాస్తవానికి ఇక్కడ మెజారిటీగా ఉన్నది బడుగు, బలహీన, పేదలు నిరుపేదలే.వీళ్ల సంక్షేమాన్ని పది సంవత్సరాలలో అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ ఏనాడూ పట్టించుకోలేదని మంత్రి గారు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును గుర్తించి జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీని అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని మంత్రిగారు అందరికీ పేరు పేరున విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్‌లో 2వ నెంబరు కలిగిన కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి మీ సంక్షేమానికి, కాంగ్రెస్ పార్టీ విజయానికి బాటలు వేయాలని, ఈ ప్రాంతప్రజలకు ఇంతకంటే మంచి అవకాశం రాదని ఆయన అన్నారు.

# ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు

మొదటి పేజీ తరువాయి...



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రశ్నకు భగవత్ బదులిస్తూ, "మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి" అని వివరించారు. దేశానికి మేలు చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు.

"ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు" అని ఆయన తేల్చిచెప్పారు.

# కొల్లూరు కాలనీ వాసులకు 24 గంటల్లో హామీలు నెరవేర్చాం

**హైదరాబాద్, నవంబర్ 9 (నినాదం):** కొల్లూరు కాలనీ వాసులకు వారం రోజుల క్రితం ప్రభుత్వ పక్షాన ఇచ్చిన హామీలను 24 గంటలు తిరక్కముందే అమలు చేయడం ప్రారంభించామని ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనాదక్షతకు నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కొల్లూరు కాలనీలో సుమారు 16 వేల కుటుంబాలకు చెందిన 48 వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. వారం రోజుల క్రితం ఈ కాలనీని సందర్శించిన మంత్రి పొంగులేటి , ఇతర మంత్రుల ఇచ్చిన హామీ నేపథ్యంలో ఆదివారం నాడు మరో సమావేశం నిర్వహించారు సమావేశంలో సహచర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్,ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ్ సహాయం రఘుకుమార్ రెడ్డి , మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, కౌన్సిలర్ భరత్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కొల్లూరు 2 బిహెచ్‌కే కాలనీ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వారం రోజుల క్రితం ఇచ్చిన మాట ప్రకారం కాలనీ వాసుల చాలా సమస్యలను 24 గంటల్లోనే పరిష్కరించామని వివరించారు. కాలనీలో సన్నబియ్యం తీసుకునే లబ్ధిదారుల కోసం రేషన్ షాపు, కాలనీలోపలకి ఆర్టీసీ బస్సులు వచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. కాలనీవాసుల రక్షణ కోసం శాశ్వత పోలీస్ స్టేషన్ నిర్మాణం నిర్మాణం చేపట్టాం. అంతేగాక 24 గంటల్లోనే తాత్కాలికంగా ఔట్ లెట్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. అత్యవసర కోసం రెండు అంబిలెన్స్ లను అందించామని తెలిపారు. కాలనీలో స్పీడ్ బ్రేకర్లు, సెంట్రల్ లైటింగ్ వెంటనే ఏర్పాటు చేస్తామని, శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయని తెలిపారు. కాలనీలో అరులైన పేదలందరికీ గృహ జ్యోతి పథకం కింద 200 వరకు యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందిస్తామని వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ తీసుకునే విధంగా వచ్చే నెల నుంచి ఇక్కడే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాలనీలో షాపుల ఏర్పాట్లకు త్వరలో టెండర్లు పిలుస్తామని చెబుతూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే కాలనీవాసులు కమిటీని వేసుకోవాలని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు.

# రేషన్ @ కరెప్షన్

మొదటి పేజీ తరువాయి...

ఇందుకు రేషన్ షాపు వద్ద దళారులు అమ్మకాలు, కొనుగోలు చేయడమే. ఒకటో తేదీ రేషన్ అందించడం మొదలు రేషన్ దుకాణం మూసే 15వ తేదీ వరకు రేషన్ షాపు వద్ద కొనుగోలు దళారులు బియ్యం తీసుకుంటున్నట్లు నటిస్తూ, లబ్ధిదారులు బియ్యం తీసుకున్న మరుక్షణమే వారి వద్ద నుంచి దళారులు బియ్యం కొనుగోలు చేసి నగదును చేతుల్లో పెడుతున్నారు. ఇక కొంతమంది డీలర్లు దళారీ అక్కడికి రాకపోయినా వారితో ఉన్న లోపాయ కారు ఒప్పందాలతో లబ్ధిదారులు బియ్యం తూకం వేసుకున్న మరుక్షణమే వారి చేతిలో నగదు పెట్టి పంపిస్తున్నారు దాదాపుగా ఇల్లందు తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా రేషన్ దుకాణాల వద్ద ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

### బస్తాలకు బస్తాలు బయటికి..

సివిల్ సప్లై అధికారులు లబ్ధిదారులకు అందించే రేషన్ బియ్యం బస్తాలు దళారుల వద్దకు చేరడం వెనక రేషన్ డీలర్ల హస్తం ఉందనడానికి దళారులు వారి వాహనాల పైన బహిరంగంగానే తీసుకువెళ్లడమే ఒక ఉదాహరణ. నేరుగా దుకాణాల ఒక వద్దకు వచ్చిన లబ్ధిదారులకు డీలర్లు నగదు ముట్ట చెప్పి వారిని పంపించిన అనంతరం దళారులను పిలిపించి వారి వద్ద ఉన్న బియ్యాన్ని దళారులకు అప్పగించడంతో సివిల్ సప్లై బస్తాలలోని ఆ బియ్యాన్ని తీసుకువెళ్లడం గమనార్హం. దీన్నిబట్టి చూస్తే డీలర్లే దళారులగా మారి దందాను బహిరంగంగానే చేస్తున్నారని చెప్పవచ్చు.

### రూ.10 నుంచి రూ.12లకు కొనుగోలు..

రేషన్ బియ్యాన్ని దళారులు ఆయా ప్రాంతాన్ని బట్టి పరిస్థితులను బట్టి రూ.10 నుంచి 12 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అయితే దళారులు ముందుగా రేషన్ డీలర్లతో చేసుకున్న ఒప్పందం ప్రకారం వారికి ఇందులో కిలోకి రెండు రూపాయలు చొప్పున ఇవ్వడం జరుగుతున్నట్లు తెలుస్తుంది. రేషన్ షాపు వద్ద నేరుగా లబ్ధిదారుల నుంచి దళారులు కొనుగోలు చేస్తే కేజీకి రూపాయి కమిషన్, దళారులు రాకుండా రేషన్ డీలర్లే లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేసి దళారులకు అప్పగిస్తే కేజీ కి రెండు రూపాయల కమిషన్ అప్పగించే విధంగా ఒప్పందం చేసుకొని దందా కొనసాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంపిణీ సమయంలోనే డీలర్లు లబ్ధిదారులతో మాట్లాడి రేషన్ దుకాణం వద్దనే లబ్ధిదారులకు నగదు ముట్ట చెప్పి పంపిస్తున్నారు. ఇక ఇంటి వద్దకు వచ్చి కొనుగోలు చేసే దళారీ వ్యవస్థకు చెందిన సిబ్బంది 8 నుండి 10 రూపాయలకు కొనుగోలు చేసి వాటిని అప్పగిస్తున్నారు.

### మొద్దు నిద్రలో సివిల్ సప్లై అధికారులు..

రేషన్ దుకాణాల వద్ద దళారి వ్యవస్థతో పాటు లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేసే డీలర్లు రేషన్ అక్రమ దందాకు పాల్పడుతున్నారన్న విషయం తెలిసి కూడా సివిల్ సప్లై అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ సప్లై మొదలుకొని పంపిణీ ముగిసేంతవరకు ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా ఏ ఒక్క రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసిన దాఖలాలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంటే ఈ వ్యవస్థ ఎంత మొద్దు నిద్రలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. తనిఖీల నిర్లక్ష్యమా లేక వీరికి దళారులకు రేషన్ డీలర్లకు మధ్య ఏమైనా అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆకస్మిక తనిఖీలు చేపడితే రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయగా మిగులు బియ్యం దొరికే అవకాశం ఉంటుంది. ఏది ఏమైనా సివిల్ సప్లై అధికారులు తనిఖీ చేయకపోవడం రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు కేసులు నమోదు చేయకపోవడం మూలాన వీరి వ్యవస్థ మర్రిచెట్టు ఊడల్లా పాదుకపోవడంతో పాటు విస్తరిస్తుంది. దీనిపై సివిల్ సప్లై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ లక్ష్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

# ఒక్కఛాన్స్ పేరుతో ఏపీ నష్టపోయింది

మొదటి పేజీ తరువాయి...

ఎన్డీయే కూటమి తరపున మంత్రి లోకేశ్ బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఆయన పాట్నాలో మీడియా సమావేశం నిర్వహించారు. "ఆంధ్రప్రదేశ్ మంత్రిగా నేను ఇక్కడకు రాలేదు. బాధ్యతాయుత భారతీయ పౌరుడిగా ఇక్కడకు వచ్చాను. బీహార్ లో జరగబోయే ఈ ఎన్నిక భారత రాజకీయాల్లో ఎంతో కీలకం. బీహార్ యువత మరోమారు ఎన్డీయేను ఎందుకు గెలిపించాలో చెప్పడానికే ఇక్కడకు వచ్చాను. మూడు కారణాలతో ఇక్కడి ప్రజలు ఎన్డీయేను గెలిపించాలి" అని మంత్రి పేర్కొన్నారు. ఆ మూడు కారణాలు ఇవే.. స్వచ్ఛమైన, అవినీతిరహిత పాలన కోసం ఎన్డీయేను గెలిపించాలి. ప్రధాని నరేంద్ర మోదీ బీహార్ రూపురేఖలు మార్చేశారు. బీహార్ లో నాని (నరేంద్ర మోదీ, నితీశ్ కుమార్) నాయకత్వం ఉంది. ఏపీలో నరేంద్ర మోదీ, నాయుడు గారి నాయకత్వం ఉంది. విజన్, సమర్థతతో వారు పాలన చేస్తున్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో బీహార్ పాత్ర చాలా పెద్దది. బీహార్ ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే మోదీ లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు.

# 100 కోట్ల కబ్జాలో..
# దారి తప్పిన దస్త్రం..!



**రెవెన్యూ, మున్సిపల్ రికార్డుల్లో గందరగోళం**

**జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం) :** లక్ష రూపాయలు ఇస్తే రికార్డులు మార్చి ఇంటికి పంపే దుర్భర అధికార యంత్రాంగం ఉన్న రాష్ట్రం మనది. ఖద్దరు గాళ్లను సంతృప్తి పరచడమే ఉద్యోగం ఉద్యోగం అయిపోయింది.. పొలిటికల్ పంచన చేరిన ఫస్ట్ క్లాస్ పల్చబడిపోయింది. ప్రజాస్వామ్యం అడుగడుగున కూని అవుతూనే ఉంది. ఆర్టికల్ 19 బాడుగ పనులు చేస్తుంది. సొసైటీ కళ్ళకు గంతలు కట్టడం కోసం పార్టీ కో పత్రిక పనిచేస్తుంది. వాస్తవం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంది. ప్రధాన సంస్థల్లో పని చేస్తున్న కొందరు వైట్ కలర్ అక్రమలతో అంటగా అవుతున్నారు. ఈ కోవకు చెందినదే జగిత్యాల జిల్లా కేంద్రంలో 100కోట్ల కబ్జా బాగోతం..! కిబాల పత్రం ద్వారా కొనుగోలు చేశామన్న కబ్జాదారులు, కిబాల పత్రం ఎక్కడ సమర్పించకుండానే మున్సిపల్, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకోవడం ఆశ్చర్యాన్ని గురిచేస్తుంది.. కబ్జాదారుడు 1954-55 కాస్రా పహానిలోకి పట్టాదారుడిగా వచ్చినట్టు రికార్డులు నమోదు చేశారు. కాస్రా పహానిలో 138 సర్వేనంబర్‌లో 13.19 ఎకరాలు మున్సిపల్ లోకల్ ఫండ్‌ను, 25 గుంటలకు దారం వీరమల్లయ్యను పట్టాదారులుగా చూపెడుతూ, రెవెన్యూ అధికారులు ఒక రికార్డును గతంలో జారీ చేశారు. అందులో మున్సిపల్ లోకల్ ఫండ్ ద్వారా పట్టాదారుడైన ఇనుములపల్లి నర్సింగ రావు వద్ద కొనుగోలు చేసినట్టు అందులో పేర్కొన్నారు. విలువైన అధికారం అమ్ముడుపోయింది. అక్రమార్కులు విసిరిన నోట్ల కట్టలకు దాసోహమైందని స్పష్టం అవుతుంది. 1975 వరకు పహానిల్లో 25 గుంటలు , 1976-77 పహానీలో 20 గుంటలుగా కుదించబడింది. అవినీతికి మరిగిన గ్రీనింకు రెవెన్యూ రికార్డులను బలవంతంగా బలిపీఠం ఎక్కించారు. 1952లోనే మున్సిపాలిటీ వద్ద 20 గుంటల భూమిని కిబాల పత్రం ద్వారా కొనుగోలు చేస్తే . 25 గుంటలు ఎలా రికార్డుల్లోకి చేరిందన్నది. అధికారులు తేల్చాల్సి అంశం. కన్ను మిన్ను గానకుండా రికార్డులను సరి చేసే క్రమంలో అధికారులు అడ్డంగా దొరికిపోయారు.. రెవెన్యూ రికార్డుల్లో ఇష్టానుసారంగా మార్పులు చేశారన్నది స్పష్టం అవుతుంది. మున్సిపల్ చైర్ పర్సన్ గా ఐదేళ్లు కొనసాగిన వారిలో జిఆర్ దేశాయ్ గిరి నాగభూషణం తాటి పర్తి విజయలక్ష్మి భోగ శ్రావణి. ఇన్చార్జి చైర్పర్సన్ గోలి శ్రీనివాస్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి ఉన్నారు. కొత్త బస్టాండ్ ప్రధాన కూడలిలో ఉన్న ఈ కబ్జా వ్యవహారాన్ని చూసి చూడనట్లు వదిలేశారు. గతంలో గెలిచిన స్థానిక ఎమ్మెల్యేలు మంత్రులు ఎమ్మెల్సీలు మున్సిపల్ చైర్ పర్సన్ లు ఈ కబ్జా వ్యవహారంలో అంటగాగిన వారే విమర్శలు ఉన్నాయి. వీళ్ళ హయంలోని భవన నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులు ఇచ్చి కబ్జాదారులకు సహకరించినట్లు తెలుస్తుంది.. నిర్మాణాలకు ఇలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండానే అనుమతిలిచ్చి ఇంటి నెంబర్లు ఇచ్చి పారదర్శకత్వం చాటుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ లు మన మధ్యనే తిరుగుతున్నారు. ఖద్దరు గాళ్లు వైట్ కాలర్లు కలిసి ఈ కబ్జా కోరు పంచన చేరి ఏళ్ల తరబడి ఈ సమస్యను తెమలకుండా చేస్తున్న వారిలో ప్రథములుగా ఉన్నట్లు అవగతం అవుతుంది. కబ్జాకు సంబంధించిన పత్రాలను తారుమారు చేయించడంలో వీళ్లే కీలకంగా వ్యవహరించినట్లు గతంలో జిల్లా కేంద్రంలో పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారులు చెబుతున్నారు. సేవా ముసుగులో కబ్జాదారునికి కాపలాగా వ్యవహరిస్తూ జగిత్యాల పట్టణ ప్రజల కళ్ల కు గంతలు కట్టారు. కలెక్టరేట్లో ఆర్డీవో కార్యాలయంలో అడ్డావేసిన ఈ సోకాళ్లు వైట్ కాలర్లు ఇతర మీడియా ప్రతినిధులను ఎంట్రీ కానివ్వకుండా వ్యవహరించడంలో ఏళ్ల తరబడి సక్సెస్ అవుతూ వస్తున్నారు. అధికారులు కూడా వీళ్ళకే వత్తాసు పలుకుతూ పబ్బం గడుపుకుని వెళ్ళిపోతున్నారు. .. సర్వే నంబర్ 138లోని 20 గుంటల భూమి 100 కోట్లకు పైగా విలువ చేస్తుందని, యాజమాన్య హక్కులు లేకుండా పెట్రోల్ బంక్ వ్యాపారి వారసులు అనుభవి స్తున్నారని, హైకోర్టు సింగిల్ డివిజన్ బెంచ్‌లు ఇచ్చిన తీర్పుల్లో సైతం వారికి భూమిపై టైటిల్ ఇవ్వలేదని స్పష్టం చేసింది. ఇచ్చిన పొజిషన్ ను కొనుగోలుగా చిత్రీకరించి అనుభవిస్తున్నట్లు తెలుస్తుంది. విలువైన భూమిని మున్సిపల్ స్వాధీనం చేసుకోవాలని పట్టణ ప్రజలు ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధులు అడ్డుపడుతూ వచ్చారు. దీంతో అధికారులు పట్టించుకోలేదు . దారం వీరమల్లయ్య వారసులు 1952లో మున్సిపాలిటీ ద్వారా 20 గుంటలు కొనుగోలు చేశాడని కథ చెప్పడమే తప్ప కోర్టులో ఎక్కడ నిరూపించుకోలేదు.

**అంతా జిరాక్స్ పేపర్‌తోనే...**

న్యాయస్థానాల్లో కిబాల పత్రం జిరాక్స్ ప్రతిని అందజేసి నట్లు తెలుస్తుంది.. రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల్లో ఇంత వరకు కిబాల పత్రం జిరాక్స్ ప్రతులు లేకపోవడం విశేషం.. 20 గుంటల స్థల వివాదం తెరపైకి రావడం తో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. ఈ కబ్జాపై రిపోర్ట్ తయారు చేయాలని స్థానిక సంస్థల కలెక్టర్ కు మున్సిపల్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు న్యాయస్థానాల్లో కబ్జాదారులు సమర్పించిన కిబాల పత్రం జిరాక్స్ సేకరించి అనువాదం చేయగా. ఉర్దూ పత్రంలో ఎక్కడా కిబాల అనే పదమే లేదని స్పష్టమైనట్లు తెలుస్తుంది. కొన్ని షరతులతో పెట్రోల్, కిరోసిన్ బంక్ ఏర్పాటుకు, షెడ్డు నిర్మాణానికి మున్సిపల్ కమిటీ తీర్మానం ఆమోదించినట్టు, తెలుస్తుంది. కబ్జాదారులు ఇన్నాళ్లు కిబాల పత్రం కొనుగోలు పత్రం అని చెబుతూ జిల్లా ప్రజలను మోసం చేస్తూ వచ్చారనే చర్చ నడుస్తుంది కిబాల జిరాక్స్ పత్రంలో మున్సిపల్ సంబంధించిన ముద్రలు లేవు అధికారుల సంతకాలు లేవని తెలుస్తుంది. కబ్జాదారుల వద్ద నిజమైన పత్రమై ఉంటే ఇప్పటికీ యాజమాన్య హక్కులు పొంది ఉండేవారు. లేకనే ఈ చందమామ కథలతో ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆస్తులను అనుభవిస్తూ కోట్లు గడించారు. ఈ కబ్జాదారులు అంట గాగిన ప్రజాప్రతినిధులు వైట్ కా లర్లు జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఎమ్మెల్యే సన్నాయి నొక్కులు..!**

ఈ 100 కోట్ల కబ్జా వెనుక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఉన్నారని ఖచ్చితమైన ఆరోపణలు చేసిన మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ శ్రావణి కి సమాంతరంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కక్కలేక మింగలేక పొడి పడి మాటలతో ముగించారు. భూమి అన్యాక్రాంతమైతే తమ మద్దతుండదని జెనరలైజ్ చేసి మాట్లాడారు. అలాగే కలెక్టర్ వ్రాసిన వినతిపత్రంలో పొడి పడి మాటలతో ముగించారు. డివైడర్ అలైన్మెంట్ ఉన్నప్పుడు 5 ఫీట్లు ఆర్ అండ్ బి కార్యాలయం వరకు జరిపించిన మాట వాస్తవమని భోగ శ్రావణి చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఒకవైపు తనకి సంబంధం లేదంటూనే తెరవెనుక ఈ కబ్జా కోరును వెనుకేసుకొస్తున్నట్లు మున్సిపల్ మాజీ చైర్పర్సన్ శ్రావణి ఏ కాదు జగిత్యాల పట్టణ ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు. అధికారుల పారదర్శకత ఎంత ఉందో ఈ స్థలంపై వచ్చే నివేదిక ద్వారా తెలుస్తుంది.

# ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు అందని వేతనాలు



**మిర్యాలగూడ, నవంబర్9(నినాదం):** రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు సమయానికి రాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. సమయానికి తమకు జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా ఉందని గృహ, ఇతర ఇఎమ్ఐలు సకాలంలో చెల్లించ లేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల వేతనాలను చెల్లించాలని కోరారు. ప్రతినెల సమయానికి జీతాలు ఇవ్వకపోవడంతో రకరకాల ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని బాధపడుతున్నామన్నారు. ఒకపక్క బ్యాంకులకు రుణాలు చెల్లించలేక గృహ, ఇతర అవసరాలకు సమయానికి డబ్బులు అందక మానసిక వేదనకు గురవుతున్నామన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులపై వివక్షను వీడి ఇప్పటికైనా విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్ధతిలో జీతాలు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# 96 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం

**ధాన్యానికి 158 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ**

**ధాన్యం కొనుగోలు చేయ లేదంటా.. ట్రక్ షీట్ జారీపై డి సి ఓ విచారణ**



**మిర్యాలగూడ నవంబర్ 9: (నినాదం) :** మిర్యాలగూడ మండలం అవంతిపురం లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో దాన్యం కొనుగోలు చేయకుండానే అక్రమంగా ట్రక్ షీట్ జారీ చేయడంపై ఆదివారం జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎం పత్యానాయక్ విచారణ నిర్వహించారు. అవంతిపురం ధాన్యం కొనుగోలు కేంద్రానికి చేరుకొని కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలను సేకరించారు. సెంటర్ కు దాన్యం రాకుండానే నేరుగా రైతు కల్లం వద్దకి బస్తాలు ఇవ్వడం పచ్చి సరుకును నేరుగా పట్టణ పరిధిలోని శ్రీ శివ సాయి రైస్ ఇండస్ట్రీస్ కు తరలించారు పిఏసిఎస్ కేంద్రం నుంచి ట్రక్ షీట్ జారీ చేయడం జరిగింది. ఈ విషయం పైన ఆలగడపఆలగడప పిఏసిఎస్ సీఈఓ సైదులు ను విచారణ చేసి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ధాన్యం కొను గోలు కేంద్రంలో 17 శాతం తేమ ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని వివరిం చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని, మరో 75 ధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 96వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 158 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని వివరించారు. ఆయన వెంట ఇంచార్జి ఏ డి ఏ సైదా నాయక్ తదితరులు ఉన్నారు.

# జూబ్లిహిల్స్‌లో హోరెత్తిస్తున్న బీఆర్ఎస్ ప్రచారం

**గడప గడపలో కేసీఆర్ సంక్షేమం**

**మాగంటి సునితమ్మ గెలుపు ఖాయం**





**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం) :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచారం హెూరెత్తిస్తున్నది. సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ మాగంటి సునీతమ్మను గెలిపించాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో చివరి రోజు ఆదివారం ప్రచారాన్ని బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. రహ్మత్ నగర్ డివిజన్ లో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు గట్టు యాదవ్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వందేండ్ల సంక్షేమ పాలనకు పట్టం కట్టడానికి సిద్ధమయ్యారని, సంక్షేమ పథకాలు బంద్ పెట్టిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడానికి ప్రజలు సన్నద్ధం అయ్యారని గట్టు యాదవ్ అన్నారు. వనపర్తి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు గత 22 రోజులుగా జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో ప్రచారం నిర్వహించి ఓటర్లను కలసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, రెండేండ్ల విధ్వంస పాలనను వివరించి సునితమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా బకాయి పడ్డ రూ.2500 ఎగ్గొట్టి, వృద్ధులకు, వికలాంగులకు ఫించన్ల ద్వారా రూ.4000, కళ్యాణ లక్ష్మి ద్వారా తులం బంగారం, రైతులకు రైతు భరోసా, కెసిఆర్ కిట్టు, ఆటో కార్మికులకు రూ.12000, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా బరోసా, రైతు బీమా, రైతు రుణ మాఫీ ఏగనామం పెట్టి ఓట్లు అడుగుతున్న కాంగ్రెస్ పార్టీనీ తరిమి కొట్టాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# అమరావతి దేవాలయ భూమిలో అక్రమ కట్టడాలు అడ్డుకుంటాం

**మునిసిపల్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారు.....?**

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు సిపిఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు**



**కోదాడ(నినాదం):** దేవాలయ భూముల అన్యాక్రాంతం పై సిపిఐ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని కోదాడ ఖమ్మం జాతీయ రహదారి పక్కన ఉన్న అమరావతి తమరబండపాలెం బాలాజీ దేవాలయ భూమిలో అక్రమంగా ఇంటిని నిర్మిస్తున్న స్థలాన్ని మీడియా ముందు పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. పూర్వీకుల నుండి అమరావతి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రెండు ఎకరాల 13 కుంటలు, తమ్మర బండ పాలెం, బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి రెండు ఎకరాల 16 గుంటల భూమి ఉందన్నారు కాగా గత కొన్నేళ్ల క్రితం ఆక్రమణలకు గురి అయితే సిపిఐ పక్షాన పోరాడి ఆ దేవాలయ భూములు అన్యా క్రాంతం కాకుండా కాపాడామన్నారు. కాగా ఇటీవల ఓ వ్యక్తి అమరావతి లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టారన్నారు. ఆలయ భూమిలో మున్సిపల్ అధికారులు ఇంటి నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారనీ ప్రశ్నించారు. లక్షల రూపాయల విలువ చేసే ఆలయ భూములను ప్రభుత్వం అన్యాక్రాంతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాబోయే రోజుల్లో సిపిఐ పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఆలయ భూములు పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు..



# అనంతగిరి అయ్యప్ప సన్నిధిలో నిత్య అన్నదానం

**34వ రోజు 550 మంది అయ్యప్ప మాలదారులు బిక్ష స్వీకరణ**



**కోదాడ/అనంతగిరి (నినాదం):** తెలంగాణ శబరిమలగా పేరుగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రసార సమితి సూచనలతో 58 రోజులపాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా 34వ రోజు ఆదివారం 550 పైగా అయ్యప్ప మాలదారులు పాల్గొని బిక్షను స్వీకరించారు. దాతలుగా గోల్ తండా గ్రామానికి చెందిన,నూణావత్ ప్రవీణ్ కుమార్- శిరీష దంపతులు, పాలవరం వాస్తవ్యులు లికందగట్ల కోటయ్య - సైదమ్మ దంపతులు, రంగయ్య గూడెం గ్రామా నికి చెందిన (అంగన్వాడీ టీచర్) గద్దె శ్రీదేవి వ్యవహరించారు. ఈ. కార్యక్రమంలో కొండపల్లి వాసు గురుస్వామి,యరసాని మన్మథ కుమార్, ఐ వెంకటేశ్వర్లు,గరిడేపల్లి గోపి,తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



**సిద్దిపేట (దుబ్బాక)నినాదం:** తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా కేక్ కట్ చేసి టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచుకుని ఘనంగా నిర్వహించారు పంది రాజు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాడు నేడు ప్రజల ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది కాంగ్రెస్ ప్రజా పాలనే అని అన్నారు నేడు 2లక్షల రైతు రుణమాపి, ఉచిత బస్,200 యూనిట్ల కరెంట్,రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు,సన్నబియ్యం,500 సబ్సిడి గ్యాస్,ఇలా చెప్పుకుంటూ పోతే మరెన్నో పథకాలను పేదలకు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి దే ప్రజల ఆశీసులతో దేవుడి దయ వల్ల నిండు నేరేళ్లు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు అనిల్ ఆత్మ కమిటీ డైరెక్టర్ లు బెజ్జనబోయిన ప్రవీణ్, మిద్దె సంతోష్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు వడ్డే కిష్టయ్య,బాలకృష్ణ,స్వామి చరణ్, సీనియర్ నాయకులు బెజ్జనబోయిన రాములు, జంగపల్లి ఆంజనేయులు,పంది నర్సింలు, కలేపు భూపతి,పోతరాజు రెడ్డి,కలేపు రాజు,యూత్ కాంగ్రెస్ నాయకులు భాను,ప్రశాంత్,స్వామి,సాజిద్, మధు తదితరులు పాల్గొన్నారు

# నాలుగు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య**



**మిర్యాలగూడ నవంబర్ 9(నినాదం):** రైతులకు మదర్ డైరీ నుండి రావలసిన పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం మిర్యాలగూడ నియోజకవర్గంలోని ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం పిల్లుట్ల సైదులు అధ్యక్షతన మిర్యాలగూడలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలోని వేలాది మంది రైతులకు మదర్ డైరీ నుండి సుమారు 40 కోట్ల రూపాయల పాల బిల్లులు మూడు నెలల నుండి రాకుండా పెండింగ్లో ఉన్నాయని వెంటనే చెల్లించాలని పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు.మదర్ డైరీ పాలకవర్గం అలాగే ఎండి నిర్లక్ష్యం వల్ల 4 నెలల నుండి పాల బిల్లులు రాకపోవడం మూలంగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని బిల్లులు ఇప్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాల వలన రాష్ట్రంలోని రైతులంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లుకేటాయిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయటం హర్షించదగ్గ విషయమని తెలంగాణ రాష్ట్రం నుండి ఎన్నికైన బిజెపి ఎంపీలు ఇద్దరు మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వెంటనే బిల్లును అమలు చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈనెల 11న నల్లగొండలో జరుగు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్క్ షాపుకు ప్రతినిధులంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు దబ్బీకార్ మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జటావతి రవినాయక్, పిల్లుట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి పెంటమల్ల సుకన్య,సంఘం జిల్లా కమిటీ సభ్యులు రెమిడాల బిక్షం, పులమ్మ, కన్నెకంటి సీతారాములు, రమేష్ బాబు, సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు మల్లు గౌతంరెడ్డి. తిరుపతి రామ్మూర్తి పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ముఖ్యమంత్రికి ఓటమి భయం

**కళాశాల యజమానులు మంత్రులు ఎమ్మెల్యేపై అక్కసు**

**బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్**



**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం) :** జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో ముఖ్యమంత్రికి ఓటమి భయం పట్టుకున్నదని, ఒకపక్క కళాశాల యజమానులు మరోపక్క మంత్రులు, ఎమ్మెల్యేలపై ఆయన అక్కస్సు వెళ్లగక్కుతున్నారని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, న్యాయవాది మున్నూరు రవీందర్ అన్నారు. ఈ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి రెఫరెండంగా మారుతున్నాయని పేర్కొన్నారు. అందుకే ముఖ్య మంత్రితో పాటు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, చివరకు గ్రామాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు కూడా జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని చెప్పారు. ఈ రాష్ట్రాన్ని దోచుకో దాచుకో అన్న చందంగా గత 10 సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్, ప్రస్తుత రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు బయటపడిందని అన్నారు. ఈ రెండు పార్టీలు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఒక ఓటుకు రూ.4 వేలు పంపిణీ చేసిన కూడా ప్రజలు బిజెపి పార్టీకి పట్టం కట్టక తప్పదని ఆయన జోష్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచి ఇప్పటివరకు వనపర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, మహబూబ్ నగర్, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలు, నియోజకవర్గాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొన్నారని విమర్శించారు. ఇంత డబ్బు కాంగ్రెస్ పార్టీకి ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేయలేక ప్రజా ధనాన్ని ఎన్నికల పేరుతో దుర్వినియోగం చేస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలవాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టమని తెలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి తన ఆవేదన తన మనసులో ఉన్న మాటను ప్రజలకు బహిర్గతం చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను గమనించిన ముఖ్యమంత్రి తన మంత్రివర్గ సహచర్లను, ఎమ్మెల్యేలను, కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను ఆయన హెచ్చరించడమే ఇందుకు నిదర్శ మని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువు కుంటున్న చదువుల ఖర్చులు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించలేక రాష్ట్రంలోని ప్రైవేట్ కళాశాలల యజ మానులను బెదిరిస్తున్నాడని ఆరోపించారు. స్కాలర్షి ప్లు ఇవ్వలేని ఈ ప్రభుత్వం కళాశాలలపై తనిఖీలు నిర్వహిస్తూ బెదిరింపులకు, బ్లాక్ మెయిల్ లకు పాల్పడుతుందని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కార్తీక్ రెడ్డి విజయం ఖాయం అని తెలిసిన కూడా ముఖ్యమంత్రి ప్రభుత్వ ఇంటిలి జెన్సీ విభాగం ద్వారా సర్వేల ద్వారా సమాచారం తెలుసుకొని ఇతర పార్టీల వారిని పోలీసుల ద్వార బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ధర్మం, న్యాయం కోసం దేశంలోని 140 కోట్ల మంది ప్రజల గుండెల్లో ఆయన గూడు కట్టుకున్నారని, అలాంటి ప్రధాన మంత్రి అమలు చేస్తున్న పథకాలను ముఖ్యమంత్రి తమ ఖాతాలో, కాంగ్రెస్ ఖాతాల్లో జమ చేసుకొని దొంగ రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎన్ని కోట్లు ఖర్చు చేసినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ లో ఎక్కువగా ముస్లిం మైనార్టీ ఓట్లు ఉన్నా గతంలో ముస్లింలకు మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం ఉప ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంలో రాజకీయ కోణం ఉందని వెల్లడించారు. మైనార్టీ ఓటు బ్యాంకు కోసం అజారుద్దీన్ కు మంత్రి పదవి కాంగ్రెస్ పార్టీ ఆగమేఘాల మీద ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దౌర్జన్యాలు, బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్, ప్రశ్నించిన వ్యక్తుల పైన కేసులు చేస్తున్నారని, నిజాయితీగా పనిచేస్తున్న పోలీసులపై ఉక్కు పాదం మోపుతూ అక్రమ బదిలీలు, సస్పెన్షన్ లకు పాల్పడుతుందని మున్నూరు రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు ఓటు విలువను తెలుసుకొని ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అధికారంలో ఉన్నంత మాత్రాన విర్ర వీగితే గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పట్టక తప్పదని ఆయన హెచ్చరించారు.

# శంకుస్థాపనకు శత దినోత్సవం



## ఘన నివాళి

**పాలేరు నవంబర్.09.( నినాదం):** ఖమ్మం జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు,కస్తాల సత్యనారాయణ,టీజీవో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ జిల్లా కోశాధికారి,కస్తాల వెంకటేశ్వరరావు అమ్మ కస్తాల రామ తులసమ్మ దశదినకర్మ సందర్భంగా వారి స్వగ్రామం కొండకోడిమ వైరా మండలం నందు శ్రద్ధాంజలి ఘటించిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు కార్యదర్శి మోదుగు వేలాద్రి అసోసియేట్ అధ్యక్షులు మల్లెల రవీంద్ర ప్రసాద్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్ జిల్లా సంక్షేమ అధికారిని గుడికందుల జ్యోతి మేడం రిటైర్డ్ ఎంపీడీఓ వెంకటపతి రాజు హెచ్ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు రుక్మారావు టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంతోటి తిరుపతిరావు,మోదుగు వెంకటేశ్వర్లు,గురుకుల రెసిడెన్షియల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఊటుకూరి దామోదర్,టీఎన్జీవో రఘునాథపాలెం యూనిట్ అధ్యక్షులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## చుంచుపల్లి ఎంపివోకు ఘన సన్మానం



**ఖమ్మం, నవంబర్ 09(నినాదం):** చుంచుపల్లి ఎంపివో సూదనపు సంధ్యను ఆదివారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్, మమత ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సామాన్య కుటుంబంలో జన్మించిన సంధ్య గ్రూప్ 2 ద్వారా మండల పంచాయతీ అధికారిగా ఎంపికైంది. ఈ సందర్భంగా పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి తన ప్రతిభతో మండల పరిషత్ అధికారిగా ఉద్యోగం సాధించడం -అభినందనీయమన్నారు. సంధ్యను స్ఫూర్తిగా తీసుకుని పలువురు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు ఉన్నత స్థాయికి ఎదగాలని పుల్లయ్య ఆకాంక్షించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవడంతో పాటు ఉన్నత ఆశయం, లక్ష్యంతో ముందుకు సాగాలని అప్పుడే అనుకున్న గమ్యానికి చేరగలుగుతామన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన సంధ్య అసాధారణ ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. సంధ్య వారి కుటుంబానికి కీర్తిని తెచ్చిపెట్టిందని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంధ్య తండ్రి ఉపేందరు కూడా సహచరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు -ఎండి జాకీర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఉపేందర్, ఆముదాల వెంకన్న, అక్రం, ఎల్. వెంకట్, చార్లెస్, బొర్రా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత



**ఖమ్మం, నవంబర్ 09 (నినాదం):** గ్రామంలో చిన్నపాటి పారిశుద్ర పనుల కోసం... అధికారుల వేపు చూసే ఈ రోజుల్లో.... మన గ్రామం మాన అభివృద్ధి అనే పేరుతో.. యువత ముందుకు వచ్చి గ్రామ అభివృద్ధి కోసం నడుం కట్టారు....కోయచిలక, రేగులచిలక గ్రామ ప్రజలు. ఖమ్మం నియోజవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలం జిమ్మపూడి, పాపటపల్లి వెళ్లే ప్రధాన రహదారి అయిన కోయచిలక, రేగుల చిలక గ్రామాల్లో ప్రధాన రహదారి మధ్యలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో రాత్రివేళ దగ్గరగా వచ్చేంతవరకు గుంతలు కనిపించకపోవడంతో కొన్ని బైక్ ప్రమాదాలు కూడా సంభవించాయి. అయినా ఏ ఒక్క అధికారి కూడా ఈ ప్రమాదాలపై స్పందించలేదు. దీని ద్వారా ఆయా గ్రామంలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని యువత ముందుకు వచ్చింది. మరీ పెద్ద ప్రమాదాలకు ఈ గుంతలు దారి తీయకూడదు అనే ఉద్దేశంతో ఆదివారం నాడు స్వచ్ఛందంగా గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టడం జరిగింది. గ్రామంలో ప్రధాన రహదారి నుండి లింకి రోడ్లకు వెళ్లే మధ్యదారిలో రాంపులు సైతం నిర్మాణంలు సొంత ఖర్చుతో చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి నాకు సహకరించిన రేగులచలక గ్రామ మాజీ ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్, నున్న వెంకటేశ్వర్ రావు , కొర్లపాటి రామారావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కోయచిలక యువ నాయకుడు తోట వెంకటేశ్వర్లు తెలిపారు.

### ఎమ్మెల్యే సాబ్.. జర దేఖో
### ప్రారంభానికి నోచుకోని రోడ్డు పనులు
### గతుకుల రోడ్డుపై ప్రజల ఇబ్బందులు
### అధికార పార్టీ నాయకులకు
### పట్టని రహదారి సమస్య
### లోకల్ ఎలక్షన్ జిమ్మిక్కులని జనం విమర్శ

" ఎన్నికల వేళ ఎన్నెన్నో చిత్రాలు చూస్తాం. అలాంటి చిత్రాల్లో ఇది ఒక విచిత్రం. లోకల్ ఎన్నికలకు ముందే రోడ్డు వేసి ఓట్లు కొల్లగొట్టాలని అధికార పార్టీ వేసిన ప్లాన్ ఫెయిల్ అయింది. సాక్షాత్తు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి శత దినోత్సవం పూర్తి చేసుకున్నా రోడ్డు పనులకు మోక్షం లేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడినట్లే రోడ్డు పనులు కూడా రేపుమాపని వాయిదా పడుతున్నాయి. ఈ రోడ్డు గురించి శంకుస్థాపన చేసిన భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుగానీ, ఆరోజు హడావుడి చేసి ఫొటోలకు పోజులిచ్చిన కాంగ్రెస్ లీడర్లుగానీ కనీసం పట్టించుకునే పరిస్థితి లేదు. ఇదంతా లోకల్ ఎలక్షన్ జిమ్మిక్కని జనం బాహాటంగా విమర్శిస్తున్నారు."

– భద్రాద్రి ఏజెన్సీ ప్రతినిధి (నినాదం)

ఇది జనం రేయింబవళ్ళు రద్దీగా తిరిగే చర్ల నుంచి ఛత్తీస్‌గఢ్ (పామేడు) వెళ్ళే మెయిన్ రోడ్డు. ఈ రూటులోనే సాయిబాబా టెంపుల్, కనకదుర్గమ్మ ఆలయం, ప్రభుత్వ జూనియర్ కాలేజి, ఏకలవ్య పాఠశాల, కస్తూరిబా విద్యాలయం, తాలిపేరు ప్రాజెక్టు, పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. చర్ల మండలంలో సుమారు 20 గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే చర్లకి వచ్చిపోతారు. ట్రాఫిక్ ఎక్కువగా



నిత్యం రద్దీగా ఉండే రహదారి



శంకుస్థాపన రోజు వేసిన శిలాఫలకం



స్థలదాతలతో కలిసి ఉన్న ఎమ్మెల్యే

ఉండే ఈ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడి రాళ్లులేచి వాహనాలు తిరగడానికి కాదుకదా, కనీసం మనుషులు నడవడానికి కూడా వీలు లేకుండా తయారైంది. అయినా గత్యంతరం లేనిస్థితిలో జనం ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించక తప్పడం లేదు. ఈ రోడ్డు కోసం బిఆర్ఎస్ నాయకులు ఆందోళన చేశారు. రోడ్డు మంజూరైందని కాంగ్రెస్ నాయకులు స్టేట్‌మెంట్స్ ఇచ్చారు. ఈ రకమైన పొలిటికల్ పోటీ నడుమ జూలై 21న హంగు ఆర్బాటాలతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి వర్గం నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, ఎఫ్‌డిసి చైర్మన్ పొదెం వీరయ్య వర్గం నాయకులు జవ్వాది రవికుమార్, బండారు రామకృష్ణ, మంత్రి తుమ్మల వర్గం నాయకులు అంతా హాజరైనారు.



రోడ్డు కోసం బీఆర్ఎస్ నాయకుల ఆందోళన (ఫైల్)

చర్ల నుంచి దోశిల్లపల్లి వరకు నిర్మించే ఈ రోడ్డుకి ఎంఆర్ఆర్ గ్రాంటు (2024-25) నుంచి రూ 110 లక్షలు మంజూరైనాయి. పనులు వేగంగా ప్రారంభించి నాణ్యతతో చేయించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆరోజు ఎమ్మెల్యే వెంకట్రావు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు చెప్పారు అయితే శంకుస్థాపన చేసి నేటికి 115 రోజులు అవుతున్నా ఇంతవరకు ఆ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ఇంతవరకు అసలు అగ్రిమెంట్ కానట్లు సమాచారం. దీనిని బట్టి చూస్తే ఎమ్మెల్యే మాటని సంబంధిత పిఆర్ అధికారులు పెడచెవిన పెట్టినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడుతున్నందున ఈ రోడ్డు గురించి పట్టించుకునేవారు కరువైనారు. శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యేగానీ, మేమే రోడ్డు మంజూరు చేయించామని చెబుతున్న అధికార కాంగ్రెస్ నాయకులుగానీ శ్రద్ధ చూపడంలేదు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆ రోడ్డుపై ప్రజలు అవే బాధలు పడుతున్నారు.

ఇటీవల వర్షాలకు ఆ రోడ్డు ఇంకా అధ్వానంగా తయారయింది. చర్ల పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ రోడ్డు గురించే లీడర్లు పట్టించుకోవడం లేదంటే ఇక మారుమూల గిరిజన గ్రామాల సమస్యలు ఏమి పట్టించుకుంటారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లాభపడటం కోసం హడావుడిగా శంకుస్థాపన చేసి వదిలేసారనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. లోకల్ బాడీ ఎలక్షన్స్ పెడతామని ప్రభుత్వం ప్రకటిస్తే అధికార పార్టీ నాయకులు అప్పుడు హడావుడి చేస్తారేమో అని ప్రజలు వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు...

## క్లినికల్ అమెండ్మెంట్ చట్టాన్ని సవరించాలి





### అర్హత కలిగిన వారికి ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లకు అనుమతులివ్వాలి
### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జె. రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్9(నినాదం):** ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ అసోసియేషన్ సిఐటియు ఆధ్వర్యంలో నేడు మంచి కంటి భవన్ లో జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ పాల్గొని మాట్లాడారు. 2010 క్లినికల్ అమెండ్మెంట్ చట్టం ప్రకారం అర్హత కలిగిన వారందరికీ ప్రైవేటు ల్యాబ్ లు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉండేదన్నారు. 2018 నుండి ఆ చట్టాన్ని సవరించి ఎంబిబిఎస్ చదువుకున్న డాక్టర్ మాత్రమే మెడికల్ ల్యాబ్ లను నడిపించాలని చట్టాన్ని చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఇటువంటి ఉత్తర్వులు జారీ చేయడం వల్ల సంపూర్ణ అర్హత కలిగిన ల్యాబ్ టెక్నీషియన్లకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ అర్హత కలిగిన వారికే ల్యాబ్ అనుమతులు ఇవ్వడం సరైనది కాదన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో మెడికల్ సపోర్టివ్ గా ఉండే విద్యార్హతలు కలిగిన ఎమ్మెల్టీ ,డి ఎం ఎల్ టి, బి ఎస్సి ఎమ్మెల్టీ విద్యార్హత కలిగిన వారందరికీ మెడికల్ ల్యాబ్స్ నడిపించడానికి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేవని పేరుతో మెడికల్ ల్యాబ్ ల పై అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, వెంటనే వాటిని ఆపివేయాలన్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్ కు అనుకూలంగా ఉండే ఇటువంటి విధానాలు ఆలంబించడం వల్ల అర్హతకలిగిన వారందరికీ నిరుద్యోగులుగా రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ డాక్టర్ ఉండాలనే నిబంధనను వెంటనే తొలగించి అర్హత కలిగిన వారందరికీ సర్టిఫికెట్ ఇప్పించి మెడికల్ ల్యాబ్ లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటువంటి న్యాయ పోరాటాలకు సిఐటియు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలపై ప్రణాళిక బద్ధమైన పోరాటాన్ని రూపకల్పన చేస్తామని అన్నారు. దశల వారి ఉద్యమాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెంలో ప్రారంభమైన ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రభుత్వ ఉత్తర్వులను సవరించే విధంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు. అనంతరం సీఐటీయూ అనుబంధంగా ఉన్న ప్రైవేటు మెడికల్ ల్యాబ్ అసోసియేషన్ లెటర్ ప్యాడ్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు కొత్తగూడెం పట్టణ కన్వీనర్ భూక్య రమేష్, నాయకులు లిక్కి బాలరాజు, మెడికల్ ల్యాబ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీరభద్రం, కార్యదర్శి సలీం, ఆర్ రమేష్, నరేందర్, రాము, ప్రకాష్, సత్యనారాయణ, సుబ్బారావు చంద్రమోహన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో రానున్నది కాంగ్రెస్సే..

### ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
### రాష్ట్ర మంత్రులు పొంగులేటి, అజారుద్దీన్‌తో కలిసి విస్తృత ప్రచారం



**ఖమ్మం, నవంబర్09(నినాదం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రానున్నది కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయమేనని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో భాగంగా.. గత 15 రోజులుగా ప్రచారం చేస్తున్న ఎంపి రఘురాం రెడ్డి.. ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి కొల్లూరు కాలనీలో.. విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి విశేష కృషి జరుగుతోందని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని, అన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేసేందుకు రేషన్ షాపు లు ఏర్పాటు చేశామని, జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, నాయకులు భరత్, తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో మంత్రి తుమ్మల విస్తృత ప్రచారం

**ఖమ్మం, నవంబర్09(నినాదం):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రచార నిర్వహించారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళరావు నగర్ డివిజన్ లో మంత్రి తుమ్మల పాదయాత్ర చేశారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ వెంగళరావు నగర్ డివిజన్ లో జరిగిన పాదయాత్ర లో మంత్రి తుమ్మల తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.



## నగరంలో ఘనంగా పథ సంచలన్ నిర్వహణ

**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం) :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇందూర్ నగర శాఖ ఆధ్వర్యంలో పథ సంచలన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. స్వయం సేవకులతో కలిసి పట్టణంలోని పలు కాలనీల మీదుగా సాగిన పథ సంచలన్‌లో నడిచి, దేశభక్తి నినాదాలతో ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ దేశ సేవలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి విపత్తు సమయంలో సహజమైనా, సామాజికమైనా స్వయంసేవకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు



అందిస్తున్నారన్నారు. సమాజ నిర్మాణంలో, సాంస్కృతిక విలువల పరిరక్షణలో ఆర్ఎస్ఎస్ అత్యంత ప్రాధాన్యమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. పథ సంచలన్‌లో పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు పట్టణ వీధుల్లో క్రమశిక్షణతో ప్రదర్శన నిర్వహించారు. దేశభక్తి గీతాలు, నినాదాలతో నగరం ఉత్సాహభరిత వాతావరణాన్ని సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ నగర స్వయంసేవకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక గ్యార్మీ

### రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్

**కల్వకుర్తి, నవంబర్ 9 (నినాదం) :** గ్యార్మీ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని రాష్ట్ర విద్య కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ అన్నారు.ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో నిర్వహించిన గ్యార్మీ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్, పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాగూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ లు హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, అన్నదాన కార్యక్రమాని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్యార్మీ వేడుకల్లో ప్రజలందరు కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో జరుపుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షానవాజ్ ఖాన్, మాజీ కౌన్సిలర్ ఎజాస్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్



మసూద్, మైనారిటీ నాయకులు సోఫీ, ఆరీఫ్, ముక్తాధర్, ఖయ్యూం, హిమయాత్, అవేజ్ జిలానీ, సాలం తదితరులు పాల్గొన్నారు.

## సేవలలో అగ్రగామి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్





### వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలురి రమేష్ బాబు

**కల్వకుర్తి, నవంబర్ 9 (నినాదం) :** సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సేవలందించడంలో అగ్రభాగాన నిలిచే సామాజిక సంస్థ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలురి రమేష్ బాబు అన్నారు. ఆదివారం వనస్థలిపురం వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన డిస్టిక్ వి 102 ఏ రీజియన్ - 2, శ్రీశైల భ్రమరాంబిక సేవ పురస్కార వైభవం సదస్సుకు ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలురి రమేష్ బాబు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజియన్ పరిధిలోని వాసవి క్లబ్ల ద్వారా చేపట్టిన సామాజిక సేవలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో సేవలను అందించడం గొప్ప విషయం అన్నారు. సేవలతోనే సార్ధకత లభిస్తుందని రమేష్ బాబు సూచించారు. సామాజిక సేవ బాధ్యతగా



తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని తోటి వారికి సహాయం అందించే గుణంతో మెలగాలని రమేష్ బాబు కోరారు. వాసవి క్లబ్ ఐ ఈ సి ఆఫీసర్ విఠ దురయ్య మాట్లాడుతూ సేవలకు వన్నె తెచ్చేది వాసవి క్లబ్ లు మాత్రమే అన్నారు. వి 108 ఎలెక్ట్ గవర్నర్ కల్మిచర్ల రమేష్ 102 ఏ గవర్నర్ అల్లాడి పరమేశ్, అబ్బర్వర్ నవీన్, కొత్త మాసు రమేష్ , ఉప్పల శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ మద్ది శివ నాగేశ్వరరావు, సరస్వతి రీజియన్ పరిధిలోని వాసవి క్ల బ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామడుగు వీరభద్రాచారికి సన్మానం

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 9: (నినాదం):** ప్రముఖ పారంపర్య ఆయుర్వేద వైద్యులు రామడుగు వీరభద్రా చారిని విశ్వకర్మ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ డెవలప్మెంట్ సర్వీస్ ఖమ్మం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు.కార్తిక వన సమారాధన చెరుకూరివారి మామిడి తోటలో జరిగిన కార్యక్ర మంలో ప్రముఖ పారంపర్య ఆయుర్వేద వైద్యులు రామడుగు వీరభద్రాచారిని విద్యుత్ శాఖ ఖమ్మం ఎస్ ఇ ఇనుగుర్తి శ్రీనివా సాచారి, వేదాస్ అధ్యక్షులు చెన్నోజు పుల్లయ్య , ప్రధాన కార్యదర్శి జయంతి శ్రీనివాస్ , కోశాధికారి సున్నం వెంకట రమేష్ , రాష్ట్ర సంఘం నాయకులు చిట్టోజు రమేష్ తోపాటు సంఘ సభ్యులు వీరభద్రాచారి ని శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానం చేశారు.పారంపర్య వైద్యులు రామడుగు వీరభద్రాచారి మాట్లాడుతూ ప్రతి ఇరవై ఏడు రోజులకోసారి వచ్చే పుష్యమి నక్షత్రం రోజున ఒక సంవత్సరం నుండి పదహారు సంవత్సరాల లోపు వయసుగల పిల్లలకు ఆయు ర్వేద ఇమ్యూనిటి చుక్కలమందు రామభద్ర ఆయుర్వేద మూలికా యోగ పీఠం ఖమ్మం ఆధ్వర్యంలో ఉచితంగా వేస్తున్నట్లు దీనిని అందరూ సద్వినియోగం చేసుకో వాలని విజ్ఞప్తి చేశారు.విశ్వకర్మ పంచ వృత్తుల వారు యాంత్రికరణ దాటికి తట్టుకోలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నా రని ఇది మంచిది కాదని, పంచ వృత్తుల వారికి మనోధైర్యం కల్పిం చేందుకు ఖమ్మం లోని వీడియోస్ కాలనీలో ఉన్న తమ నివాసం లోఉచితంగా



కౌన్సిలింగ్ నిర్వ హిస్తున్నమని దీనిని సద్విని యోగం చేసుకోవాలని వీరభద్ర చారి పిలుపునిచ్చారు.ఆయుర్వేద మూలికాయోగ పీఠం చేస్తున్న ఉచిత సేవలకు గుర్తింపు గా ఘన సన్మానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజే శారు.

# రూ. 1081 కోట్లతో.. రాష్ట్రాన్ని గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాం

## మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి, (నినాదం):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 5 నెలల కాలంలోనే రూ. 1081 కోట్లతో రాష్ట్రాన్ని రహదారులపై గుంతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్య ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని రహదారులు దెబ్బతిన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రోడ్లు, భవనాల శాఖపై ప్రజల్లో సానుకూలత ఏర్పడిందన్నారు. రాయలసీమ ప్రాంతంలో కొంత మేర రహదారులు బాగానే ఉన్నప్పటికీ.. ఉత్తరాంధ్ర, కోస్తా, కృష్ణ, గుంటూరు జిల్లాలో రహదారులు ఎక్కువగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రోడ్లకు నేడు మహర్దశ వచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దాదాపు రూ. 2500 కోట్ల మేర రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని తెలియజేశారు. త్వరలోనే మరో రూ.1000 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నాం అన్నారు. ముఖ్యమంత్రి అనునిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.
ఎన్డీబి, నాబార్డ్ వంటి బ్యాంకుల సహకారంతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజలపై భారం పడకుండా పీపీపీ మోడల్ లో రహదారులను అభివృద్ధి చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. పార్టీ కోసం శ్రమించి, అధికారంలోకి రావడానికి కారణమైన కూటమి నాయకులు, కార్యకర్తలు సేవలను గుర్తించి కార్పొరేషన్ సభ్యులుగా ఎంపిక చేయటం జరిగిందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఏపీ ఆర్టీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వర రావు, ఎండీ ఎల్.శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.



# కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం



**చిత్తూరు, (నినాదం):** చిత్తూరు జిల్లాలోని పలమనేరులో ఉన్న కుంకీ ఏనుగుల క్యాంప్ ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏనుగులు కృష్ణ, అభిమన్యులకు ఆహారాన్ని అందించారు. అనంతరం అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీలింగ్ అండ్ నర్చురింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్ ఎయిడ్ అండ్ వైల్డ్ లైఫ్ (హనుమాన్) కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఇందులో పదకొండు అంశాలను పొందుపరిచినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. నిర్ణీత వ్యవధిలో హనుమాన్ లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలను రూపొందించాలని డిప్యూటీ సీఎం అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. నవంబరు 18, 19 తేదీల్లో హనుమాన్ కార్యక్రమ విషయమై సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ, పర్యాటకం, వ్యవసాయం, ఉద్యానవనం శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని స్పష్టం చేశారు.


# ఆరోగ్యంపై అవగాహన పెంచడమే లక్ష్యం

## ఎస్పీ రాహుల్ మీనా



**కోనసీమ జిల్లా, (నినాదం):** ఫిట్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరికి ఆరోగ్య పరిరక్షణ అవగాహన పెంచడమే తమ లక్ష్యమని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సైక్లోథాన్ 5కె సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. జిల్లాలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫిట్ ఇండియా కార్యక్రమానికి మద్దతుగా ర్యాలీ సాగింది. ఉదయం 7 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో ఎస్పీ రాహుల్ మీనా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అమలాపురం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిన ఈ ర్యాలీ పేరూరు జంక్షన్ వరకు వెళ్లి తిరిగి జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకొని ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత వేగవంతమైన జీవన విధానంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరం అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమం ప్రధాన లక్ష్యం కూడా అదేనని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి నెల నిర్వహిస్తామన్నారు. భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యభరితమైన ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను రూపొందించి అమలులోకి తెస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ వి.పుల్లారావు, ఏఆర్ ఆర్ఐలు బ్రహ్మానందం, కోటేశ్వర రావు, పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మిరప మొక్కకు టమాటాలు.. వంకాయలు..



**ఎన్టీఆర్ జిల్లా, (నినాదం):** మిరప మొక్కకు మిరప కాయలు మాత్రమే కాకుండా.. టమాటాలు, వంకాయలు కూడా కాస్తే ఎలా ఉంటుంది. మన పొరుగు రాష్ట్రమైన ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో ఈ అద్భుతం జరిగింది. మిరప చెట్టుకు టమాటాలు, వంకాయలు కూడా కాస్తున్నాయి. ఇప్పుడు ఈ వింత మొక్క ఆంధ్రాలో హాట్ టాపిక్గా మారింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడుకు చెందిన రైతులు ముత్యాల రజిత రమేశ్ తన పొలంలో మిరప పంట సాగు చేస్తున్నాడు. అయితే రమేశ్ పొలంలోని ఓ మిరప మొక్కకు టమాటలు, వంకాయలు కూడా కాయడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇది చూసిన పక్క పొలాల రైతులు కూడా అవాక్కయ్యారు. దీని గురించి మాట్లాడుకుంటూ ఉండటంతో ఆ నోటా ఈ నోటా ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల వారికి తెలిసింది. దీంతో అందరూ ఈ అరుదైన మొక్కలను చూసేందుకు జనాలు రమేశ్ పొలానికి తరలివస్తున్నారు. కొంతమంది అయితే ఈ మొక్క వీడియోను తీసి సోషల్మీడియాలో కూడా పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్మీడియాలో వైరల్గా మారింది. ఈ వింత మొక్కపై జగ్గయ్యపేట డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి బాలాజీ స్పందించారు. ఒక్కే మొక్కకు మూడు రకాల కాయలు కాయడం వెనుక జన్యుపరమైన మార్పులే కారణం అయ్యి ఉంటుందని తెలిపారు. మిరప, టమాట, వంకాయ ఈ మూడు కూడా సొలనేసి అనే వృక్ష కుటుంబానికి చెందినవని.. అందువల్ల కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఇలాంటి మార్పులు సంభవించే అవకాశం ఉంటుందని వివరించారు.

# తండ్రి మృతి.. కన్నెత్తి చూడని కొడుకు..

## చందాలతో అంత్యక్రియలు చేసిన అధికారులు



**అమరావతి, (నినాదం):** కట్టుకున్న భార్య ముందే మరణించింది. బెంగతో అనారోగ్యం పాలయ్యి ఆసుపత్రిలో చేరి అతను కూడా కన్నుమూశాడు. తలకొరివి పెట్టాల్సిన కొడుకు మద్యం మత్తులో మునిగితేలి, తండ్రి శవం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో అధికారులు, గ్రామస్తులే చందాలు వేసుకొని అంత్యక్రియలు జరిపిన అమానవీయ ఘటన ఏపీలో చోటు చేసుకుంది. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన చీరాల శ్రీనివాసరావు, అన్నపూర్ణ భార్యాభర్తల కుమారుడు సురేశ్. అయితే మూడు నెలల క్రితం తల్లి అన్నపూర్ణ మరణించింది. తండ్రి శ్రీనివాసరావు అనారోగ్యంతో మంచం పట్టగా.. పర్చూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చి వెళ్లిపోయాడు. తీవ్రంగా అస్వస్థతకు గురై శ్రీనివాసరావు ఈనెల 7న మరణించినా కొడుకు మద్యానికి బానిసై కన్నెత్తి చూడలేదు. బంధువులు కూడా ఎవరూ రాకపోగా ఆస్పత్రి అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కొడుకును, బంధువులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చినప్పటికీ.. తమవద్ద అంత్యక్రియలకు డబ్బులు కూడా లేవు అని చెప్పడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు తమవంతు ఆర్థిక సాయం అందించి, అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

# ఏపీ ప్రజలకు రూ.2.5 లక్షల ఆరోగ్య బీమా



**అమరావతి, (నినాదం):** ఏపీలో అందరికీ రూ.2.5 లక్షల వరకు ఆరోగ్య బీమా అందిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకానిలో శంకర ఐ ఆస్పత్రి భవనాన్ని ఆయన ప్రారంభించారు. శంకర కంటి ఆస్పత్రి 50 ఏళ్ల వేడుకకు హాజరవుతానని సీఎం తెలిపారు. రోజూ 750 మందికిపైగా నేత్ర వైద్యం అందించడం అరుదైన విషయమని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లోనూ శంకర ఆస్పత్రి సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. చిన్నారుల కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం గొప్ప విషయమని చెప్పారు. పేదరికం లేని సమాజం నిర్మించడమే లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సంజీవని పథకం ద్వారా ఇప్పటికే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆస్తులు ఉన్నా.. ఎవరికైనా ఆరోగ్యమే ముఖ్యమన్నారు. శంకర ఆస్పత్రికి అన్నివిధాలా సహకారం అందిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్.. మంత్రి లోకేష్ ఎగ్జిక్యూషన్

## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, (నినాదం):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు .. మంత్రి నారా లోకేష్ లపై ప్రశంసల వర్షాన్ని కురిపించారు. వారి ఘనతను కొనియాడుతూ ట్విట్టర్ లో పోస్టు చేశారు. చంద్రబాబు గారి విజన్.. లోకేష్ గారి ఎగ్జిక్యూషన్. ఇదే గూగుల్ ప్రాజెక్ట్ వెనుక రహస్యం అంటూ కొనియాడారు. మంత్రి లోకేష్ అమెరికా టూర్లో గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు ప్రారంభమయ్యాయి అన్నారు. వారి ప్రయత్న ఫలితంగా దేశంలోనే అతి పెద్ద ఏఐ డేటా సెంటర్ రూపుదిద్దుకుంటోందని వెల్లడించారు.

**దేశంలోనే తొలి ఏఐ హబ్..**

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ దేశంలోనే తొలి ఏఐ హబ్. ఇందులో 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టనున్నారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 2లక్షలకు పైగా ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. సముద్రగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా అంతర్జాతీయ నెట్వర్కు కు సెంటరును అనుసంధానిస్తారు. తద్వారా నగరానికి అంతర్జాతీయ స్థాయి కనెక్టివిటీ కేంద్రంగా గుర్తింపు రానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది టెక్ స్టూడెంట్స్, ఇంజనీర్లు, పరిశోధకులు నేరుగా లాభపడతారని అంచనా.

# దొంగ - పోలీసు ఆట ఆడుదామని చెప్పి..

## అత్తను కుర్చీకి కట్టేసి నిప్పంటించిన కోడలు



**విశాఖపట్నం, (నినాదం):** విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తిలో దారుణం జరిగింది. దొంగ పోలీసు ఆట ఆడుదామని చెప్పి అత్తను కుర్చీకి కట్టేసి ఓ కోడలు నిప్పంటించింది. అత్త మరణించిన తర్వాత దీపం అంటుకుని చనిపోయిందని కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేసింది. చివరకు పోలీసుల విచారణలో దొరికిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం జిల్లా పెందుర్తికి చెందిన అప్పన్నపాలెంలోని వర్షిణి అపార్ట్మెంట్స్లో మహాలక్ష్మి (63) తన కొడుకు, కోడలు లలిత, మనుమరాలితో కలిసి ఉంటుంది. అయితే కొద్ది సంవత్సరాలుగా లలితతో మహాలక్ష్మికి గొడవలు జరుగుతున్నాయి. దీంతో తనను చీటికిమాటికి తిడుతుందని అత్తపై లలిత పగ పెంచుకుంది. ఈ క్రమంలోనే ఆమెను చంపి అడ్డు తొలగించుకోవాలని భావించింది. ఈ క్రమంలోనే దొంగ పోలీసు ఆట ఆడుదామని అత్తను నమ్మించింది. ఆట పేరుతో అత్త మహాలక్ష్మిని లలిత కండ్లకు గంతలు కట్టడమే కాకుండా ఆమెను కుర్చీలో తాళ్లతో కట్టేసింది. అనంతరం ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించింది. నిప్పు అంటుకున్న తర్వాత అత్త అక్కడికక్కడే మరణించింది. అత్త మరణించిందని నిర్ధారించుకున్న అగ్ని ప్రమాదం జరిగిందంటూ కేకలు వేస్తూ అందర్ని పిలిచింది. ఇంట్లో దీపం అంటుకుని అగ్ని ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో అత్త మరణించిందని సీన్ క్రియేట్ చేసి కుటుంబసభ్యులతో పాటు ఇరుగుపొరుగువారిని తప్పుదారి పట్టించింది. అంతేకాకుండా పోలీసులకు కూడా ఆమెనే సమాచారం అందించింది. వృద్ధురాలు మరణించిందనే సమాచారంతో ఘటనాస్థలికి వెళ్లిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. ఈ ప్రమాదంలో లలిత కూతురికి కూడా గాయాలయ్యాయి. ఘటనాస్థలిని మొత్తం పరిశీలించిన పోలీసులు.. అనుమానంతో లలిత ఫోన్ను చెక్ చేశారు. అందులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఒక వ్యక్తిని ఎలా చంపాలి? హత్య కేసు నుంచి ఎలా తప్పించుకోవాలి? వంటి వివరాలను లలిత వెతికినట్లు గుర్తించారు. దీంతో అత్త పెట్టే వేధింపులు భరించలేక లలితనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లుగా పోలీసులు నిర్ధారించారు. ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్తో లోకేష్ భేటీ



**అమరావతి, (నినాదం):** కేంద్ర విద్యాశాఖ మంత్రి, బీహార్ బీజేపీ ఎన్నికల ప్రచారకర్త ధర్మేంద్ర ప్రధాన్తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాట్నాలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బీహార్ లో ఎన్డీఏ విజయం కోసం ప్రధాన్ అహరహం శ్రమిస్తున్నారని మంత్రి లోకేష్ అన్నారు. గతేడాది హర్యానా, ఒడిశా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయంలో ప్రధాన్ కీలక పాత్ర వహించారని పేర్కొన్నారు. ప్రస్తుతం బీహార్ లో ఎన్డీఏ విజయం కోసం తీవ్రంగా కృషిచేస్తున్నారని తెలిపారు. బీహార్ లో మరోమారు ఎన్డీఏ సర్కారును గెలిపించేందుకు ప్రధాన్ చేస్తున్న నిర్మాణాత్మక కృషిని మంత్రి లోకేష్ అభినందించారు. బీహార్ లో మరోమారు ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు కాగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్ వెంట ఎంపీలు సానా సతీష్ బాబు, గంటి హరీష్, కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

# గొప్ప మనసు చాటుకున్న శ్రీచరణి



**అమరావతి, (నినాదం):** మహిళల వరల్డ్ కప్ విజయంలో కీలకపాత్ర పోషించిన తెలుగమ్మాయి శ్రీచరణి గొప్ప మనసు చాటుకుంది. శ్రీచరణి తీసుకున్న నిర్ణయంపై ప్రస్తుతం ప్రశంసలు కురుస్తున్నాయి. ఇటీవల శ్రీచరణి ట్రైనింగ్ పొందిన కడప క్రికెట్ అకాడమీలో ఆమెకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీచరణిని అభినందిస్తూ కడప టీడీపీ అధ్యక్షుడు, కమలాపురం MLA రూ.10 లక్షలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. అయితే అదే అకాడమీలో ట్రైనింగ్ పొందుతున్న అండర్-14 క్రికెట్ టీమ్ ప్రోత్సాహానికి ఆ డబ్బులు కేటాయించాలని శ్రీచరణి ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే కూడా ఆమోదం తెలపడంతో.. అకాడమీ సభ్యులు, అండర్-14 క్రికెటర్స్ హర్షం వ్యక్తం చేసారు. శ్రీచరణి చూపిన చొరవకు., గొప్ప మనసుకు నెట్టింట్లో ప్రశంసలు కురిపిస్తున్నారు.

# సీఐఐ పార్ట్నర్షిప్ మీటింగ్తో ఉత్తరాంధ్ర జిల్లాలకు గుర్తింపు

## • మంత్రి సంధ్యారాణి



**అమరావతి, (నినాదం):** సీఐఐ పార్ట్నర్షిప్ మీటింగ్ -2025తో ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక గుర్తింపు రానుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. గిరిజన గ్రామాలంటే ఒకప్పుడు డోలీ పై మోస్తున్న దృశ్యాలే కనిపించేవన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆయా ప్రాంతాలు పర్యాటక అనుభూతిని అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. విశాఖ పెట్టుబడుల సదస్సుకు విచ్చేసేవారికి ఉత్తరాంధ్ర పర్యాటక అనుభూతి కలుగుతుందన్నారు. అరకు, పాడేరు పరిధి గ్రామాల్లో రోడ్లపై ప్రతిపాదనలకు ఇప్పటికే ఆదేశించినట్లు మంత్రి చెప్పారు.

# శ్రీవారిని దర్శించుకున్న ముకేశ్ అంబానీ



**తిరుమల, (నినాదం):** ప్రముఖ వ్యాపారవేత్త.. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ తిరుమలలో కొలువైన వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొని వెంకటేశ్వర స్వామి అనుగ్రహానికి పాత్రులయ్యారు. ఆయన దర్శన సందర్భంగా దేవాలయ అధికారులు ఆహ్వానం పలికారు. దర్శన అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలను ఇచ్చారు. దేవాలయ అధికారులు శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలను ముకేశ్ అంబానీకి అందజేశారు.

# బాబు సర్కార్ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి?

## వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్




**హైదరాబాద్, (నినాదం):** అసలు ఏపీలో పరిపాలన జరుగుతుందా? అంటూ కూటమి సర్కార్ను వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నిలదీశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కూటమి సర్కార్ ఉద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇస్తామని మోసం చేసిందన్న బుగ్గన.. ఉద్యోగులకు ఐఆర్ ఇస్తామన్న హామీని కూటమి సర్కార్ గాలికి కొదిలేసిందన్నారు. ఏడాదిన్నర గడిచిన చంద్రబాబు పీఆర్సీ ఊసు ఎత్తడం లేదంటూ బుగ్గన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో 2023లో 12వ పీఆర్సీ ఏర్పాటు చేశాం. ఉద్యోగులకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం జీపీఎస్ను తీసుకొచ్చింది. అసలు కూటమి సర్కార్ చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? 2024 నుంచి గ్యాట్యుటీ, మెడికల్ బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. ఇప్పుడు ఉద్యోగులకు ఓపీఎస్ లేదు, జీపీఎస్ లేదు. నో పీఎస్ అయ్యింది. ఐదో తేదీ వచ్చినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదు. జనవరి నుంచి పోలీసులకు టీఏ పెండింగ్లో ఉంది” అంటూ బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు.

# చంద్రబాబు సర్కార్కు గుణపాఠం చెబుదాం’



**తాడేపల్లి, (నినాదం):** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 12న జరిగే ర్యాలీలను సూపర్ సక్సెస్ చేద్దాం. వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేసిన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుదాం. ప్రజా స్పందనను బలంగా వినిపిద్దాం’అంటూ పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ సీఈసీ, ఎస్ఈసీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్స్, మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, జెడ్పీటీసీలు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మునిసిపల్ ఛైర్పర్సన్లు, వైస్ ఛైర్పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలతో సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 12న ర్యాలీలు జరుగనున్నాయి, కోటి సంతకాల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో మీరంతా ఉన్నారు, ఇదంతా కూడా ఒక ప్రజా ఉద్యమంగా కొనసాగుతోంది. మీ అందరి భాగస్వామ్యం వల్ల కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం విజయవంతం అవుతుంది. మనం తీసుకుంటున్న ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించేలా 12న జరిగే ర్యాలీలు ఉండాలి. వైద్యవ్యవస్థను జగన్ ప్రజలకు చక్కటి గొడుగులా తయారుచేస్తే చంద్రబాబు దానిని నిర్వీర్యం చేశారు. మనం చేసే ఆందోళనలు, ర్యాలీలు జాతీయస్థాయిలో చర్చ జరిగేలా ఉండాలి. అప్పుడే చంద్రబాబు ప్రభుత్వం దిగివస్తుంది. కలిసి వచ్చే పార్టీలందరినీ కలుపుకుపోదాం. కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్లు ఇలా అందరినీ కలుపుకుందాం. అప్పుడే సూపర్ సక్సెస్ అవుతుంది. ఇందుకు అవసరమైన కసరత్తు పూర్తిచేయాలి. ఏ మాత్రం ఏమరుపాటు వద్దు, అందరూ ఈ కార్యక్రమాన్ని పర్సనల్గా తీసుకుని సక్సెస్ చేయాలి. సోషల్ మీడియా, డిజిటల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుందాం. మీ పరిధిలో ఉన్న వారందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చి ర్యాలీలు సక్సెస్ చేయాలి. మీరంతా ఓనర్ షిప్ తీసుకుని లీడర్లుగా నిరూపించుకునే అవకాశం ఇది. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా మీరంతా సిద్దంగా ఉండాలి, దీనిపై కూడా సీరియస్గా దృష్టిపెట్టాలి. క్షేత్రస్థాయి నుంచి పార్టీ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీల నియామకంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఈ కమిటీలన్నీ పూర్తయితే దాదాపు 13 లక్షల మంది సైన్యం సిద్ధమవుతుంది. ఇదంతా పారదర్శకంగా డిజిటలైజేషన్ చేయాలి. పరిశీలకుల సహకారం తీసుకుని పక్కాగా చేయండి. కేంద్ర కార్యాలయం నుంచి అవసరమైన సహకారం ఉంటుంది. అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ మేనేజర్లను కూడా నియమించడం జరిగింది. కమిటీల ఏర్పాటు పకడ్బందీగా చేయాలి, డేటా అంతా కూడా డిజిటలైజ్ చేయాలి. ప్రతి ఇంట్లో మన పార్టీ ఉంటుంది, నిత్యం ప్రజా సమస్యలపై మనం చేస్తున్న పోరాటాలకు అనూహ్యమైన మద్దతు లభిస్తోంది. ప్రజల్లో మన పార్టీకి ఉన్న ఇమేజ్ బాగా పెరుగుతుంది. దీనిని ఇంకా మరింతగా పెంచుకుందాం. కూటమి ప్రభుత్వ అరాచకాలను ధీటుగా ఎదుర్కొందాం’అని సూచించారు.

## మారుతున్న తెలుగు సాహిత్యం

### పరిణామం, పరిశీలన పురోగమనం

తెలుగు సాహిత్యం అనాదిగా ఒక మహోన్నత ప్రవాహం. నాటి పద్య కవితా వైభవం నుండి ఆధునిక వచన కవిత్వం, కథానిక, నవలల వైవిధ్యం వరకు తెలుగు సాహిత్య ఖజానా అపారమైనది. అయితే, నేటి డిజిటల్ యుగంలో, సమాచార విప్లవం, పాశ్చాత్యీకరణ ప్రభావాల నేపథ్యంలో, తెలుగు సాహిత్యం వెనుకబాటుకు గురవుతోందా? అసలు 'వెనుకబాటు' అంటే ఏమిటి? నాణ్యతలో కొరవడటమా, లేదా పాఠకుల ఆదరణ తగ్గటమా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతకడం వర్తమాన సామాజిక, సాంస్కృతిక పరిశీలన అవసరాన్ని తెలియజేస్తుంది. తెలుగు సాహిత్య పఠన సంస్కృతి క్షీణిస్తోందనే ఆవేదన సాహితీ వర్గాలలో బలంగా వినిపిస్తోంది.

సాహిత్యం వెనుకబాటుకు గల ప్రధాన కారణాలు:
తెలుగు సాహిత్య పూర్వ వైభవం వర్తమానంలో కొంత మందగించడానికి పలు అంశాలు దోహదం చేస్తున్నాయి. ఈ కారణాలు కేవలం సాహిత్య ప్రపంచానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో వచ్చిన పెనుమార్పులను ప్రతిబింబిస్తాయి.

పాఠకుల ఆసక్తి పఠన వేదికల్లో మార్పులు:
నేటి యువతరం, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల పాఠకులు, సమాచారాన్ని వేగంగా, సులభంగా అందిపుచ్చుకోవడానికి అలవాటు పడ్డారు. నవలలు, దీర్ఘ కథలు చదవడానికి అవసరమైన ఏకాగ్రత, సమయం కొరవడుతోంది. దీని స్థానంలో సోషల్ మీడియా, వీడియోలు, చిన్నపాటి వ్యాసాలు (బ్లాగులు) తక్షణ వినోదాన్ని అందించే ఇతర డిజిటల్ వేదికలు ఆక్రమించాయి. తెలుగు సాహిత్య పఠనం ఒక 'సాంస్కృతిక అవశ్యకత'గా కాకుండా ఒక ఐచ్ఛిక అంశంగా మారింది. అంతర్జాలంలో విపరీతమైన కంటెంట్ లభ్యత వలన, పాఠకులు తెలుగు సాహిత్యం కంటే ఆంగ్ల రచనలు, లేదా ఇతర ప్రపంచ భాషల అనువాదాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

సాహిత్యానికి లభించని ఆర్థిక, సాంస్కృతిక ప్రోత్సాహం:
సాహితీ సృజనకు, పరిశోధనకు తగిన ఆర్థిక మద్దతు లేకపోవడం మరొక కీలక కారణం. తెలుగు రచయితలు తమ రచనలపై మాత్రమే ఆధారపడి జీవించడం దాదాపు అసాధ్యంగా మారింది. దీనివలన రచయితలు తమ సమయాన్ని, ప్రతిభను జీవనోపాధి కోసం కేటాయించవలసి వస్తుంది. ప్రచురణ రంగంలో కూడా, నాణ్యత కంటే మార్కెట్ విలువలకు అధిక ప్రాధాన్యత లభిస్తోంది. ప్రభుత్వం నుండి, లేదా ప్రైవేటు సంస్థల నుండి సాహిత్య పరిశోధనలకు, వినూత్న రచనలకు లభించే ప్రోత్సాహకాలు (ఫెలోషిప్‌లు, గ్రాంట్లు) చాలా తక్కువగా ఉన్నాయి. ఈ ఆర్థిక ప్రోత్సాహం లేమి వలన, యువతరం సాహిత్యాన్ని ఒక వృత్తిగా ఎంచుకోవడానికి వెనుకాడుతోంది.

విద్యారంగంలో మాతృభాష ప్రాధాన్యత సన్నగిల్లడం: తెలుగు సాహిత్యం వెనుకబాటుకు మూల కారణం విద్యా వ్యవస్థలోనే ఉంది. పాఠశాలలు, కళాశాలల్లో తెలుగును కేవలం ఒక పాఠ్యాంశంగా మాత్రమే పరిగణిస్తున్నారు తప్ప, జ్ఞాన సముపార్జనకు ఒక వాహికగా చూడటం లేదు. మాతృభాషలో పఠించడం, రాసే ప్రాముఖ్యత క్రమంగా తగ్గుతోంది. ఆధునిక తెలుగు కవులు, రచయితల రచనలను పాఠ్యప్రణాళికలో చేర్చకపోవడం వలన, యువతరం వర్తమాన సాహిత్యానికి పరిచయం కావడం లేదు.
సాహిత్య విమర్శ- సమీక్షా వేదికల కొరత:
ఏదైనా సాహిత్యం సజీవంగా ఉండాలంటే, దానికి బలమైన, నిష్పాక్షికమైన విమర్శ అవసరం. తెలుగులో సమగ్రమైన, సైద్ధాంతికమైన సాహిత్య విమర్శా వేదికలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పత్రికలలో, అంతర్జాల వేదికల్లో వచ్చే సమీక్షలు కూడా తరచుగా వ్యక్తిగత సంబంధాలు లేదా వాణిజ్య ప్రయోజనాల ఆధారంగా ఉంటున్నాయి. లోతైన విమర్శ లేకపోవడం వలన రచయితలు తమ రచనల నాణ్యతను మెరుగుపరచుకోవడానికి, పాఠకులు మంచి రచనలను ఎంచుకోవడానికి అవకాశం లభించడం లేదు. సాహిత్య విమర్శ లేని సమాజంలో, మంచి రచనలు కూడా మరుగునపడిపోయే ప్రమాదం ఉంది.

తెలుగు సాహిత్య పునరుజ్జీవనానికి అవసరమైన పరిష్కారాలు:
తెలుగు సాహిత్యాన్ని ఈ మందగమనం నుండి బయటపడేసి, దాని వైభవాన్ని తిరిగి తీసుకురావాలంటే, వ్యవస్థాగతమైన, సాంస్కృతికమైన మార్పులు అనివార్యం.డిజిటల్ మాధ్యమాల వినియోగం, వేదికల సృష్టి: వర్తమాన సమాచార యుగంలో, సాహిత్య ప్రచా రం కోసం డిజిటల్ మాధ్యమాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలి. రచయితలు తమ రచనలను ఈ-పుస్తకాల రూపంలో, శ్రవణ పుస్తకాల రూపంలో విడుదల చేయాలి. తక్కువ ఖర్చుతో, ప్రపంచవ్యాప్తంగా తెలుగు పాఠకులకు చేరువయ్యే అవకాశం దీని ద్వారా లభిస్తుంది. కవిత్వం, కథానికల కోసం ప్రత్యేకమైన, ఆకర్షణీయమైన వెబ్‌సైట్‌లు, యాప్‌లు సృష్టించాలి. యువత ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని పాడ్‌కాస్ట్‌లు, యూట్యూబ్ ఛానెల్‌ల ద్వారా సాహిత్యాన్ని ప్రచారం చేయాలి.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు:
పాఠశాల స్థాయిలో తెలుగు సాహిత్యం పట్ల మమకారం పెంచేలా విద్యా వ్యవస్థను సంస్కరించాలి. తెలుగును కేవలం పరీక్షాంశంగా కాకుండా, సృజనాత్మక భాషా బోధన ద్వారా విద్యార్థులలో పఠనాభిరుచిని పెంచాలి. వర్తమాన రచయితల, వర్తమాన సమస్యలపై రాసిన రచనలను పాఠ్యాంశాలలో చేర్చాలి. పాఠశాలలు, కళాశాలల్లో క్రమం తప్పకుండా సాహిత్య గోష్ఠులు, కవి సమ్మేళనాలు, పుస్తక సమీక్షా కార్యక్రమాలను నిర్వహించాలి. దీనివలన విద్యార్థులలో భాషపై ప్రేమ పెరుగుతుంది.

రచయితలకు ఆర్థిక భద్రత - పరిశోధనా ప్రోత్సాహం: రచయితలను, పరిశోధకులను గౌరవించే సాంస్కృతిక వాతావరణం ఏర్పడాలి. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు కలిసి సాహిత్య నిధులు లేదా ఫెలోషిప్‌లు స్థాపించాలి. ప్రామాణికమైన పరిశోధనలకు, వినూత్న సాహిత్య సృజనకు తగిన ఆర్థిక మద్దతు అందించాలి. గ్రంథాలయాల వ్యవస్థను పునరుద్ధరించాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో ఉన్న తెలుగు రచయితలకు తగినంత సమయం, ప్రోత్సాహం లభించేలా కార్యాలయ నియమాలలో మార్పులు తీసుకురావాలి.

విమర్శనాత్మక దృక్పథం పెంపుదల:
సాహిత్య విమర్శకు పూర్వ వైభవం తీసుకురావాలి. నిష్పాక్షికమైన, లోతైన విమర్శలను ప్రచురించేందుకు పత్రికలు, విశ్వవిద్యాలయాలు చొరవ తీసుకోవాలి. దీనివలన రచయితలు మరింత పరిణతి చెందిన రచనలు చేయడానికి ప్రోత్సాహం లభిస్తుంది. అలాగే, కొత్త శైలులలో, రూపాలలో రచనలు చేయడానికి రచయితలు ప్రయత్నించాలి. కేవలం సంప్రదాయ రచనలకే పరిమితం కాకుండా, ప్రపంచ సాహిత్యంలో వస్తున్న పోకడలను అధ్యయనం చేసి, వాటిని తెలుగు నేటివిటీకి అనుగుణంగా మార్చి రచనలు చేయాలి.
భవిష్యత్తుపై నిశ్చయమైన ఆశ
తెలుగు సాహిత్యం 'వెనుకబాటు' అనేది ఒక తాత్కాలిక దశ లేదా మందగమనం మాత్రమే. తెలుగు భాషకు ఉన్న అపారమైన చరిత్ర, వైభవం, తెలుగు ప్రజల సంస్కృతిపై దాని ప్రభావం ఎప్పటికీ చెరిగిపోదు. నేటి సవాళ్లను 'సృజనాత్మక అవకాశాలుగా' మలచుకోవాల్సిన అవసరం ఉంది. డిజిటల్ టెక్నాలజీని వాడుకుంటూ, విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేస్తూ, రచయితలకు తగిన మద్దతు ఇస్తూ ముందుకు సాగితే, తెలుగు సాహిత్యం తప్పకుండా కొత్త పాఠకుల ఆదరణను పొంది, భవిష్యత్తులో మరింత బలంగా, మరింత వైవిధ్యంగా ప్రవహించగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేయవచ్చు. ప్రతి తెలుగు వ్యక్తి తమ మాతృభాషలో చదవడం, రాయడం ద్వారానే ఈ పునరుజ్జీవనం సాధ్యమవుతుంది.

- డి జయరాం

# గిరిపుత్రులకు రాయి సెంటర్లే న్యాయస్థానాలు!

### ఆదివాసీల సుప్రీంకోర్టు.. న్యాయం, సంస్కరణలకు కేంద్రంగా రాజ్ గోండుల సంప్రదాయ వేదిక



ఆదివాసీ గిరిజన తెగల సామాజిక, సాంస్కృతిక జీవితంలో రాయి సెంటర్లు అనేవి అత్యున్నతమైన న్యాయ వేదికలుగా, నేటికీ సుప్రీంకోర్టుతో సమానమైన విలువను కలిగి ఉన్నాయి. స్వాతంత్ర్యం రాక పూర్వమే ఆవిర్భవించిన ఈ సంస్థలు, నిరక్షరాస్యత, అమాయకత్వం రాజ్యమేలుతున్న వెనుకబడిన గిరిజన ప్రాంతాలలో, తరతరాలుగా ఉచిత న్యాయం, తక్షణ పరిష్కారాలను అందిస్తున్నాయి. నవీన న్యాయానికి ఏమాత్రం తీసిపోని విధంగా, ఇవి తమ సంప్రదాయ ధార్మికతతో గిరిజనుల మధ్య తలెత్తే తగాదాలు, వివాదాలకు పరిష్కార మార్గాలు చూపుతున్నాయి. రాయి సెంటర్ పెద్దలు చెప్పే తీర్పులకు చట్టబద్ధత ఉంది. దీనికి ప్రభుత్వం 1981లోనే అధికారిక గుర్తింపు ఇచ్చింది. గిరిజన తెగల కేసులు కోర్టులు, పోలీస్ స్టేషన్ల వరకు వెళ్లనివ్వకుండా, ఇక్కడ చెప్పే తీర్పులనే వారు అంతిమంగా భావిస్తారు.

**వ్యవస్థాపక నిర్మాణం - నైతిక నాయకత్వం**

ఒక రాయి సెంటర్ దాదాపు 20 నుంచి 40 గిరిజన గ్రామాల పరిధిలో ఉంటుంది. ఈ వ్యవస్థలో ఆయా గ్రామాలలోని పెద్దలైన పటేల్, మహాజన్, దేవారి, గట్యాల్ వంటివారు కలిసి 11 మందితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తారు. ఇందులో అధ్యక్షుడిని సార్ మేడి, ఉపాధ్యక్షుడిని ఉప మేడి, కార్యదర్శిని గీతాదర్, కోశాధికారిని ఖజాన్ దార్ అని పిలుస్తారు. జిల్లావ్యాప్తంగా సుమారు 140 రాయి సెంటర్లు పనిచేస్తుండగా, ఇవన్నీ రాజ్ గోండు సేవా సమితి అంతర్భాగంగా ఉన్నాయి. ఈ సెంటర్లలో గోండు, తోటి, కోలామి, నాయక పోడు, పర్ధాన్ ,అంద్ వంటి ఆరు ఆదివాసి గిరిజన తెగలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. సార్ మేడిగా ఎంపిక కావడానికి ఉన్నత విద్య కానీ, డబ్బు దర్పం కానీ అవసరం లేదుబీ కేవలం సత్ప్రవర్తన, సేవాభావం, సద్గుణాలు, మత్తుపానీయాలు సేవించకుండా ఉండడం వంటి నైతిక విలువలే ప్రధాన అర్హతలు. ఈ కఠిన ప్రమాణాల కారణంగానే ఈ వ్యవస్థపై గిరిజనులకు అచంచలమైన నమ్మకం ఉంది.

**న్యాయ విధి విధానాలు, సామాజిక సేవలు**

సమస్యలు పరిష్కారం కొలిక్కి రానప్పుడు, జిల్లా స్థాయిలో సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేస్తారు, దీనిని వారు సుప్రీంకోర్టుగా పిలుచుకుంటారు. ఈ సమావేశాలకు జిల్లా పోలీస్ అధికారులు కూడా హాజరవుతారు. రాయి సెంటర్లు కేవలం న్యాయ నిర్ణయాలకే పరిమితం కాకుండా, అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతూ, గిరిజనుల వ్యవహారాలలో సంస్కరణలకు బాటలు వేస్తున్నాయి. సామూహిక వివాహాలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యయాన్ని తగ్గించడం, 1980%-%90 దశకంలో దేవదాన్ గోదాం (గ్రేయిన్ బ్యాంక్)లను ఏర్పాటు చేసి, కరువు వచ్చినప్పుడు గిరిజనులకు ధాన్యాన్ని పంపిణీ చేయడం వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఏటా డిసెంబర్ 31న ఉట్నూరులోని గుసాడిగుట్టలో వీరు వార్షిక సమావేశాన్ని నిర్వహించుకుంటారు.

**వ్యవస్థ బలోపేతంలో ఐఏఎస్ తుకారం కృషి**

1944 నుంచి ఆదివాసి గిరిజన సంప్రదాయంలో ఉన్న ఈ రాయి సెంటర్లను వెలుగులోకి తెచ్చి, వ్యవస్థను బలోపేతం చేయడంలో తొలి గిరిజన ఐఏఎస్ అధికారి తుకారం కృషి మరువలేనిది. ఆయన రాయి సెంటర్లకు చట్టబద్ధత కల్పించారు. గిరిజన వ్యవహారాలలో కీలకమైన పొడవాజాన్ (16 రకాల వాయిద్యాలు), అట్రడెమ్ సింగ్ (18 రకాల నృత్యాలు)లను పటిష్టం చేశారు. ధాన్య కరాగారాలు (గ్రెయిన్ బ్యాంకులు) ఏర్పాటు చేయించి, గిరిజనులు నిల్వ చేసిన ధాన్యానికి సమాన మొత్తాన్ని ఐటీడీఏ ద్వారా సబ్సిడీపై అందజేసి, పొదుపు సంఘాలను ప్రోత్సహించారు. ఈ కారణంగానే ఈ వ్యవస్థ నేటికీ ఆధునిక సమాజంలో గిరిజనుల సాంస్కృతిక, సామాజిక విలువలను పరిరక్షిస్తోంది.



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

# జ్ఞానమే శక్తి విద్యతో దేశ అభివృద్ధి..!

### జాతీయ విద్యా దినోత్సవం..!

జాతీయ విద్యా దినోత్సవం మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి స్ఫూర్తికి జాతీయ వందనం. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు మౌలానా ఆజాద్ గారి ఆలోచనలను స్మరించి, జ్ఞానం-సేవ-ఐక్యత అనే ఆయన సందేశాన్ని నూతన ఉత్సాహంతో ఆచరిస్తున్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తల్లిదండ్రులు మౌలానా ఖైరుద్దీన్ అరబ్, ఆజాద్ గారు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మిం చాడు. మౌలానా అబుల్ కలాం గారు స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి, ఆయన అసలు పేరు అబుల్ కలాం గులాం ముహియుద్దీన్ అహ్మద్ బిన్ ఖైరుద్దీన్ అల్ హుసైనీ.



అబుల్ కలాం అనేది బిరుదు, ఆజాద్ అనేది అతని కలం పేరు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకడు. అతను ప్రఖ్యాత పండితుడు, కవి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ మొదలగు అనేక భాషలలో ప్రావీణ్యుడు కలాం గారు. భారత ప్రభుత్వంలో పదకొండు సంవత్సరాలపాటు విద్యా శాఖా మంత్రిగా పనిచేసాడు. 1890 లో ఆయన తన కుటుంబంతో కలకత్తా వెళ్లాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. అతని విద్య ఇంట్లోనే సాగింది. మొదట తండ్రి, పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించారు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ నేర్చుకున్నాడు. తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం అభ్యసించాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. అతను దివ్య ఖురాన్ పై భాష్యం వ్రాసాడు. విద్యా మంత్రిత్వ శాఖను గతంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ అని పిలిచేవారు, నవంబర్ 11 వ తేదీని జాతీయ విద్యా దినోత్సవంగా సెప్టెంబర్ 11 2008న ప్రకటించింది. భారతదేశంలో విద్యకు శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అందుకే 2008 నుండి నవంబర్ 11 నుండి దీనిని జరుపుకుంటున్నారు.
ఈ రోజు భారత తొలి విద్యా మంత్రి, మహానుభావుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జన్మదినం సందర్భంగా గుర్తుగా నిర్వహించబడుతుంది. ఆయన భారత విద్యా వ్యవస్థకు బలమైన పునాది వేసిన దూరదృష్టి నాయకుడు. విద్య ప్రతి ఒక్కరికీ హక్కు కావాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్య విస్తరించాలని ఆయన విశ్వసించారు. విద్య అనేది శాంతి కోసం నేర్చుకోవడం అనేది ఒక పరివర్తన ప్రక్రియగా ఉండాలి, అభ్యాసకులు అవసరమైన జ్ఞానం, విలువలు, వైఖరులు, నైపుణ్యాలు మరియు ప్రవర్తనలను పొందేందుకు వీలు కల్పిస్తుంది, తద్వారా వారి సమాజాలలో శాంతికి ఉత్ప్రేరకంగా పనిచేయడానికి వారిని శక్తివంతం చేస్తుంది. మరింత శాంతియుత, న్యాయమైన మరియు స్థిరమైన సమాజాలకు పునాది విద్య ద్వారా వేయబడుతుంది, ఇది మన దైనందిన జీవితంలోని ప్రతి కోణాన్ని మరియు మొత్తం అవకాశాలను విస్తరించే శక్తి. పెరుగుతున్న వాతావరణ మార్పు, ప్రజాస్వామ్య కోత, నిరంతర అసమానతలు, పెరుగుతున్న వివక్ష, ద్వేషపూరిత ప్రసంగం, హింస మరియు ప్రపంచ స్థాయిలో సంఘర్షణల నేపథ్యంలో, భవిష్యత్తులో ఈ సవాళ్లను పరిష్కరించడానికి మరియు నిరోధించడానికి విద్య ఒక శక్తివంతమైన సాధనంగా ఉద్భవిస్తుంది. అంతేకాకుండా, సమర్థవంతంగా రూపొందించబడి అమలు చేయబడినప్పుడు, విద్య పెరుగుతున్న రాబడితో దీర్ఘకాలిక పెట్టుబడిగా మారుతుంది.
మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ పాత్ర అనేది చాలా దృఢంగా ఉండేది. అతను స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప పండితుడు, మరియు దేశభక్తుడు.
ఆజాద్ గారు గాంధీజీ ఆలోచనలతో బలంగా ప్రభావితమయ్యారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారు భారత స్వాతంత్ర్య సమరంలో అగ్రగామి నాయకుల్లో ఒకరు. ఆయన కేవలం రాజకీయ నాయకుడే కాదు ఒక స్ఫూర్తిదాయక ఆలోచనా పరుడు, రచయిత, మరియు జాతీయ ఐక్యతకు ప్రతీక కూడా. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ గారు చిన్నతనం నుంచే దేశభక్తి స్ఫూర్తితో నిండి పోయారు. బ్రిటిష్ పాలన భారతదేశాన్ని ఎలా బంధించిందో తెలుసుకున్న తర్వాత, ఆయన స్వాతంత్ర్య పోరాటంలో అడుగుపెట్టారు. 1912లో ఆయన అల్ హిలాల్ అనే పత్రిక ప్రారంభించి, దాని ద్వారా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరాన్ని వినిపించారు. ఆ పత్రిక ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని రగిలించింది. 1919లో గాంధీజీతో కలిసి ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆఉద్యమం ద్వారా ఆయన ముస్లింలను స్వాతంత్ర్య సంగ్రామంలో భాగస్వాములుగా చేయడానికి కృషి చేశారు.
1920లో గాంధీజీ పిలుపుతో ప్రారంభమైన అసహకార ఉద్యమంలో ఆజాద్ గారు ప్రముఖ పాత్ర పోషించారు. బ్రిటిష్ విద్యాసంస్థలు, కోర్టులు, ప్రభుత్వ ఉద్యోగాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడేలా ఆయన ప్రేరణ ఇచ్చారు. 1931 లో ఆయన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో ముఖ్య నాయకుడు అయ్యారు.
1940 లో రామగఢ్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు, అప్పుడు ఆయన వయసు కేవలం 35 సంవత్సరాలు మాత్రమే.
ఆయన అధ్యక్షతన 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను సమరానికి నడిపించింది. ఆజాద్ గారిని క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి దాదాపు మూడు సంవత్సరాలు జైలులో ఉంచింది. కానీ జైలులో ఉన్నప్పటికీ ఆయన ఆత్మబలం తగ్గలేదు. జైలు నుండి భారత భవిష్యత్తు గురించి వ్యాసాలు, పుస్తకాలు రాశారు. ఆజాద్ గారు హిందూ ముస్లిం ఐక్యతను అత్యంత ముఖ్యమని భావించారు. దేశ విభజనకు ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. భారతదేశం ఒకే జాతిగా ఉండాలని, అన్ని మతాల వారూ సమానంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు.
స్వాతంత్ర్యం అనంతరం భారతదేశపు మొదటి విద్యాశాఖ మంత్రిగా 1947%-%1958 అనేక సేవలు అందించారు. అబుల్ కలాం ఆజాద్ గారి నాయకత్వంలోనే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, సాహిత్య అకాడమీ వంటి అనేక విద్యా సాంస్కృతిక సంస్థల స్థాపనలో, విద్యాసంస్థల ఏర్పాటుకు పునాదులు వేశారు.
ఆయన నమ్మకం ఏమిటంటే విద్య ప్రతి భారతీయుని హక్కు అది పేద, ధనిక తేడా లేకుండా అందరికీ చేరాలి.
విద్యా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్య ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని కూడా అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ఆయన విశ్వాసం.
ఆజాద్ గారు హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. ఆయన భారత దేశాన్ని ఒక సమగ్ర, లౌకిక దేశంగా చూడాలని ఆశించారు. ఆయన విశిష్ట సేవలకు గాను భారత ప్రభుత్వం 1958లో భారత రత్న పురస్కారం ప్రకటించింది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి స్ఫూర్తి భారత యువతకు శాశ్వత ప్రేరణగా నిలుస్తుంది. జాతీయ నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు గొప్పమేధావి.
భారతదేశం ఒక గొప్పదేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ విద్యా విధానానికి పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారిని 1958 ఫిబ్రవరి 22 కోల్పోయింది. ఈ మరణవార్త దేశమంతటా విషాదాన్ని మిగిల్చింది. దేశ నాయకులు, విద్యావేత్తలు, ప్రజలు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గారు భారతదేశం తన అత్యుత్తమ జ్ఞానపూర్ణ నాయకుడిని కోల్పోయింది అని పేర్కొన్నారు.



**నరేందర్ సొప్పరి**
**హైదరాబాద్ విశ్వవిద్యాలయం**
**ఫోన్: 9553958648**

# అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న అర్బన్ స్లమ్స్.. పరిష్కార మార్గాలు

అపరిశుభ్ర పరిసరాలతో ప్రజల శారీరక మానసిక నైతిక ఆరోగ్యాన్ని భంగపరిచే పరిస్థితులు ఉన్న ప్రాంతాలని మురికి వాడలంటారు. సరైన పారిశుధ్య వసతులు సాగునీటి వసతులు లేకుండా చాలీచాలని అవస్థాపన సౌకర్యాలతో అనారోగ్యకరమైన పరిసరాలలో ఇరుకుగా ఉన్న ఇల్లు 60 నుండి 70 వరకు గాని లేదా కనీస జనాభా 300 గాని కలిగిన ఇరుకు ప్రదేశాలని మురికి వాడలంటారు. ఒక ప్రాంతాన్ని మురికవాడగా నిర్ణయించడానికి భౌతిక పరిస్థితులే కాకుండా ఆర్థిక సామాజిక అంశాలు కూడా పరిగణలోకి తీసుకోబడతాయి. ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్రంలో మౌలిక సేవల అల్ప స్థాయిలో ఉన్న ప్రాంతాలను గుర్తించడానికి కొన్ని నిబంధనలు నిర్ణయిస్తుంది. వీటి ఆధారంగానే స్థానిక ప్రభుత్వాలు తమ పరిధిలో ఉన్న మురికవాడలను గుర్తించారు. స్థానిక ప్రభు త్వాలు మురికి వాడలను రెండు రకాలుగా వర్గీక రించాయి అవి ఒకటి ప్రకటిత మురికివా డలు(నోటిఫైడ్ స్లమ్స్) 2. అప్రకటిత మురికి వాడలు (నాన్ నోటిఫైడ్ స్లమ్స్). 2011 జనాభా లెక్కలలో మురికి వాడలను మూడు రకాలుగా వర్గీకరించారు అవి ఒకటి ప్రకటిత మురికివాడలు,రెండు గుర్తించిన మురికివాడలు 3 ఐడెంటిఫైడ్ స్లమ్స్.




**ప్రకటిత మురికివాడలు:**
రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు లేదా స్థానిక ప్రభుత్వాలు ఏదైనా ఒక చట్టం ప్రకారం లేదా మురికివాడ చట్టం ప్రకారం మురికి వాడలుగా ప్రకటించిన ప్రదేశాలను ప్రకటిత మురికి వాడలుగా పిలుస్తారు. గుర్తించిన మురికివాడలు: రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర పాలిత ప్రాంతాలు లేదా స్థానిక ప్రభుత్వాలు మురికివాడలుగా గుర్తించినప్పటికీ ఏ చట్టం కింద అనగా మురికివాడలుగా ప్రకటించబడని ప్రదేశాలని గుర్తించబడిన మురికి వడలుగా పిలుస్తున్నారు.

**మురికివాడల జనాభా:**
(స్లం ఏరియా పాపులేషన్): 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 26 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 2006లో 29 నగరాలు పట్టణాలలో మురికివాడలు ఉన్నాయి. 2001 కంటే 870 ఎక్కువ. అత్యధిక మురికి వాడలు గల రాష్ట్రాలలో ప్రథమ స్థానం తమిళనాడుది. ఆ తర్వాత స్థానం వరుసగా మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. దేశంలోని మురికివాడలలో నివసిస్తున్న మొత్తం జనాభా 65.49 మిలియన్లు 2001 కంటే 13.12 మిలియన్ ఎక్కువ. దశాబ్దపు వృద్ధి 25.1% ఇందులో పురుషులు 33.97 మిలియన్లు స్త్రీలు 31. 52 మిలియన్లు లింగ నిష్పత్తి 2021లో 887కాగా 2011లో 928. మురికివాడల లెక్కలలో కేంద్రపాలిత ప్రాంతాల పట్టణ జనాభాలో 22.4 , 2001లో ఇది 23.5% మొత్తం జనాభా అత్యధికంగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర ఈ రాష్ట్రంలో 11.8 మిలియన్ల జనాభా, తర్వాత స్థానాల్లో వరుసగా ఆంధ్రప్రదేశ్ 10.18, పశ్చిమ బెంగాల్ 4.1, ఉత్తర్ ప్రదేశ్ 4, తమిళనాడు 5.82. మురికివాడలో షెడ్యూల్ కులాల జనాభా అత్యధికంగా ఉన్న ఐదు రాష్ట్రాలు కేంద్ర ప్రాంతాలు వరుసగా పంజాబ్, తమిళనాడు, చండీగర్, హర్యానా, త్రిపుర, అత్యల్ప షెడ్యూల్ కులాలు గల జనాభా గల రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలు ఐదు వరుసగా మిజోరం, జమ్ము కాశ్మీర్, గోవా, మేఘాలయ, సిక్కిం, మురికివాడల జనాభాలో షెడ్యూల్ తెగలు అధికంగా ఉన్న రాష్ట్రాలు మిజోరం, నాగాలాండ్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ ,సిక్కిం, షెడ్యూల్ తెగల రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలు కేరళ, ఉత్తర్ ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, గోవా, తమిళనాడు. దేశంలో మొత్తం మురికివాడాల జనాభాలో అక్షరాస్యత రేటు 2001లో 72.2, కాగా 2011లో 77.7%,. 2011లో పురుషుల అక్షరాస్య రేటు 83.7%, కాగా స్త్రీల అక్షరాస్య రేటు 71.20%, 2011లో మురికివాడల జనాభాలో పని భాగస్వామి రేటు మొత్తం 36.4%, పురుషులలో 53.3%, స్త్రీలలో 17.1% ,వ్యవసాయకులు ఏడు శాతం కాక పారిశ్రామిక కార్మికులు ఐదుశాతం మంది ఉన్నారు.మురికివాడలలో రకాలు: 1 పారిశ్రామిక మురికివాడలు 2. వ్యాపార మురికివాడలు 3. ఇతర మురికి వాడలు.

**మురికి వాడల నిర్మూలనకు పరిష్కార చర్యలు:**
మురికి వాడలలో పరిస్థితులు మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుంది. మొదటి ప్రణాళిక కాలంలో మురికివాడల ప్రస్తావన లేకపోయినప్పటికీ 1956లో స్లమ్ క్లియరెన్స్ యాక్ట్ చేయబడింది. క్లియరెన్స్ అండ్ ఇంప్రూవ్మెంట్ స్కీంను ప్రారంభించబడింది. రెండు మూడు ప్రణాళికల కాలంలో స్కీమ్ ఆఫ్ స్లమ్ వెల్ఫేర్ అమలు పరచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మురికివాడల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వాల ప్రాజెక్టులకు నిధులను సమకూర్చింది. 1969లో కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేయబడ్డాయి. ప్రభుత్వం మురికి వాడలను నిర్మూలించి నివాసకులకు అదే స్థలంలో గాని సమీపంలో గాని గృహాలను నిర్మించి ఇవ్వడం మురికివాడలలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరచడానికి పర్యావరణ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం మురికివాడల నుండి తొలగించబడిన నిర్వాసితులకు గాని కొత్తగా వలస వచ్చిన వారిని గాని సమగ్రమైన సేవలందించి సౌకర్యాలు అభివృద్ధి చేసిన స్థలాలను ఏర్పాటు చేయడం.మొదట మురికి వాడాను నిర్మూలించి నిర్వాసితులకు గృహాలు నిర్మించి ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. కానీ నిధుల కొరత వల్ల తర్వాత మురికి వాడల వాళ్ళ పరిస్థితిలను మెరుగుపరచడానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. మురికివాడలకు ప్రధాన కారణం పేదరికం కాబట్టి పట్టణ పేదరిక నిర్మూల పథకాలు ఏవైనా మురికి వాడల సమస్యకు పరిష్కారాలు అవుతాయి.

**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు:**
1 ప్రభుత్వ మురికివాడల పరిసరాల అభివృద్ధి పథకం (ఈఐయుఎస్) 2.పట్టణ మౌలిక సేవలు ( యు బి ఎస్) 3 జాతీయ మురికివాడల అభివృద్ధి కార్యక్రమం ( ఎన్ఎస్ డిపి)4 వాల్మీకి అంబేద్కర్ ఆవాస యోజన (వాంబే)5 జవహర్లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ కార్యక్రమం (జేఎన్ఎన్‌యుఆర్ఎం) 6 పట్టణ అవస్థాపన పాలన (యు ఐ ఏజీ) 7. పట్టణ పేదలకు మౌలిక సేవలు (యు బి ఎస్ యు) ఈ విధంగా మురికివాడలలో గృహవసతి మౌలిక సదుపాయాలు సాంఘిక సదుపాయాలు మొదలగునవి మెరుగుపరిచి అందరికీ అందుబాటులో తీసుకురావాలి. మురికివాడలు ఏర్పడడానికి కారణమైన పరిస్థితులను అవసరమైన సంస్కరణలు తీసుకురావాలి. పట్టణ పేదలకు సమస్త పరపతి సౌకర్యం విస్తరింపజేయాలి. మురికివాడల పెరుగుదలను నిర్వహిస్తూ అందరికీ అందుబాటులో ఉండే వ్యయంతో గృహ నిర్మాణాలను చేపట్టాలి. పురపాలిక నగర రాష్ట్రస్థాయిలలో సంస్థాపూర్వకమైన వనరులను మానవ వనరులను బలోపేతం చేయాలి. మురికి వాడల నివాస సంఘాలు సమాఖ్యలను బలపరిచి ప్రతి దశలోనూ వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి. ఈ విధమైన కార్యక్రమాలు చేపట్టినట్టయితే భారత దేశంలో మురికివాడాలనే సమస్య లేకుండా భారతదేశం, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలోనూ ఆరోగ్య రంగంలోనూ వేగంగా దూసుకు పోతుందనడంలో అతిశయోక్తి లేదు.



**పందిరి శ్రీనివాసులు.**
**ఎంఏ (జాగ్రఫీ), బిఈడి, ఎంసీజే( జర్నలిజం), పిజిడిసిజే (జర్నలిజం), ఉస్మానియా యూనివర్సిటీ**

# టీకా ఔషధంతో జీవితకాల వ్యాధినిరోధకత

### నేడు "ప్రపంచ రోగనిరోధకత దినోత్సవం" సందర్భంగా..



"చికిత్స కన్న నివారణే మిన్న" అనే నినాదం అనాదిగా వింటూనే ఉన్నాం. ప్రాణాంతక వ్యాధులను జీవితకాలం పాటు తరిమేయగల దివ్య రక్షణ కవచంగా టీకా ఔషధాలను ప్రయో గిద్దాం, అందరికీ టీకాలను వేయించే ప్రయ త్నాలు చేయడం మన కనీస భాధ్యత. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం, ప్రతి ఏట 2 నుంచి 3 మిలియన్ల పిల్లలు చనిపోవడం గమనించారు. 1974 నుంచి నేటి వరకు టీకాలు వేయడం వల్ల కనీసం 154 మిలియన్ల ప్రాణాలు రక్షించబడ్డాయి. చిన్నతనంలోనే టీకాలు వేయించడం వల్ల డిఫ్తీరియా, టెటనస్, పోలియో, మీసిల్స్, కోవిడ్-19, న్యుమోనియా, రోటావైరస్ డయోరియా లాంటి పలు ప్రమాదకర వ్యాధులకు జీవితకాల అడ్డుకట్ట వేయబడింది. సులభంగా ప్రయోగించే చవకైన, అత్యంత ప్రభావిత టీకాలతో పౌర సమాజానికి జీవితకాల సురక్ష కవచం ఏర్పడుతుంది.

**ప్రపంచ రోగనిరోధకత దినోత్సవం-2025 ఇతివృత్తం:**
టీకా ఔషధాలతో వ్యక్తులు, కుటుంబాలు, పౌర సమాజం, ప్రపంచ మానవాళి అనేక వ్యాధులను కట్టడి చేయడం నిరంతర ఉద్యమంగా కొనసాగుతున్న తరుణంలో టీకాల ప్రాధాన్యాన్ని సామాన్య జనులకు వివరించడానికి ప్రతి ఏట 10 నవంబర్ రోజున "ప్రపంచ రోగనిరోధకత దినోత్స వం" లేదా "వరల్డ్ ఇమ్యునైజేషన్ డే" పాటించుట 1974 నుంచి కొనసాగుతున్నది. తీవ్ర ప్రభావాలను చూపే అనేక భయంకర అంటువ్యాధులను కట్టడి చేయడానికి వినియోగించే అత్యంత సమర్థవంతంగా పని చేయగల టీకా ఔషధాలు చవకగా లేదా ప్రభు త్వం చేత ఉచితంగా కూడా పంపిణీ చేయబడుతున్నాయి. 2025 ప్రపంచ రోగనిరోధకత దినోత్సవ ఇతివృత్తంగా "అందరికీ టీకాలు అందించడం మానవ సుసాధ్యం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. మారుమూల ప్రాంతాలకు సహితం టీకా ఔషధాలు అందించడం, పౌర సమాజ చేతనం, అంతరాజతీయ స్థాయి సహాయ సహకార సమన్వయాలు కలిపించడం నిత్యం కొనసాగాలి. "అందరికీ టీకాలు సుసాధ్యం" అనే నినాదాన్ని నిజం చేసి చూపడం జరగాలి.

**భారత్‌లో ఇమ్యునైజేషన్ ఉద్యమం :**
భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా, సవాలుగా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం పోలియో నిర్మూలనకు దేశవ్యాప్తంగా "పల్స్ పోలియో ప్రోగ్రామ్" ఫలితంగా భారతాన్ని పోలియో రహిత దేశంగా కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ 2014లో ప్రకటించడంతో జరిగింది. ఇదే స్ఫూర్తితో దేశ సరిహద్దుల నుంచి హెపటైటిస్, టిబి, డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటనస్, పోలియోమైలిటిస్, రోటావైరస్య, జపనీస్ ఎన్సిఫలైటిస్, రుబెల్లా, న్యూమోకోకల్ వ్యాధి, మీసిల్స్ లాంటి వ్యాధులను తరిమేయడానికి భారత ప్రభుత్వం టీకాలను ఉచితంగా పిల్లలకు, గర్భిణి స్త్రీలకా అందుబాటులో ఉంచడం హర్షదాయకం. జాతీయ టీకా దినం వేదికగా టీకా ఔషధాల పట్ల అవగాహన, టీకాల పట్ల భయాలను లేదా అపార్థాలను తొలగించడం, టీకా ఉద్యమంలో భాగం కావడం, ప్రభుత్వ టీకా కార్యక్రమాలకు ప్రచారం నిర్వహించడం, టీకా ఉద్యమానికి తమ సేవలను అందిస్తున్న వైద్య ఆరోగ్య కార్యకర్తలను సన్మానించుకోవడం నిరంతరం కొనసాగాలి. ప్రతి ఏట 2.67 కోట్ల శిశువులకు, 2.9 కోట్ల గర్భిణి స్త్రీలకు "యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్" మాధ్యమంగా అవసర టీకాలు అందించడం కొనసాగుతున్నది. 2014లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక "మిషన్ ఇంద్రధనుస్సు" కార్యక్రమంలో భాగంగా టీకాలు దేశవాసులు అందరి ముంగిట ప్రత్యక్షం అవుతున్నాయి.

ప్రమాదకర అంటురోగాల కట్టడి, శిశు మరణాలను తగ్గించడం, సామాజిక ఆరోగ్య భాగ్యాలను పెంచడం, చవకగా టీకాలను అందుబాటులో ఉంచడం, సమాజ రోగనిరోధకా శక్తిని పెంచడం లాంటి ప్రధాన లక్ష్యాలతో కొనసాగుతున్న టీకా ఉద్యమాలను ప్రోత్సహించడం, సమాజ చైతన్యానికి పూనుకోవడం లాంటి పలు కార్యక్రమాలను నిర్వహిద్దాం, టీకాస్త్రంతో పౌర సమాజ వ్యాధినిరోధకత పెంచుతూ ప్రాణాంతక వ్యాధులను తరిమేద్దాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# రోజూ తీవ్రమైన అలసటతో ఇబ్బందులు పడుతున్నారా..?



ప్రస్తుతం చాలా మంది ఉరుకుల పరుగుల బిజీ జీవితం కారణంగా తరచూ అలసటకు గురవుతున్నారు. అలసట అనేది ప్రస్తుతం చాలా మందికి కామన్ సమస్యగా మారింది. రాత్రంతా సరిగ్గా నిద్రపోయినా, ఆహారం సమయానికి తీసుకున్నా కూడా పలు ఇతర కారణాల వల్ల కూడా చాలా మంది అలసటకు గురవుతున్నారు. నిద్రలేమి, పోషకాహార లోపం, వ్యాయామం లేదా శారీరక శ్రమ మరీ అతిగా చేయడం, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండడం, తీవ్ర భావోద్వేగాలకు తరచూ గురి కావడం, నీటిని సరిగ్గా తాగకపోవడం వంటివి అలసట వచ్చేందుకు కారణం అవుతున్నాయి. అలాగే టీ, కాఫీలన అతిగా తాగేవారికి, మద్యం అధికంగా సేవించే వారికి కూడా అలసట వస్తుంటుంది. అలసట ఉన్న వారు శరరీంలో శక్తి లేనట్లు ఫీలవుతారు. ఉదయం నిద్రలేవగానే తీవ్రమైన అలసటగా అనిపిస్తుంది. చిన్న పనిచేసినా తీవ్రంగా నీరసం వస్తుంది. అయితే అలసట అనేది పెద్ద సమస్య కాదు. ఆయా విషయాల్లో మార్పులు చేసుకోవడంతోపాటు తినే ఆహారం విషయంలోనూ జాగ్రత్తలను పాటిస్తే అలసటను సులభంగా తగ్గించుకోవచ్చు.

**సంక్లిష్టమైన పిండి పదార్థాలు..**

అలసట సమస్య ఉన్నవారు వేళకు నిద్రించే ప్రయత్నం చేయాలి. వేళకు భోజనం చేయాలి. జంక్ ఫుడ్ తీసుకోకూడదు. పోషకాలు ఉన్న ఆహారాలనే తినాలి. వ్యాయామం శరీరానికి ఎంత అవసరమో అంతే చేయాలి. శారీరక శ్రమ చేసేవారు నిరంతరాయంగా చేయకూడదు. మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. టీ, కాఫీలను అతిగా సేవించకూడదు. మద్యం తాగడం మానేయాలి. పొగ తాగకూడదు. ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు గాను యోగా, ధ్యానం దోహదం చేస్తాయి. ఈ విధంగా పలు సూచనలు పాటిస్తే అలసట చాలా వరకు దూరం అవుతుంది. ఇక ఆహారం విషయంలోనూ అనేక మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా పలు ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరిగి అలసట తగ్గుతుంది. అలసట ఉన్నవారు ఓట్స్, కినోవా, బ్రౌన్ రైస్‌ను తింటే ఫలితం ఉంటుంది. వీటిల్లో ఉండే సంక్లిష్టమైన పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీని వల్ల శరీరానికి నిరంతరం శక్తి లభిస్తూనే ఉంటుంది. దీంతో యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. అలసట తగ్గిపోతుంది.

**ఐరన్ ఉండే ఆహారాలు..**

అలసట ఉన్నవారు చిలగడదుంపలు, ఆలుగడ్డలు, పప్పు దినుసులు, బీన్స్ వంటి ఆహారాలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. చికెన్, మటన్‌ను కూడా తినవచ్చు. కోడిగుడ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాల్సి ఉంటుంది. రోజుకు ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తినాలి. కొవ్వు తీసిన పాలు, పెరుగు తీసుకోవాల్సి ఉంటుంది. నెయ్యి, పనీర్ కూడా మేలు చేస్తాయి. సోయా పాలను కూడా తాగవచ్చు. సోయా టోఫు, పీనట్ బటర్‌ను తింటున్నా ఉపయోగం ఉంటుంది. ఇక ఐరన్ లోపం వల్ల కూడా అలసట తరచూ వస్తుంది. కనుక శరీరానికి ఐరన్ లభించేలా చూసుకోవాలి. ఐరన్ ఉండే ఆహారాలను రోజూ తినాల్సి ఉంటుంది. ఐరన్ మనకు పాలకూర, మటన్, రొయ్యలు, చేపలు, పప్పు దినుసులు, గుమ్మడి విత్తనాలు, తృణ ధాన్యాల్లో లభిస్తుంది. వీటిని తినడం వల్ల ఐరన్ లభించి అలసట, నీరసం తగ్గిపోతాయి. యాక్టివ్‌గా మారుతారు.

**విటమిన్ బి12, విటమిన్ సి ఆహారాలు..**

విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. క్యాప్సికం, సిట్రస్ ఫలాలు, స్ట్రా బెర్రీలను తింటే విటమిన్ సి లభిస్తుంది. ఇది మన శరీరాన్ని యాక్టివ్‌గా మార్చి ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. అలసటను తగ్గిస్తుంది. శరీరంలో విటమిన్ బి12 లోపం ఉన్నా కూడా నీరసంగా, అలసటగా ఉంటుంది. కనుక విటమిన్ బి12 లభించేలా చూసుకోవాలి. ఈ విటమిన్ ఎక్కువగా మటన్, చేపలు, కోడిగుడ్లు, పాల ఉత్పత్తులు, పుట్ట గొడుగుల్లో లభిస్తుంది. కనుక వీటిని తింటుంటే ఉపయోగం ఉంటుంది. అలాగే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే అవకాడోలు, బాదంపప్పు, వాల్ నట్స్, చియా విత్తనాలు, అవిసె గింజలను తింటుండాలి. ఇవన్నీ అలసటను తగ్గించి శరీరానికి శక్తిని అందిస్తాయి. దీంతో యాక్టివ్‌గా మారుతారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం తగ్గుతుంది. ఇలా ఆయా ఆహారాలను తీసుకుంటుంటే అలసటను సులభంగా దూరం చేసుకోవచ్చు.

## సీటు బెల్ట్.. హెల్మెట్.. పెట్టు..

# నీ ప్రాణాన్ని నిలబెట్టు..


- వాహనదారులు రక్షణ చర్యలు పాటించట్లే
- ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ కారు నడిపే వ్యక్తికి సీటు బెల్ట్ తప్పనిసరి
- మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనం నడపొద్దు
- అతి వేగం, రాంగ్ రూట్లో వెళ్లొద్దు
- డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ తప్పనిసరి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్9(నినాదం):**

"తెల్లవారుజామున వివాహ వేడుకలకు వెళ్లిన బంధువులకు అనుకోని ప్రమాదం.. హుటాహుటిన అక్కడికి వెళ్లాలన్న ఆత్రుతతో ఇంట్లో ఉన్న తమ్ముడితో కలిసి కారులో బయల్దేరాడు సురేష్. చర్ల - భద్రాచలం రహదారిపై వాహనాల రాకపోకలు పెద్దగా లేవు. తన బంధువులకు ఎలా ఉందో అన్న ఆందోళనతో గుండె వేగం 120 స్పీడ్ తో కొట్టుకుంటోంది. కారు కూడా అంతే వేగంగా వెళ్తోంది. ఇంతలో ఏదో శబ్దం.. కారు రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఆపై పల్టీలు కొడుతూ బోల్తా పడింది. అంతా నిశబ్దం. జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు. కారులో ఇరుక్కున్న వారిని బయటకు లాగుతున్నారు. జనాలు వారిని ఏదో అడిగే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వినబడటం లేదు. కాపాడాలని వేడుకునే ప్రయత్నం చేస్తున్నా సురేష్‌కు శరీరం సహకరించడం లేదు. సీన్ కట్ చేస్తే ఆస్పత్రిలో ఉన్న సురేష్ కు స్పృహ వచ్చింది. భుజానికి, తలకు అద్దాల ముక్కలు గుచ్చుకుని చిన్నపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. కారు నుజ్జునుజ్జయిన ప్రమాదంలో వారిని కాపాడిన అసలైన హీరో సీటు బెల్టు.. "

"సెల్‌ఫోన్ కొంటూనే అది ఎక్కడ పగిలిపోతుందోనని షాపు నుంచి బయటకు రాక ముందే దానిపై స్క్రీన్ గార్డు, బ్యాక్ కవర్(పౌచ్) వేయిస్తాం. కానీ వాటికన్నా విలువైన ప్రాణాలను కాపాడే రక్షణ కవచాలైన హెల్మెట్, సీటు బెల్టు ధరించేందుకు మాత్రం నిర్లక్ష్యం వహిస్తుంటాం.." ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ప్రజలు తలకు తగిలిన దెబ్బలతో మృతి చెందారు. వారందరూ హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు దక్కేవని డాక్టర్లు పలు కేసుల్లో వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలపై పోలీసులు, ఆర్టీఏ అధికారులు అనునిత్యం అవగాహన కల్పించినా ప్రజల్లో చైతన్యం రాకపోవడం శోచనీయం.



**సీటు బెల్టు, హెల్మెట్ ధరిస్తే..**

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సీటు బెల్టు ధరించి ఉంటే ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా ద్విచక్ర వాహన చోదకులు మంచి క్వాలిటీ హెల్మెట్ ఉంటే చిన్నపాటి గాయాలతో బయట పడతారు. హెల్మెట్ ధరించని వారి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందుతున్నారు. వేగంగా వెళ్తున్న కారు దేనినైనా ఢీకొట్టినా లేదా హఠాత్తుగా వేగం కోల్పోయినా, సడెన్ బ్రేక్ వేసినా అందులోని ప్రయాణికులు అదే వేగంతో ముందుకు వెళ్తారు. ఫలితంగా ముందు సీట్లోని వారు డ్యాష్ బోర్డ్ను, ముందున్న అద్దాల నుండి ఎగిరిపడే అవకాశం ఉంటుంది. వెనుక కూర్చున్న వారు ముందు సీట్లను అత్యంత వేగంగా ఢీకొడతారు. ఒక్కోసారి పల్టీలు కొడితే అద్దాలోంచి, డోర్ ఊడిపోయి ఎగిరి బయటపడతారు. సీటు బెల్ట్ ధరిస్తే పెద్ద ఎత్తున కుదుపు మాత్రమే ఉండి గాయాలతో బయట పడతారు.

**సీటు బెల్ట్ ఎయిర్ బ్యాగ్లకు లింక్..**

కార్లు, ఇతర వాహనాల్లో భద్రతా ప్రమాణాలు కొన్ని సాంకేతిక అంశాలతో ముడిపడి ఉంటాయి. ఈ క్రమంలో వాహనదారులు అందులోని వెళ్లే వారు కచ్చితంగా సీటు బెల్ట్ ధరించాలి. కొన్ని కంపెనీలకు చెందిన హైఎండ్ కార్లలో సీటు బెల్ట్స్, ఎయిర్ బ్యాగ్స్ కు మధ్య లింక్ ఉంటుంది. డ్రైవర్ సీటు బెల్ట్ పెట్టుకుంటే ఎయిర్ బ్యాగ్ కంట్రోల్ యూనిట్ యాక్టివేట్ అయి బ్యాగ్స్ ఓపెన్ అవుతాయి. దీంతో పెను ప్రమాదం నుంచి గాయాలతో తప్పించుకోవచ్చు. సీట్ బెల్ట్ పెట్టుకోకపోతే బ్యాగ్స్ ఓపెన్ కావు. ఫలితంగా ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**ట్రాఫిక్ నిబంధనలు పాటించట్లే...**

వాహన చోదకులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సి ఉన్నా వాటిని పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ ఒక్క క్షణం ఆలోచించాలి. ప్రభుత్వ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఒక కుటుంబం తనపై ఆధారపడి ఉందనే విషయాన్ని కచ్చితంగా గుర్తుంచుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరం. కానీ ఇవేవీ పట్టించుకోకుండా వాహనదారులు ఇష్టం వచ్చినట్టు నడుచుకుంటున్నారు. పోలీసులు ఎన్ని ఫైన్లు వేస్తున్నా.. డ్రంక్ అండ్ డ్రైవ్ లు పెట్టి కేసులు నమోదు చేస్తున్నా వారిలో మాత్రం మార్పు కనబడడం లేదు. ద్విచక్రవాహన దారుడు హెల్మెట్ ధరించకపోతే రూ.100, కారు నడిపే సమయంలో సీటు బెల్ట్ ధరించకపోతే రూ.100గా జరిమానా వసూలు చేస్తున్నారు. అయితే కొత్త నిబంధనల ప్రకారం వీటి జరిమానాలు రూ.వెయ్యి వరకూ పెంచారు. ఇది ఇంకా అమలు కావాల్సి ఉంది. ఇది అమలులోకి వస్తే కొంత వరకు మార్పు కనిపించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

### బాధ్యతగా మెలిగితే ప్రమాదాలు నివారణ

**సంగం వెంకట పుల్లయ్య, ఎంవీఐ, భద్రాచలం**



నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనాలు నడిపేవారు ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబం గురించి ఆలోచించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల్లో రోడ్డు ప్రమాదాలపై చైతన్యం రావడం వల్ల చాలా వరకు ప్రమాదాలు నివారించవచ్చు. పోలీసులు ప్రజల ప్రాణాలను కాపాడే విషయంలో వాహనదారులు జాగ్రత్తలు తీసుకోమని హెచ్చరిస్తూ జరిమానాలు విధించడం, ప్రత్యేక తనిఖీలు పెట్టి అవగాహన కల్పించడం చేస్తుండడంతో కొంత మార్పు కనిపిస్తోంది. పని మీద కార్యాలయానికి వచ్చే వారికి రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతీ ద్విచక్ర వాహన చోదకుడు విధిగా హెల్మెట్, కారు నడిపే వ్యక్తి సీటు బెల్ట్ పెట్టుకుంటే ప్రమాదాల సమయంలో ప్రాణాలతో బయటపడే అవకాశాలు ఎక్కువ.

## లావు ఉన్న వారికి నిమ్మ తొక్కలు ఓ వరం

మనమందరం నిమ్మకాయలను వివిధ సందర్భాల్లో ఆహారంలో వినియోగిస్తుంటాము. అయితే ఎక్కువ మంది నిమ్మ రసాన్ని వాడుకు ని.. దాని తొక్కలను పడేస్తుంటారు. అలా తొక్కే కదా అని పడేస్తే.. మనం చాలా నష్టపోయినట్లే అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక బరువు ఉన్న వాళ్లకు ఈ నిమ్మ తొక్కలు వరం లాంటివి. వాటిని సరిగ్గా వినియోగించుకుంటే.. బాడీ ఫ్యాట్ తగ్గి.. నాజూగ్గా మారవచ్చు. మరి.. నిమ్మ తొక్కలను ఎలా ఉపయోగిస్తే.. అధిక బరువు తగ్గొచ్చు ఇప్పుడు తెలుసుకుందాం.. నిమ్మ జ్యూస్ లో కంటే తొక్కలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని చాలా మందికి తెలియదు. ఈ తొక్కలు ఒక న్యూట్రియెంట్ పవర్ హౌస్ లాంట వి అని నిపుణులు చెబుతున్నారు. ఈ తొక్కలో విటమిన్-సి, డీ-లిమొనెన్, ఫెక్టిన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. దీనిలోని విటమిన్ సీ శరీరంలోని రోగ నిరోధక శక్తిని బూస్ట్ చేస్తుంది. అలానే మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి కణాల డ్యామేజ్‌ను విటమి న్-సి ఆపుతుంది. అలానే దీనిలోని ఫైబర్, ఫెక్టిన్ అనేవి జీర్ణ వ్యవస్థకు హెల్ప్ చేస్తాయి. వీటి వల్ల త్వరగా ఆకలి వేయదు. ఫ్లేవనాయిడ్స్, డీ-లిమొనెన్ లు మెటబాలిజంను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. బోన్ హెల్త్‌కు కాల్షియం, మెగ్నీషియం బలం ఇస్తాయి. నిమ్మ తొక్కలో ఉండే డీ-లిమొనెన్ శరీరంలోని కాంపౌండ్ కొవ్వును కరిగించడానికి మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. ఈ తొక్కను మన డైలీ లైఫ్ లో చేర్చుకోవడం చాలా ఈజీ. నిమ్మ తొక్కలను బాగా కడిగిన తర్వాత ఎండలో ఉంచి డ్రై చేయాలి.

బాగా ఎండిన తర్వాత మిక్సీలో వేసి .. పౌడర్ లా చేయాలి. ఆ పౌడర్ ను రోజూ ఉదయం ఒక గ్లాస్ గోరువె చ్చని నీటిలో కలుపుకొని తాగాలి. అలా రోజూ చేయడం వల్ల.. మనకు తెలియకుండానే బాడీ వెయిట్ తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతు న్నారు. బరువు తగ్గేందుకు వేలకు వేలు ఖర్చు చేయకుండా నిమ్మ తొక్కలతోనే మార్పు తెచ్చుకోవచ్చు. వాతావరణం మారినప్పుడు వచ్చే వచ్చే జలుబు, దగ్గు లాంటి వాటి నుంచి శరీరం త్వరగా కోలుకు నేందుకు నిమ్మ తొక్కలు ఉపయోగపడతాయట.

## మార్కెట్

### భారత ఏఐ విపణిలో

# టెక్ దిగ్గజాలు సై అంటే సై

భారత్‌లో కృత్రిమ మేధ (ఏఐ) సేవల విపణిలో వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అంతర్జాతీయ దిగ్గజ టెక్ సంస్థలు పోటీ పడుతున్నాయి. తమ ఖరీదైన కృత్రిమ మేధ ఉత్పత్తుల సేవలను ఉచితంగా లేదా తగ్గింపు ధరతో అందించడం ద్వారా భారతీయులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందుకోసం భారత టెలికాం సంస్థలతోనూ జట్టుకడుతున్నాయి. భారతీయులందరికీ చాట్ జీపీటీ 'గో' ఏఐ చాట్‌బోట్ సేవలను ఏడాది పాటు ఓపెన్‌ఏఐ ఉచితంగా అందిస్తోంది. ఇప్పటికే గూగుల్, పర్‌ప్లెక్సిటీ సంస్థలు కూడా ఇదే తరహా ప్రకటనలు చేశాయి. నెలవారీ డేటా ప్యాక్‌లతో ఉచితంగా లేదా తగ్గింపు ధరకు ఏఐ ఉత్పత్తుల సేవలను అందించేందుకు భారతీ ఎయిర్‌టెల్‌తో పర్‌ప్లెక్సిటీ, రిలయన్స్ జియోతో గూగుల్ భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. అయితే ఈ నిర్ణయాలు.. ఈ ఒప్పందాల వెనక సదరు కంపెనీల దీర్ఘకాలిక వ్యూహాలు దాగి ఉన్నాయని, విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాని ఉదారంగా ఈ ఉచిత సేవలను అందిస్తున్నాయని అనుకుంటే పొరపాటే అవుతుందని అంటున్నారు. తమ జెనరేటివ్ ఏఐ సేవలను వాడుకునేందుకు డబ్బులు చెల్లించమని అడగకుండా.. ముందు ప్రజలను ఈ సేవలకు అలవాటు పడేలా చేయాలనే వ్యూహాన్ని కంపెనీలు అమలు చేస్తున్నట్లుగా కనిపిస్తోందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ విశ్లేషకుడు తరుణ్ పాఠక్ వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వెబ్‌సైట్ కథనం తెలిపింది. భారత్‌లో యువ జనాభా ఎక్కువగా ఉండటంతో వారిని ఈ సేవల వైపు ఆకర్షితులను చేయాలన్నది కూడా దీని వెనక ఆ కంపెనీల వ్యూహమై ఉండొచ్చని వెల్లడించింది.

**చైనాతో పోలిస్తే భిన్న పరిస్థితులు..**

భారత్‌లో 90 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదార్లు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది యువతే. అంతేకాకుండా ప్రపంచంలో చౌకగా డేటాను అందిస్తున్న అతి కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటి. వినియోగదారుల సంఖ్యాపరంగా భారత్ మాదిరే చైనా కూడా అతిపెద్ద విపణుల్లో ఒకటి. అయితే ఆ దేశంలో కఠిన నియంత్రణతో కూడిన సాంకేతిక వాతావరణం ఉండటం వల్ల విదేశీ సంస్థలకు వ్యాపార అవకాశాలు పరిమితంగా ఉన్నాయి. అందుకే భారత్‌లోని లక్షలాది కొత్త వినియోగదార్లకు తమ ఏఐ మోడళ్లపై శిక్షణ అవకాశాలను అందివ్వడం ద్వారా వ్యాపారాన్ని పెంచుకునేందుకు అంతర్జాతీయ టెక్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. అందుకే దేశీయ టెలికాం కంపెనీలతో జట్టుకట్టి డేటా ప్యాక్‌లతో కలిపి ఏఐ ఉత్పత్తులను అందివ్వడం ద్వారా వ్యాపారప రంగా అపార అవకాశాలను సృష్టించొచ్చనే వ్యూహంతో ఇవి ముందుకెళ్తున్నాయి.

# బస్సుల కాలుష్యం తగ్గుతోందా?


డీజిల్ బస్సుల స్థానాన్ని నెమ్మదిగా విద్యుత్తు బస్సులు ఆక్రమిస్తున్నాయి. మన దేశంలో విద్యుత్తు బస్సులకు ఆదరణ, వినియోగం పెరుగుతున్నట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. విద్యుత్తు బస్సులతో వాయు, శబ్ద కాలుష్యం సమస్య లేదు. నిర్వహణ వ్యయాలు తక్కువ. ఎక్కువ దూరం ప్రయాణం చేయటానికి వీలుగా సమర్థమైన బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోంది. దీంతో రోడ్డు రవాణా విభాగంలో విద్యుత్తు బస్సుల వాటా క్రమంగా పెరుగుతోంది.

**రెండేళ్లలో రెట్టింపు వాటా**

2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టే కొత్త బస్సుల్లో 10- 12 శాతం విద్యుత్తు బస్సుల వాటా ఉంటుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ ఒక నివేదికలో పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇది 5 శాతం మాత్రమే కావటం గమనార్హం. అంటే కేవలం రెండేళ్ల వ్యవధిలో రెట్టింపు వాటాను విద్యుత్తు బస్సులు సాధించనున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి ఎన్నో సానుకూలతలు వీలుకల్పిస్తున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు ఒక ఎత్తు కాగా ఛార్జింగ్ సదుపాయాలు విస్తరించటం, విద్యుత్తు బస్సుల్లో వినియోగించే బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానం విస్తరించి ఒకసారి ఛార్జి చేస్తే ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం కలగటం, బస్సుల ధరలు కూడా తగ్గుముఖం పట్టటం, ఎక్కువ కంపెనీలు విద్యుత్తు బస్సులను ఉత్పత్తి చేస్తుండటం ఇతర కారణాలుగా ఉన్నాయి.

**పీఎం ఇ-డ్రైవ్‌తో..**

కాలుష్య ఉద్గారాలను బాగా తగ్గించుకోవాలనే లక్ష్యాన్ని మనదేశం నిర్దేశించుకుంది. 2070 నాటికి




'నెట్ జీరో' లక్ష్యాన్ని చేరుకోవాలని నాలుగేళ్ల క్రితం 'కాప్26'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఇది దీర్ఘకాలిక లక్ష్యం. ఇదేకాకుండా 2030 నాటికి ఇప్పుడున్న కాలుష్య ఉద్గారాలను 45 శాతం మేరకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇంధన రంగం నుంచి వెలువడే కార్బన్ డయాక్సైడ్ వాయువుల్లో వాహనాల వాటా 12 శాతం ఉంటోంది. డీజిల్‌తో నడిచే ట్రక్కులు, బస్సులు వెదజల్లే కాలుష్యం ఇందులో 50 శాతం ఉండటం గమనార్హం. అందువల్ల వాహనాల విభాగంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యుత్తు బస్సుల వాడకాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ఏడాది అక్టోబరులో పీఎం ఇ-డ్రైవ్ అనే పథకాన్ని రూ.10,900 కోట్ల బడ్జెట్‌తో ప్రకటించిన విషయం గమనార్హం. విద్యుత్తు బస్సుల వాడకాన్ని పెంపొందించే కార్యక్రమాలకు, ఛార్జింగ్ సదుపాయాలను భారీగా అందుబాటులోకి తీసుకు రావటానికి ఈ నిధులు వెచ్చిస్తారు. ఈ కార్యక్రమం వల్ల దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో 14,000 ఇ-బస్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదేకాకుండా పీఎం ఈ-బస్ సేవ కార్యక్రమాన్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అమలు చేస్తున్నారు.

**నగరాల్లోనే ఎక్కువ..**

ప్రస్తుతానికి నగరాల్లో విద్యుత్తు బస్సుల వాడకం అధికంగా ఉంది. ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, దిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్... తదితర నగరాల్లో విద్యుత్తు బస్సులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తిరుపతితో పాటు మరికొన్ని పుణ్య క్షేత్రాల్లోనూ విద్యుత్తు బస్సుల ప్రాధాన్యాన్ని గుర్తించి అధికంగా వినియోగిస్తున్నారు. ఇకపై సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాలకు సైతం విద్యుత్తు బస్సులను వినియోగించే దిశగా దృష్టి సారించాల్సి ఉంది. ఇప్పుడిప్పుడే ఇ-బస్సుల వాడకం పెరగటం మొదలైందని, ఇకపై వేగం పుంజుకుంటుందని ఈ రంగా నికి చెందిన నిపుణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

**ఇవీ సవాళ్లు..**

అయితే ఇప్పటికీ కొన్ని సవాళ్లు ఉన్నాయి. వివిధ కంపెనీలు విద్యుత్తు బస్సులను ఆశించనంత వేగంగా వినియోగదార్లకు అందించలేకపోతున్నాయి. బస్సుల డెలివరీలో ఎంతో జాప్యం జరుగుతోంది. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం వచ్చే రెండేళ్లలో 25,000 కు పైగా విద్యుత్తు బస్సులను డెలివరీ చేయాల్సి ఉంది. విడిభాగాలు సకాలంలో లభించకపోవటం, బ్యాటరీ, మోటార్లు వంటి కీలకమైన విడిభాగాల కోసం చైనాపై అధికంగా ఆధారపడి ఉండటం దీనికి కారణాలు. ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను ప్రైవేటు ఆపరేటర్లకు వర్తింపజేయకపోవటం కూడా ఒక అవరోధంగా భావిస్తున్నారు. అంతేగాక ఛార్జింగ్ సదుపాయాలను ఇంకా బాగా విస్తరించాల్సి ఉంది. ఈ సవాళ్లను ఎంత త్వరగా అధిగమిస్తే, అంత త్వరగా ఇ-బస్సుల వాడకం పెరుగుతుందని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## మంగళవారం ఐదైతే పనికి ఫుల్‌స్టాప్.. 30 ఏళ్లుగా పాటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ సహ వ్యవస్థాపకుడు!

వర్క్‌లైఫ్ బ్యాలెన్స్.. చాలా మంది బాస్‌లు దీన్ని కొట్టి పారేస్తుంటారు. అదంతా ఉత్తిదే అని వాదిస్తుంటారు. గడియారం చూసుకుంటూ పనిచేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించలేం.. పైకెదగలేం అంటారు. గడిచిన కొన్నేళ్లుగా ఈ అంశంపై ఎడతెగని చర్చ నడుస్తోంది. ఉద్యోగ జీవితానికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతూకం ఉండాలనేది ఉద్యోగుల వాదన. వారం చివర పనిచేస్తేనే 'ఫ్యూచర్' ఉంటుంది అంటారు బాస్‌లు. కానీ, గడిచిన 30 ఏళ్లుగా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌కు పెద్ద పీట వేస్తున్నారు నెట్‌ఫ్లిక్స్ సహ వ్యవస్థాపకుడు మార్క్ రాండోల్ఫ్. మంగళవారం సాయంత్రం ఐదైతే 'పెన్ డౌన్' పాటిస్తున్నారు. ప్రముఖ గ్లోబల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన నెట్‌ఫ్లిక్స్‌ను స్థాపించిన వారిలో ఒకరైన రాండోల్ఫ్ మూడు దశాబ్దాలుగా ఈ పద్ధతిని పాటిస్తున్నారు. ఎన్ని పనులు ఉన్నా సాయంత్రం ఐదు గంటలు కాగానే తన విధులు ముగిస్తానని తన లింక్డిన్ పోస్టులో చెప్పుకొచ్చారు. ఈ పోస్ట్ పాతదే అయినా ప్రస్తుతం మరోసారి వైరల్ అవుతోంది. తన జీవితమంతా ఎంతో కష్టపడి పనిచేశానని, వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ కోసం మాత్రం ఆ ఒక్కరోజు తనకు నచ్చినట్లు గడుపుతానంటూ తన పోస్టులో చెప్పుకొచ్చారు. "ప్రతి మంగళవారం సాయంత్రం ఐదు గంటలు కాగానే నా పని ముగిస్తా. గడిచిన 30 ఏళ్లుగా ఇదే పద్ధతిని పాటిస్తున్నా.

# డిజిటల్ గోల్డ్‌తో జాగ్రత్త



బంగారం ధర పరుగులు పెడుతోంది. దీంతో పసిడిలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఇతర మార్గాల కోసం చూస్తున్నారు. ఈ సమయంలోనే చాలామందిని డిజిటల్ గోల్డ్ ఆకర్షిస్తోంది. నేరుగా బంగారం కొనుగోలు చేసే బదులు ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్/ఇ-గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వీలు కల్పిస్తూ ఈ మధ్య కాలంలో ఎన్నో పథకాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. చెల్లింపుల సేవలను అందిస్తున్న సంస్థలూ వీటిని తీసుకొచ్చాయి. తక్కువ మొత్తంతోనూ బంగారంలో మదుపు చేసేందుకు ఇవి అవకాశం ఇస్తుండటంతో ఎంతోమంది మదుపు చేస్తున్నారు. వెసులుబాటు మాట ఎలా ఉన్నా.. డిజిటల్ గోల్డ్ పథకాలు అత్యంత నష్టభయంతో కూడుకున్నవని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మదుపరులకు హెచ్చరిక జారీ చేసింది. ఇవేవీ తమ నియంత్రణ పరిధిలోకి రావని, అందువల్ల పెట్టుబడిదారులకు ఎలాంటి రక్షణ ఉండదని స్పష్టం చేసింది. 'డిజిటల్ గోల్డ్‌ను సంప్రదాయ బంగారం కొనుగోలుకు ప్రత్యామ్నాయంగా చెబుతున్నారు. ఇవేవీ సెబీ గుర్తించిన ఉత్పత్తులు కావు. కమొడిటీ డెరివేటివ్ పరిధిలోనూ లేవు. కాబట్టి, మీ పెట్టుబడులకు సెబీ ఆధీనంలో ఉండే పెట్టుబడిదారుల రక్షణ వ్యవస్థ వర్తించదు. ఒకవేళ ఆ సంస్థ/యాప్‌ను మూసేసినా, దివాలా తీసినా మదుపరుల సొమ్ముకు నష్టం వాటిల్లుతుంద' ని శనివారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. మ్యూచువల్ ఫండ్లు అందించే గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు (గోల్డ్ ఈటీఎఫ్), గోల్డ్ ఫండ్లు, ఇ-గోల్డ్ రశీదులు (ఈజీఆర్), ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ డెరివేటివ్స్ లాంటి వాటిల్లోనే మదుపు చేయాలని పేర్కొంది. వీటిలోనూ సెబీ వద్ద నమోదైన మధ్యవర్తుల ద్వారా మాత్రమే మదుపు చేయాలని వివరించింది.

**ఏం చేయాలి?**

- డిజిటల్ గోల్డ్ లేదా ఇ-గోల్డ్ పేరుమీద వచ్చిన సంస్థలు, యాప్‌లకు సెబీ రిజిస్ట్రేషన్ ఉందా అనేది ముందుగా తనిఖీ చేసుకోండి. - గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఈజీఆర్‌లను డీమ్యాట్ ఖాతా ద్వారానే కొనుగోలు చేయండి.
- ఆన్‌లైన్‌లో ఆకర్షణీయమైన ఆఫర్లను చూసి, వెంటనే పెట్టుబడులు పెట్టొద్దు. నష్టం గురించీ అంచనా వేయండి.
- ఇప్పటికే ఇలాంటి పథకాల్లో మదుపు చేస్తే అప్రమత్తత అవసరం. పెద్దగా పేరు లేని సంస్థల్లో పెట్టుబడులు పెట్టి ఉంటే, వాటిని - వెనక్కి తీసుకునే ప్రయత్నం చేయండి. ఈ మొత్తాన్ని సెబీ నియంత్రణ పరిధిలోని మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే గోల్డ్ ఫండ్లు లేదా గోల్డ్ ఈటీఎఫ్, గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్‌లోకి మళ్లించడం శ్రేయస్కరం.

## మైసిగండి మైసమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ నాయకులు




**మహేశ్వరం నవంబర్ 9 (నినాదం) :** కడ్తాల్ మైసిగండి మైసమ్మ తల్లి అమ్మవారిని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు దర్శించుకొని మైసిగండి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రామావత్ లక్ష్మీబాయి సిరోలి పంతు నాయక్ మాజీ ఎంపీపీని కుటుంబసభ్యులను కలిసి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్ ఎమ్మార్వో జ్యోతి బాయి ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్యావత్ రేఖ్య నాయక్, మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు పాత్లవత్ రవి నాయక్, అరుణ్ నాయక్, రమావత్ భాస్కర్ నాయక్, జరపల లక్ష్మణ్ నాయక్, సీతారాం నాయక్, నాగేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** శివశక్తుల దివ్య కల్యాణం భక్తి భావనలతో, ఆధ్యాత్మిక ఆనందంతో మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని లాస్ట్ బస్టాప్ శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో నిర్వహించిన మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి, శేరిలింగంపల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ పాల్గొని స్థానిక డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, నాయకులు బాలింగ్ యాదగిరి గౌడ్ స్థానిక కాలనీ నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పాలు, పుష్పాలు, మంత్రఘోషల మధ్య జరిగిన ఈ కల్యాణం ఆధ్యాత్మిక పరవశాన్ని కలిగించిందని అన్నారు. మల్లన్న ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామారెడ్డి, భాస్కర్ రెడ్డి, యాదగిరి, రామదాస్ గౌడ్, రఘురాం రెడ్డి, యాదవ రెడ్డి, లింగన్న, సాయి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శివకేశవుల మాసం కార్తీకమాసం

### రవికుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** శివకేశవుల మాసం కార్తీకమాసమని, ఈ మాసం ఆధ్యాత్మిక సాధనకు అత్యంత పవిత్రం, మహిమాన్వితమైనదని బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం బి.హెచ్.ఈ.ఎల్ ఓబీసీ కార్యాలయం వద్ద, బీరంగూడ గుట్ట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం వద్ద యాదవ సంఘాల ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కార్తీకమాస వనభోజన కార్యక్రమం నిర్వహించుకోవడం చాల ఆనందకరమైన విషయమని అన్నారు. వనభోజనాలు, సమావేశాలు మాత్రమే కాకుండా యాదవ సోదరులు అందరూ కలిసి ఒక కమిటీనీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కమిటీ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారిని గుర్తించి వారి ఆరోగ్యపరమైన, విద్యాపరమైన, మాట సాయం అందించి అందరినీ వృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. నా వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బసవరాజ్ యాదవ్, మహేష్ యాదవ్, నగేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, నంద గోపాల్, పాములేటి యాదవ్, రాజు యాదవ్, అంజయ్య యాదవ్, వెంకటేష్ యాదవ్, సంఘ నాయకులు, యాదవ సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

## బట్రాజు సంఘం నిర్వహించిన కార్తీక మాస వనభోజనాలలో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (నినాదం) :** కుత్బుల్లాపూర్, మేడ్చల్ జిల్లా భట్రాజు సంగం కార్తీక మాస వన సమారాధన మహోత్సవంలో పాల్గొన్న మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, జెకె శేఖర్ యాదవ్ లతో కెన్ సీ హాజరైనారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ బట్రాజు సంఘం సభ్యులలో నిరుపేదలు ఎవరున్నా సభ్యులందరూ సమిష్టిగా సహకార అందించి ఆదుకో వాలని సూచించారు. బట్రాజులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు రావుల పృథ్వి, డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత ,గుండు విజయ్, భరత్ కుమార్ ,మహేష్ , పాలవలస రవి, జగదీష్ గుప్తా తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## బీసీల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి : జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :** బీసీల జీవన ప్రమాణాలు పెంచేం దుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, బీసీల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి అడుగు ముందుకు వేస్తున్నారని జగదీశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజక వర్గం కూకట్పల్లి కౌండిన్య గౌడ్ సంఘం ఆధ్వర్యంలో చిత్తారమ్మ ఆలయం ప్రాంగణంలో కార్తీక మాసం వనభోజనాలు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్య క్షులు నల్ల సంజీవ రెడ్డి, నాయకులు బాలింగ్ యాదగిరి గౌడ్, డివిజన్ అధ్యక్షులు బాష్పాక యాదగిరి, మురళి కృష్ణ గౌడ్, విష్ణు గౌడ్, వెంకటేష్ గౌడ్, యాదగిరి గౌడ్, కుమార్, ఎల్ల రెడ్డి ఇతర నాయకులతో కలిసిటీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగం పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని కులాలను గౌరవిస్తూ, మన కుల అభివృద్ధికి కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోం దని తెలిపారు. కార్తీకమాసం హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన నెల అని, ఈ నెలలో వనభోజనాలు (ప్రకృతిలో భోజనం చేయడం) ఆధ్యాత్మికత, భక్తి,స్నేహభావం, ప్రకృతి పట్ల కృతజ్ఞతకు సంకేతం అని అన్నారు. గౌడ్ కులస్తులు పాతకాలం నుండి వ్యవసాయం, తాటి చెట్లు, సాంప్రదాయ వృత్తులలో నైపుణ్యం కలిగి, కష్టపడే మనస్తత్వం కలిగిన వారని అన్నారు.

## ప్రజల సంపూర్ణ మద్దతుతో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం తథ్యం

### ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (నినాదం):** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు వీకర్ సెక్షన్ కాలనీ, సాయిబాబా నగర్, బాబా సైలానీ నగర్, స్వరాజ్ నగర్, లతో పాటు పలు కాలనీలలో బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తో కలిసి బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ కు మద్దతుగా పాదయాత్ర ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి పివి వివేకానంద్ మాట్లాడుతూ గత 12 ఏళ్ల కాలంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ చేసిన కృషి, ప్రజలకు అందించిన సంక్షేమం మరో మారు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ గెలుపుకు బాటలు వేస్తా యన్నారు. ఇంటింట ప్రచారం ద్వారా ప్రజలకు చేరుతున్న తరుణంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనతో టిఆర్ఎస్ గెలుపు ఖాయమైందని, మెజార్టీ మాత్రమే తెలియాల్సి ఉందన్నారు. నవంబర్ 11న జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కు మూడవ నెంబర్ పై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ గెలుపు కేవలం జూబ్లీహిల్స్ వరకే పరిమితం కాదని, బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటి సమాధానం ఇవ్వాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ ప్రజల సంక్షేమం తిరిగి పునఃప్రారంభం అవ్వాలంటే బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇంచార్జ్ లు, బూత్ ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.



## భాదిత కురుంభానికి బాసటగా నిలిచిన మానవత్వం



**వికారాబాద్, నవంబర్9(నినాదం):** ఇటీవల రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యాలల్ మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన బందప్ప, లక్ష్మి ఇద్దరు మృతి చెందిన విషయం విధితమే దీంతో ఇద్దరు పిల్లలు అనాథలు గా మారారు. ఈ నేపథ్యంలో ఓ విలేకరి చలించి వాట్సాప్ గ్రూపులో ఈ విషయాన్ని షేర్ చేయడంతో మృతుల పెద్ద కూతురు శివలీల బ్యాంకు ఖాతా నెంబర్ కూడా షోషల్ మీడియాలో షేర్ చేయడంతో మానవత్వం ఉన్న వారు స్పందించారు. తోచిన సహాయాన్ని అందించారు. బి ఆర్ ఎస్ నాయకుడు సంగారెడ్డి జిల్లా కొండాపురం మండలం గొల్లపలి కి చెందిన శ్రీనివాస్ గౌడ్ లక్ష రూపాయలు, విగ్నేష్ గౌడ్ 20 వేల రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకులు గ్రామానికి వెళ్ళి ఆదివారం అందజేశారు. ఆపదలో మేమున్నామని వారు భరోసా ఇచ్చారు. చేవెళ్ళ మాజీ సర్పంచ్ శైలజ ఆగి రెడ్డి 10 వేల రూపాయలు సహాయం చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తం అంధించిన వారిలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఉన్నారు. ఎంపీ విశ్వేర్రెడ్డి కూడా తన వంతు సహాయాన్ని అందజేశారు. ఇప్పటికైన పిల్లలకు సహాయం అందించే మానవతా వాదులు శివలీల ఖాత నెంబర్ 4461397 3239 ఎస్బిఐ బ్యాంకు, ఐ ఎస్ ఎఫ్ కోడ్ ఎస్ బి ఐ ఎన్ 0020465 నంబర్ కు సహాయాన్ని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి

### కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్



**అల్వాల్, నవంబర్ 9నినాదం) :** మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ అభి వృద్ధి చేస్తానని కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం సాయి సూర్య ఎంక్లేవ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ను మచ్చ బొల్లారం కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ స్థానిక కాలనీ వాసు లతో కలిసి కొబ్బరి కాయ కొట్టి ప్రారం భించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సాయి సూర్య ఎంక్లేవ్ కొత్తగా ఏర్పాటు చేయబడిన కాలనీ అని ఇక్కడ దాదాపు కోటి రూపాయల వర్క్ చేశామని , దాదాపు 30లక్షల వ్యయం తో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రోడ్డు ను ప్రారంభించామని తెలిపారు. అదే విధంగా మిగిలిన సీసీ రోడ్డు పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కాలనీ వాసులతో కలిసి కాలనీ లో పర్యటిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, సర్వేశ్ యాదవ్, శ్రీశైలం యాదవ్,శ్రీనివాస్ గౌడ్, స్వామి, వెంకటేష్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి ,భాస్కర్ రెడ్డి ,వినయ్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా , సురేందర్ ,ఫణీంద్ర, ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవే ధర్మం అది సమ సమాజ నిర్మాణానికి పునాదిరాయి




### బాలాజీ నగర్ సెక్టర్ ఎస్సై రామ నాయక్

**జవహర్‌నగర్, నవంబర్9 (నినాదం):** మానవుల్లో సేవే ధర్మం అని అది సమ సమాజ నిర్మాణానికి పునాది రాయి లాంటిదని బాలాజీ నగర్ సెక్టర్ ఎస్సై రాము నాయక్ పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ హుతాత్మ దివస్ సందర్భంగా ఆదివారం బాలాజీ నగర్ మండే మార్కెట్ లోని అభయాంజనేయ దేవాలయం దగ్గర రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి బాలాజీ నగర్ సెక్టర్ ఎస్సై రాము నాయక్ హాజరై మాట్లాడుతూ, సమాజంలో ప్రతి మనిషి ఇతరులకు సహాయ పడాలని సేవ చేయడంలో ఉండే ఆనందం వర్ణించలేనిదని ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకొని ఇతరులకు సహాయం చేయాలన్నారు. రక్తదానం అనేది ఒక పుణ్య కార్యమని రక్తదానం ద్వారా ప్రాణం నిలుస్తుందని రక్తదానం ఒక పుణ్య కార్యమని రక్త దానాన్ని చేసి ఇతరుల ప్రాణాలను నిలబెట్టడం అంటే ఇంతకంటే మంచి పుణ్యకార్యం లోకంలో మరేదీ లేదన్నారు. బజరంగ్ దళ్ ఇటువంటి మహాకార్యాలు మరెన్నో చేపట్టాలని తద్వారా లోకోబివృద్ధికి పాటుపడాలని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన రక్తదాతలకు ఫలాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహ సంయోజక్ శ్రీకాంత్ మాట్లాడుతూ బజరంగ్దళ్ కార్యకర్తలు ఎప్పుడు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజాన్ని ధర్మాన్ని దేశాన్ని కాపాడుతూ వస్తున్నారని తెలిపారు. యువత రాబోయే రోజుల్లో ఇలాంటి మంచి సేవా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సంయోజక కుమారస్వామి, కార్తీక్, ప్రశాంత్, వంశీ, నవీన్, సంజయ్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుపేద ముదిరాజులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా

### డిసిసి ఉపాధ్యక్షులు దమ్మని శ్రావణ్ కుమార్ ముదిరాజ్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంకు చెందిన ముదిరాజ్ సంఘాల సభ్యులు కార్తీక మాస వనభోజనాల వేడుకలను హెచ్ఎంటి కాలనీ లో ఘనంగా నిర్వహించారు. కార్తీక మాస వనభోజన వేడుకలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా థిస్ ఈ ఉపాధ్యక్షులు దమ్మని శ్రావణ్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ సంఘానికి సంబంధించి నిరుపేదలు ఎవరున్నా ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు అందరికి అందేలా తమ వంతు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ విషయమై కుత్బుల్లాపూర్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు రామకృష్ణ ముదిరాజ్ ద్వారా, లేదా నేరుగా గాని తమను సంప్రదించిన ముదిరాజ్ బంధువులు అందరికీ కూడా సేవనందిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కోల రవీందర్ ముదిరాజ్ సబా అధ్యక్షత వహించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సి.ఐ గడ్డం మల్లేష్ ముదిరాజ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రామకృష్ణ ముదిరాజ్, కార్యవర్గం సభ్యులు గరిక శేఖర్ ముదిరాజ్, సుంకర సాయి ప్రతాప్ ముదిరాజ్, విగ్నేష్ ముదిరాజ్, ప్రకాష్ ముదిరాజ్, బాలరాజు ముదిరాజ్, నాగమణి ముదిరాజ్, పద్మ ముదిరాజ్, కృష్ణవేణి ముదిరాజ్, వివిధ డివిజన్లో ముదిరాజ్ సంగం, బంధువులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలి : భరత్ సింహారెడ్డి




**కుత్బుల్లాపూర్, నవంబర్ 9 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డి నగర్(వెస్ట్)లో బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి కాలనీ వాసులతో కలిసి కాలనీ లో పర్యటించారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఎం.పి లాడ్స్ నిధులతో నూతనంగా మంజూరై నిర్మాణం లో ఉన్న కాలనీ కమిటీ హాల్ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించి కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కమిటీ హాల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలనీ భరత్ సింహారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు టి.నాగేశ్వర్ రావు,ప్రభాకర్ రెడ్డి,బి.శ్రీనివాస్ రెడ్డి,కృష్ణ పటేల్,శ్రీనివాస్ గౌడ్, రాములు యాదవ్,విజయ్ కుమార్, శేఖర్ గౌడ్,సుధాకర్‌చారీ,విజయ్,వీర చారీ,గోపాల్ రెడ్డి,ధనరాజ్, శ్యామ్,నరసింహ రాజు,అరవింద్,చంద్రకళ,ప్రభాకర్ రెడ్డి,చక్రి,నవీన్ రెడ్డి,మురిలి, జోగారాం, కృష్ణఅప్ప, పాపయ్య, మహేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

## లొయోలా అకాడమీలో ఘనంగా ముగిసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం

**అల్వాల్, నవంబర్9(నినాదం):** 1976లో స్థాపించబడిన తరువాత, లొయోలా అకాడమీ తన 49 ఏళ్ల విశిష్ట ప్రస్థానంలో విద్యార్థుల విజయాలు, జ్ఞాపకాలను ప్రేమగా పదిలపరచు కుంటూ ముందుకు సాగుతోంది. పూర్వ విద్యార్థులు తమ ప్రయాణాన్ని స్మరించు కుంటూ, ఉత్సాహభరితమైన వాతావరణంలో ఈ సమ్మేళనం నవం బరు 8వ తేదిన ఘనంగా నిర్వహించబడింది. దేశం నలుమూలల నుంచి, విదేశాల నుంచి వచ్చిన పూర్వవిద్యార్థులు తమ కళాశాలను తిరిగి సందర్శించడంతో కళాశాల ఆవరణ పాత జ్ఞాపకాలతో మునిగిపోయింది. దశాబ్దాల క్రితం విద్యాభ్యసం పూర్తి చేసినవారు, ఇటీవలే బయటికి వెళ్లినవారితో కలసి పంచుకున్న స్మృతులు, అనుబంధాలు, స్నేహభావంతో ఈ కార్యక్రమం మరింత ఆహ్లా దకరంగా మారింది. వైస్ చైర్మన్ రెక్టర్ ఫాదర్ సిహెచ్. అమరరావు, పూర్వ విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించారు. ఆయన మాట్లాడుతూ, ఈ సమ్మేళనం సాధారణ సమావేశం మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిని సాధించిన లొయోలా పూర్వ విద్యార్థుల విజయాలను స్మరించడానికి, అభినందించడానికి ఒక అద్భుత వేదిక అని తెలిపారు. కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్. ఏ. ఫ్రాన్సిస్ జేవియర్,.



సంవత్సరాలుగా విద్యార్థులతో పంచుకున్న ప్రయాణాన్ని గర్వంగా గుర్తుచేసుకున్నారు. ప్రిన్సిపల్ ఫాదర్. డాక్టర్. ఎన్. బి. బాబు, లొయోలా అకాడమీ ఈరోజు పొందిన ప్రతిష్ట, స్థానానికి పూర్వవిద్యార్థుల సేవలు, విలువలు, ప్రతిభలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన అతిథిగా హాజరైన డా. సత్యనారాయణ వి. నండూరి , చైర్మన్ మరియు మెంబర్ ప్రసిద్ధ పరిశోధన అభివృద్ధి కన్సల్టెంట్, మాజీ చీఫ్ సైంటిస్ట్, హైదరాబాద్ గీతం ఏసిఎస్‌లో విశిష్టమైన శాస్త్రీయ పరి పాలనా భూమికల్లో సేవలందించినవారు తన విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, తనను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తనను కళాశాల ఈ గౌరవ స్థాయిలో తిరిగి ఆహ్వా నించడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. లొయోలా పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షులు శ్రీ మరియదాస్ పూదోట, లొయోలా జూనియర్ కాలేజ్ పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షులు శ్రీ కౌశిక్ కాతూరి మరియు అసోసియేషన్ కార్యదర్శి శ్రీ మానిక్య రెడ్డి గారు తమ అనుభవాలను పంచు కుంటూ, అకాడమీతో ఉన్న చిరస్థాయి అనుబంధాన్ని ఈ కార్యక్ర మంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రముఖ పూర్వవిద్యార్థులు శ్రీ సుధీర్ సూరసాని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మాంచెస్టర్ గ్లోబల్ స్కూల్‌బీ శ్రీ లక్కరాజు ఫణి ప్రకాశ్, డైరెక్టర్ సొల్యూషన్స్ అండ్ సేల్స్, బారేజ్ టెక్నాలజీ సొల్యూషన్స్, దుబాయ్‌బీ మరియు డా. టీ. చక్రధర్, ప్రోగ్రామ్ పాలసీ ఆఫీసర్, క్లైమేట్ రెసిలియంట్ అగ్రికల్చర్, వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అగ్రికల్చర్ 1994-97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ప్రకటించి కళాశాల యాజమాన్యానికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పూర్వ విద్యార్థులను ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు తమ కళాశాల స్నేహితులను కలుసుకుని ఆనందంగా కళాశాల ప్రాంగణంలో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సమావేశం పాత జ్ఞాపకాలను మళ్లీ నెమరు వేసుకునేలా చేసింది. లొయోలా అకాడమీ తో తమ పూర్వవిద్యార్థుల మధ్య ఉన్న బంధాన్ని తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో పూర్వవిద్యార్థులతో పాటు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ విజయ్ కుమార్ రెడ్డి, డిగ్రీ మరియు పిజి కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్స్ డా. ఎ.ఎమ్. జోసెఫ్, ఫాదర్ అరుల్ జోతి, ఫాదర్ పీటర్, ఫాదర్ త్రైనీస్, ఫాదర్ డా. తోమాస్ కళాశాల ఉపాధ్యాయులు, స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు కేదారికి వాసవీ రత్న అవార్డు



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం):** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులు నర్సిని కేదారిని ఘనంగా సన్మానించి వాసవి మీడియా రత్న అవార్డు ను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ, ఆర్.టి.ఐ కమీషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బోరెడ్డి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్ట్ ల పాత్ర కీలకం అని అన్నారు .ఆర్య వైశ్య జర్నలిస్టులు దేశం కోసం త్యాగం చేసినమహాత్మ గాంధీ, పొట్టి శ్రీరాములు వారసులుగా సమాజ సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయఅధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ మాట్లాడుతూ వాసవి క్లబ్ కేవలం వైష్యులకే కాకుండా సమాజం లోని అన్ని వర్గాలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు సైన్యానికి సైతం విరాళాలు ఇస్తున్నట్లు తెలిపారు. సమాజనిర్మాణంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకం అని అన్నారు వారి సేవలను గుర్తిస్తూ కలం యోధులకు అభినందన మందారమాల కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ దోనపాటి వెంకటేశ్వర్ రావు, సిద్ద సూర్య ప్రకాష్ రావు, బోడ సూర్య ప్రకాష్, గార్లపాటి శ్రీనివాసులు,సుజాత రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్ట్ అంజయ్య లు పాల్గొన్నారు.

# నేత్రదానం పై అపోహలు వద్దు

**నేత్రదాత కొలగాని రాధమ్మ చూపు సజీవం**

**నేత్రదానంపై అవగాహన కలిగించిన సదాశివ ఫౌండేషన్ సభ్యులు**



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం):** జమ్మికుంట పట్టణంలోని మారుతీ నగర్‌లో నేత్ర దాత కొలగాని రాధమ్మ (65)సంస్మరణ సభను వారి నివాసంలో నిర్వహించిన కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు.ఈ సందర్భంగా వారికి నివాళు లు అర్పించి కుటుంబానికి అభినందనలు తెలిపిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత నెల 3వ తేదీన రాధమ్మ గుండెపోటుతో మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. ఆమె మరణించిన ఆమె నేత్రాలు మాత్రం సజీవంగా ఉన్నాయని సదాశియ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. మనిషి బ్రతికున్నప్పుడు అవసరమన్నావయ్యాలు చనిపోయిన తర్వాత కూడా కొంతమందికి అవసరానికి వస్తాయని అందులో ముఖ్యమైనవి కండ్లు అని వారు తెలిపారు. మనిషి మరణానంతరం కండ్లను దానం చేయడం వల్ల మరో ఇద్దరు అందులకు చూపును ప్రసాదించిన వారు అవుతారనీ తెలిపారు. నేత్రదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని నేత్రదానంపై అపోహలు అవసరం లేదని వారు రాధమ్మ కుటుంబ సభ్యుల తోపాటు సంస్మరణ సభకు హాజరైన వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆదివారం నేత్రదాత నివాసములో కొలగాని రాధమ్మ సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు యం.నరహరి ఆధ్వర్యంలో నిర్వహించినారు. ఈ కార్యక్రమంలోసదాశయ ఫౌండేషన్ జమ్మికుంట బాధ్యులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు ముత్యాల జగదీశ్వర్ పాల్గొనినారు. అధ్యక్షులు మచ్చగిరి నరహరి నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించి జ్ఞాపికను భర్త ఈశ్వరయ్య, కుమారులు, శ్రీనివాస్, రాజేందర్ మరియు కుటుంబ సభ్యులకుఅందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు.ముస్త్యాల జగదీశ్వర్ వంగల రమేష్, చిదురాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

# అత్యున్నత ప్రతిభ ఊడుగుల సొంతం

**గోల్డ్ మెడల్స్ అందుకున్న వైద్యుడు సురేష్**

**విలువైన వైద్యాన్ని గ్రామీణ ప్రజలకు తక్కువ ఖర్చులో అందించేందుకు ప్రయత్నం**

**సామాజిక బాధ్యతగా పలు ఆరోగ్య సంబంధిత విషయాలపై నిత్యం అవగాహన**





**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం) :** ప్రజలకు సేవ చేయాలనే ఆశయం, ఆలోచనకు బీజం చిన్న నాటనే ఆయన మనసులో పడింది. తన సొంతూరు నుంచి సుదూర ప్రాంతాలకు సరైన వైద్యం కోసం తండ్రి, గ్రామస్తులు వెళ్తుండటం గమనించిన ఆయన.. వైద్యుడిని అయి సొంతూరులో ఆస్పత్రి స్థాపించాలని కల కన్నారు. ఆ కల సాకారం చేసుకునేందుకు ఇష్టపడి, కష్టపడి వైద్య విద్య చదివి.. హాస్పిటల్ ఎస్టాబ్లిష్ చేశారు. వృత్తిలో నైపుణ్యాన్ని, ఎన్నో గోల్డ్ మెడల్స్‌ను సైతం సంపాదించి.. ప్రముఖ వైద్యుడిగా పేరొంది.. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చులో విలువైన ట్రీట్‌మెంట్ అందించేందుకు ఆయన కృషి చేస్తున్నారు. ఇంతకీ ఆయనెవరంటే..మోత్కులగూడెం వాసి, సహస్ర స్టార్ హాస్పిటల్, సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు, ఎంబీబీఎస్, ఎండీ జనరల్ ఫిజీషియన్, డీఏ కన్సల్టెంట్ ఫిజీషియన్, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, పెయిన్ స్పెషలిస్ట్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఊడుగుల సురేశ్..

**చంద్రబాబు చేతుల మీదుగా అత్యున్నత ప్రతిభ అవార్డు..**

మోత్కులగుడెంలో ఊడుగుల లక్ష్మీ–మల్లయ్య దంపతులకు 1985లో జన్మించిన సురేశ్ చిన్న నాటి నుంచి చదువులో ముందున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు జమ్మికుంట జవహర్ పబ్లిక్ స్కూల్‌లో చదివిన సురేశ్..8 నుంచి 10 వ తరగతి వరకు విద్యోదయ హైస్కూల్ విద్యను అభ్యసించారు. ఆ సమయంలో టెన్త్ క్లాస్ రిజల్ట్స్‌లో టాపర్‌గా నిలిచారు.రాష్ట్ర స్థాయిలో 561 మార్కులు/600 సాధించారు. అందుకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అత్యున్నత ప్రతిభ అవార్డు అందుకున్నారు. బాల వికాస సమితి ఆధ్వర్యంలోనూ పురస్కారం అందుకున్నారు. హన్మకొండ ఎస్వీసీ కాలేజీలో ఇంటర్మీడియెట్‌లో బైపీసీ ఎంచుకున్న సురేశ్.. అక్కడ కూడా చదువులో రాణించారు. ఇంటర్‌లోనూ రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించారు. 956/1000 మార్కులు సాధించి.. శభాష్ అనిపించుకున్నారు.

**మెడికల్ విద్యలో వరించిన స్వర్ణ పతకాలు**

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అనంతపూర్‌లో ఎంబీబీఎస్ విద్యను ఊడుగుల సురేశ్ అభ్యసించారు. చదువుతున్న క్రమంలో ఎన్నో గోల్డ్ మెడల్స్ సాధించి బెస్ట్ ఔట్ గోయింగ్ డాక్టర్‌గా ఎంసీఐ మెంబర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. అనంతరం డిప్లొమా ఇన్ అనేస్తేసియా చేశారు. కేఎంసీ వరంగల్‌లో రాష్ట్ర వ్యాప్త క్విజ్ పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. అనంతరం ఎండీ(జనరల్ మెడిసిన్) శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ తిరుపతిలో అభ్యసించారు. ఆ సమయంలోనూ అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా బెస్ట్ డాక్టర్ అవార్డు అందుకున్నారు.ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే మనస్తత్వం కలిగిన సురేశ్ నిరాడంబరంగా ఉంటూ.. పేద ప్రజలకు వైద్యం అందిస్తూ.. సేవామార్గంలో ముందుకెళ్తున్నారు.

**సామాజిక బాధ్యతపై పలు విషయాలపై అవేర్‌నెస్**

పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న వైద్యులు తమ వృత్తి జీవితంలో ఎంతో బిజీగా ఉంటారు. తమ విధులు నిర్వర్తించే సమయంలోనూ దాదాపుగా తలమునకలై అలసిపోతుంటారు. కాగా, ఆ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూనే.. సామాజిక బాధ్యతగా పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిం చడంలో ముందు వరుసలో నిలుస్తున్నారు డాక్టర్ ఊడుగుల సురేశ్. నిత్యం సోషల్ మీడియా వేదికగా ప్రజారోగ్యం కోసం జ్వరం, షుగర్, బీపీ, గుండె పోటు, పాము కాటు, తేలు కాటు మొదలైన ఆరోగ్య సూత్రాలు, సైంటిఫిక్ విషయాలను గురించి అవగాహన కల్పిస్తుండటం విశేషం. ప్రజలకు నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉంటూనే.. ఫోన్ కాల్‌కు సైతం రెస్పాండ్ అయ్యేలా ఆయన సేవలు కొనసాగుతుండటం ముదావహమే. ‘ద జెర్డ్ గైడ్’తో పాటు షుగర్ ఇతర విషయాలపై డాక్టర్ ఊడుగుల సురేశ్ పుస్తకాలను సైతం రచించి అందుబాటులోకి తీసుకురావడం ప్రత్యేకం. ఆస్పత్రిలో రోగులకు అందరికీ అందుబాటులో వెంటిలేటర్, డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.

**బాల్యంలోనే నాయకత్వ లక్షణాలు**

బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్న డాక్టర్ ఊడుగుల సురేశ్.. చదువులో ముందుంటూనే.. విద్యార్థి దశలో జూనియర్ డాక్టర్స్ సంఘానికి అధ్యక్షుడిగా పని చేశాను. వైద్యుడిగా ప్రాక్టీసు మొదలు పెట్టిన తాను ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు అత్యంత విలువైన, ముఖ్యమైన ఐసీయూ,



వెంటిలేటర్, డయాలసిస్, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ సర్వీసులను తక్కువ ఖర్చుతో అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఓ పేషెంట్(పేరు గోప్యం) పురుగుల మందు తాగిన క్రమంలో పేషెంట్‌కు వెంటిలేటర్ మీద చికిత్స చేయగా, సదరు పేషెంట్ రికవర్ అయి ధన్యవాదాలు తెలిపిన సందర్భంగా తనకు జీవితంలో డాక్టర్‌గా సంతృప్తిని ఇచ్చిందని సురేశ్ పేర్కొన్నారు. మోత్కులగూడెం గ్రామం, పరిసర ప్రాంత ప్రజలు సరైన వైద్యం కోసం హన్మకొండ, వరంగల్‌కు గతంలో వెళ్తుండేవారని, వారికి సరైన వైద్యం ఇక్కడే ఇవ్వాలనే ఉద్దేశంతోనే తాను తన సొంతూరు మోతుకులగూడెం జమ్మికుంటలోనే ఆస్పత్రి స్థాపించాలని చిన్ననాటే భావించానని పేర్కొన్నారు. అలా సహస్ర స్టార్ హాస్పిటల్‌ను సురేశ్ ప్రారంభించారు. డాక్టర్ ఊడుగుల సురేశ్ జీవిత భాగస్వామి డాక్టర్ ఊడుగుల అనిత(ఎంఎస్ జనరల్ సర్జన్)గా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు.

## కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో పాల క్యాన్ల పంపిణీ



**కరీంనగర్, నవంబర్ 9(నినాదం):** కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గద్దపాక డెయిరీ సభ్యులకు పాలక్యాండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ, గద్దపాకలో మహి ళల ఆధ్వర్యంలో పాలకేంద్రం నిర్వహించడం అభినందనీయమ న్నారు. గతంలో మూలపడ్డ పాల కేంద్రాన్ని మళ్లీ తెరిచి మహిళల ఆధ్వర్యంలో పాల సేకరణ చేస్తూ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహిస్తున్న అధ్యక్షులు, పాలకవర్గాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందిం చారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షురాలు జక్కుల పద్మ, నిర్వాహకులు పలకల శ్యాంసుందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

**నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం**



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజు ఠాకూర్ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబుతో ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, హోరాహోరీగా నడుస్తున్న ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవబోతున్నారని జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని తెలిపారు. ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా యువ నాయకుడు నవీన్ యాదవ్ నువ్వు గెలిపిస్తామని ప్రజలు తెలుపుతున్నట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు సాయిని రవి సీనియర్ కాంగ్రెస్ నాయకులు పంజాల అజయ్ గౌడ్ మహేష్ దొమ్మాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజారాజ్యం పార్టీలో యువతకు ప్రాధాన్యత

**స్థానిక సంస్థ ఎన్నికలలో నాలుగు స్తంభాలాట**

**రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్**



**కరీంనగర్, నవంబర్ 9(నినాదం):** తెలంగాణ ప్రజారాజ్యం పార్టీలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ అన్నారు ఆదివారం కరీంనగర్ లో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ, తెలంగాణ జిల్లాలో తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ లో చేరడానికి చాలా మంది ఆసక్తి చూపెడుతున్నారు అన్నారు. రాజకీయ నాయకులుగా మంచి నాయకత్వం గల నాయకులను తయారు చేయడం జరుగుతుంది అన్నారు. అత్యధికంగా యువత కలిగిన మన రాష్ట్రములో చాలామంది యువకులు విద్యకు తగిన ఉద్యోగం లేకుండా సరైన ఉపాధి లేకుండా నష్టపోతున్నారు. ఇలా జరగకుండా ఉండాలి అంటే యువత రాజకీయరంగ ప్రవేశం చేయాలి. తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ పక్కా లోకల్ అన్నారు. లోకల్ యువతకు చైతన్యవంతం చేయడమే తమ లక్ష్యం అన్నారు. యువత తలుచుకుంటే ఏదైనా చేయవచ్చు . కాబట్టి ఇప్పుడు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అవకాశం ఇవ్వాలి . కాబట్టి ఈ యొక్క మార్పు పల్లెల్లో నుంచి పట్టణం వరకు చేరాలి గల్లి నుండి ఢిల్లీ వరకు చేరాలి అన్నారు.రాష్ట్ర నాయకులు రిటైర్డ్ ఐఏఎస్ కూనప రెడ్డి హరిప్రసాద్, రాష్ట్ర మహిళా నాయకులు విజయ రెడ్డి, ఉదయ సింగ్, కనమండ్ల నోవా తదితరులు పాల్గొన్నారు.

## కంకాలమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నవంబర్ 09(నినాదం):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో ఈనెల 16,17 తేదీలలో కంకలమ్మ గుట్టపై జరగనున్న మహా జాతర కు సంబం ధించిన ఏర్పాట్లను కాగజ్ నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, సీఐ సంతోష్ కుమార్ ఎస్ఐ చంద్రశేఖర్ లతో కలిసి ఆదివారం పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీ, జాతరలో భక్తులకు కల్పించే వసతులపై డిఎస్పి వహీదుద్దీన్ నిర్వాహకులు సులువ కనకయ్య ను అడిగి తెలుసుకున్నారు. జాతర రోజుల లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్ర త్తలపై పోలీసు సిబ్బందికి డిఎస్పి పలు సూచనలు చేశారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలుపు హస్తగతమే

**కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పొనగంటి మల్లయ్య**



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యువ నాయకుడు నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుస్తాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొనగంటి మల్లయ్య తెలిపారు. ఆదివారంతో ఎన్నికల ప్రచారం ముగిసిందని గతంలో నవీన్ యాదవ్ తో కలిసి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సమయంలో అక్కడి ప్రజల నుండి నవీన్ యాదవ్ కు విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ లో తిరిగినప్పుడు యువనేత నవీన్ యాదవ్ గతంలో చేసిన సేవలను స్థానిక ప్రజలు ప్రస్తావించడం జరిగిందని నవీన్ యాదవ్ గెలిస్తేనే మాకు భవిష్యత్తు ఉంటుందని అక్కడి ప్రజలు బహిరంగంగానే తెలిపారని మల్లయ్య అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను ఇక్కడి ప్రజలు విశ్వసిస్తున్నారని భవిష్యత్తు బాగుండాలంటే ఇక్కడ చేయి గుర్తు గెలవాలని అక్కడి ప్రజలు నిర్ణయించుకున్నట్లు మల్లయ్య తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరడంతో ప్రభుత్వంపై వారు పూర్తి విశ్వాసంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. భారీ మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపు తధ్యమని ఆయన జోష్యం చెప్పారు.

## జమ్మికుంట, హుజురాబాద్ వైద్య రంగంలో అరుదైన విజయం

**సెప్సిస్‌తో మల్టీ ఆర్గన్ ఫెయిల్యూర్**

**డయాలిసిస్‌తో ప్రాణం నిలబెట్టిన సంజీవని వైద్యులు**



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం):** జమ్మికుంట,హుజురాబాద్ ప్రాంత వైద్య చరిత్రలో అరుదైన వైద్య విజయం నమోదు అయింది. తీవ్ర స్థితిలో ఉన్న ఒక రోగిని విజయవంతంగా చికిత్స చేసి బ్రతికించిన ఘటన స్థానికంగా విశేషంగా నిలిచింది.సమాచారం ప్రకారం సెప్సిస్ కారణంగా మల్టీ ఆర్గన్ ఫెయిల్యూర్, కిడ్నీ,లివర్ ఫెయిల్యూర్, తో పాటు ఫిట్స్, అన్‌కాన్షియస్ స్థితిలో ఉన్న ఒక పేషెంట్‌ను జమ్మికుంట పట్టణము లోని సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. ఆసుపత్రికి చేరుకునే సమయానికి రోగి జీవన సూచికలు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండగా, వెంటనే క్రిటికల్ కేర్ ట్రీట్మెంట్ ప్రారంభించారు.ఈ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో, ఎండి ఫిజీషియన్, క్రిటికల్ కేర్ డాక్టర్ ఉడుగుల సూరేష్ తక్షణ నిర్ణయాలతో రోగికి డయాలిసిస్, ఐసీయూ మేనేజ్‌మెంట్, ఆర్గన్ సపోర్ట్ థెరపీ అందించారు. నిరంతర పర్యవేక్షణతో పలుకుళ్లవారంలో పేషెంట్ పరిస్థితి మెరుగుపడి, ప్రస్తుతం కోలుకు న్నట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.స్థానిక ప్రజలు, రోగి కుటుంబ సభ్యులు డాక్టర్ సురేష్ నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ, గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి అత్యాధునిక క్రిటికల్ కేర్ చికిత్స అందుబాటులో ఉండటం ఒక వరమని అభిప్రాయపడ్డారు.ఈ ఘటన జమ్మికుంట, హుజురాబాద్ వైద్య రంగంలో కొత్త మైలురాయిగా నిలిచింది.

## రాజన్న దర్శనం..భీమన్నకు మొక్కులు

**-ఆలయాల్లో కార్తీక సందడి**






**వేములవాడ, నవంబర్ 09(నినాదం) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజే శ్వర స్వామివారి దివ్య క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో భక్తులు రాజన్న దర్శనం చేసుకొని భీమ న్న ఆలయంలో మొక్కు లు చెల్లించుకుంటు న్నారు. రాజన్న ఆలయంలో కొనసాగుతున్న పనుల నేపథ్యంలో భక్తులకు కేవలం లఘు దర్శన సౌకర్యం కల్పించడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయం ముందు భాగంలో రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భీమేశ్వరాలయంలో కోడె మొక్కుతో పాటు ఇతర ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీతో ఆలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది.


## శివన్నామస్మరణతో మారు మ్రోగిన జమ్మికుంట

**నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు**



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం) :** ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు శివ నామస్మరణతో పట్టణం మారు మ్రోగింది. పట్టణంలోని శివాలయం నుండి ఉదయం 4 గంటలకు అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నగర సంకీర్తన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా భక్తులు స్వామివారిని పట్టణ పురవీధుల గుండా నగర సంకీర్తన నిర్వహించారు. వందలాదిమంది భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ సేవా సమితి సభ్యులతో పాటు భవాని భజన మండల సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అప్పుల బాధ భరించలేక యువరైతు ఆత్మహత్య



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం):** అప్పుల బాధ భరించలేక ఓ యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జమ్మికుంట మండలంలో చోటుచేసుకుంది.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట మండలం నాగం పేట గ్రామానికి చెందిన సోమల్ల సదయ్య రాజమ్మ ల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హరీష్ (28) అనే యువకుడు బిటెక్ మధ్యలోనే ఆపివేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. తనకు ఉన్న రెండెకరాల సంత భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం పత్తి సాగు చేస్తున్నాడు . ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి పంటతోపాటు పొలం కూడా వర్షాలకు పూర్తిగా దెబ్బతినిపోయింది. పంట కోసం దాదాపు 5 లక్షల రూపాయలు అప్పులు చేయగా అవి తీరకపోవడంతో వ్యవసాయ భూమి వద్దనే పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. .మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామకృష్ణ గౌడ్ తెలిపారు.


## నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం చేసిన మైనారిటీ చైర్మన్ తాజోద్దీన్




**కరీంనగర్, నవంబర్ 9(నినాదం):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజు బోరబండ ప్రాంతం లో ప్రచారం చేసిన బోరబండ అబ్బర్ ర్వర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో జోరుగా సాగింది మస్జిద్ లా వద్ద, చాపల మార్కెట్, మంగలి షాప్, ఫ్రూట్ షాప్, మోచి చెప్పులు కుట్టే షాప్ మొదలగు వారి వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓట్ వేసి గెలిపించాలని కోరడం జరిగింది. ఈరోజు ప్రచారం కార్యక్రమం లొ కాంగ్రెస్ మైనారిటీ నాయకులు మహమ్మద్ కలిమోద్దీన్, మతీన్ ఖాన్ ఖాజా ఖాన్ ముజాహిద్ అజీం, అహ్మద్ పాషా, అబ్దుల్ కరీం, సలీం, జాకిర్ తదితరులు పాల్గొన్నారు.

## నిండు ప్రాణాల్ని బలిగొన్న అతివేగం


**రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి**





**వేములవాడ, నవంబర్ 09(నినాదం):** అతివేగం కారణంగా ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా వారి కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లాకు చెందిన రవీందర్ సరితల కుమారుడు మణిచరణ్ (18) వేములవాడ అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ఆదివారం తన స్నేహితుడి బైక్ తీసుకుని రగుడులోని తన మిత్రుడు, భూమయ్య దేవలక్ష్మి దంపతుల కుమారుడు శశికుమార్(18) వద్దకి వెళ్ళాడు. ఇద్దరూ కలిసి బైక్ పై వేములవాడ వైపు వస్తుండగా అగ్రహారం శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి మణిచరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన శశికుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఇద్దరు మృతితో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం):** జమ్మికుంట మండల సీనియర్ పాత్రికేయులు కొలగాని రాజేందర్ తల్లి కొలగాని రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆదివారం మృతురాలి కుటుంబాన్ని సింగిల్ విండో అధ్యక్షులు పొనగంటి సంపత్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వర్ రావు, మున్నూరు కాపు సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు ఏ బూసి శ్రీనివాస్ పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి శంకర్, శ్రీనివాస్, కొండపర్తి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు అటవీ శాఖ స్థలాన్ని సంరక్షించండి..?

**ఆక్రమణకు గురవుతున్న పట్టించుకోరేందుకు..!**

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం) :** పట్టణం నడిబొడ్డున ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్న పట్టించుకునేవారు లేరు.. ఈ స్థలం విలువ దాదాపు కోట్లల్లో ఉంటుందని తెలుస్తుంది. మరి ఈ స్థలంపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకో తెలవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వివరాలలోకి వెళితే...వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా శిథిలావస్థలో పెంకుటిల్లు ఉంది. గతంలో ఈ పెంకుటిల్లులో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ కార్యాలయం ఉండేది. ఎన్నో ఏండ్లుగా ఈ కార్యాలయంలోనే అధికారులు పనిచేశారు. ఈ క్రమంలోనే ఈ కార్యాలయం (పెంకుటిల్లు) శిథిలావస్థకు చేరడంతో పట్టణంలోని కేడీఆర్ నగర్ లో ఉన్న ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలోకి బీట్ ఆఫీసర్ కార్యాలయాన్ని మార్చారని చెబుతున్నారు. ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుండే బీట్ ఆఫీసర్లు తమ విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వనపర్తి జిల్లా కేంద్రం అయ్యాక జిల్లా అటవీ శాఖ కార్యాలయాన్ని మర్రి



కుంటలోని ఏకో పార్క్ లో ఉన్న భవనంలో ఏర్పాటు చేశారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయం, ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాల నుండి అధికారులు తమ విధులు కొనసాగిస్తున్నారు. కానీ శిథిలావస్థలో ఉన్న బీట్ ఆఫీసర్ కార్యాలయ స్థలాన్ని మాత్రం ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నది. ఆ స్థలం ముందు భాగాన్ని కొందరు కబ్జా చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. జిల్లాకు కొత్తగా వచ్చిన అటవీ శాఖ అధికారులకు ఈ స్థలం గురించి అడిగితే ఎక్కడ ఉందని, మాకు తెలవదు అనే సమాధానాలు వస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. పట్టణ నడిబొడ్డున ఎంతో విలువైన ఈ స్థలాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని కంచెను ఏర్పాటు చేస్తే ఈ స్థలం అబ్జాకు గురి కాకుండా ఉంటుందని పలువురు అంటున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోకపోతే విలువైన స్థలాన్ని ప్రభుత్వం కోల్పోవల్సి వస్తుందని పట్టణ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అటవీ శాఖ అధికారులు ఈ స్థలాన్ని పరిశీలించి ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు పంపాలనీ, ఈ స్థలంలో కొత్త భవనం నిర్మిస్తే అటవీ శాఖ అధికారులకు అందుబాటులో ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఎంతో విలువైన అటవీ శాఖ స్థలాన్ని సంరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు

## షాట్ పుట్ జిల్లాస్థాయికి ఎంపిక



**నూతనకల్ నవంబర్ 9నినాదం :** జిల్లా కేంద్రంలో శనివారం ఎస్వీ డిగ్రీ కళాశాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీల్లో మండల పరిధిలోని తాళ్లసింగారం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు షాట్ పుట్ అండర్-17 విభాగంలో జి.విద్యావతి మొదటి స్థానం,అండర్ 16 జావెలిన్ త్రో (ఈటె విసురు) విభాగంలో కే.పరమేష్ ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు సమత తెలిపారు. పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుని కృషి అభినందనీయమని ప్రధాన ఉపాధ్యాయుడు సోమయ్య గౌడ్,ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



**మిర్యాలగూడ నవంబర్ 9(నినాదం):** తెలంగాణ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నల్గొండ జిల్లా కార్యదర్శిగా బొందు పార్వతి మూడోసారి, మిర్యాలగూడకు చెందిన మరో నలుగురు ఎన్నికయ్యారు. నకిరేకల్ పట్టణంలో జరిగిన జిల్లా ఐదో మహాసభలో ముఖ్య అతిథులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, నల్గొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సలీం, ఔటర్ రవీంద్ర, ఎల్ రాజు పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కమిటీకి గౌరవ అధ్యక్షు లుగా తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పొడిశెట్టి నాగమణి, జిల్లా కార్యదర్శిగా బొందు పార్వతి ఉపాధ్యక్షురాలుగా ఇంద్రపల్లి సైదమ్మ, దాడి అరుణ, నాగమణి, సహాయ కార్యదర్శిగా పద్మ, ప్రచార కార్యదర్శిగా సుభాషిని, రషీద, కమిటీ సభ్యులుగా స్వరాజ్యం రాధాబాయి నాగమ్మ సముద్రమ్మ సునంద జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా విజయలక్ష్మి మొత్తం 35 మందితో జిల్లా కమిటిని ఎన్నుకున్నారు.

### ఎమ్మెల్యే సహకారంతో సీఎం
## సహాయనిధి చెక్కులను అందజేత



**మునుగోడు నవంబర్ 9 (నినాదం) :** మునుగోడు శాసన సభ్యులు, కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మందికి రూ.191500/- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరు కావడం జరిగింది. అట్టి చెక్కులను, మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కొరివి ఓంకారం చేతుల మీదుగా ఆదివారం పంపిణీ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ప్రజల పాలిట ఒక వరమని దీని అందరూ సద్వినియం చేసుకోవాలని అన్నారు. దీని కోసం ప్రజలు ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రత్యేకంగా పిఏను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తు పారాలను మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి హైదరాబాదు పంపించి, మంజూరైన చెక్కులను పార్టీ నాయకుల ద్వారా లబ్దిదారులకు అందించే విధంగా ఏర్పాటు చేస్తున్నందుకు రాజ్ గోపాల్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.ఇట్టి కార్యక్రమం లో మాజి సర్పంచ్ పడసనబోయిన యాదయ్య, మాజీ ఎంపిటీసీ బొమ్మరగొని యాదయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సోము లింగ స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నీలకంఠం సాయిలు, పడసనబోయిన నగేష్, సాయం లౌకి , శివ, వెంకటయ్య పాల్గొన్నారు.

## గ్రామాల్లో మహిళా సంఘాలు మరింత బలపడాలి



**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**నర్సంపేట నవంబర్ 9 ( నినాదం ) :** గ్రామాల్లో మహిళ సంఘాలు మరింత బలోపేతం కావాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామంలో మహిళలకు డీఆర్డీఏ , ఎస్ బిఐ ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలన్నారు. అదే విధంగా మహిళా సంఘాల సభ్యుల సభ్యులు ప్రభుత్వ సహకారంతో కుటీర పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలి అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాలు,పెరుగు, కూరగాయలు పెంపకం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చునని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా గ్రామాల్లోనే మార్కెట్ లభిస్తుందని అన్నారు. అదే విధంగా గ్రామంలోని14 మహిళా సంఘాలకు 2 కోట్ల70 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలను సంఘాల సభ్యులకు అందించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ పీడీ రేణుకాదేవి ,నర్సంపేట,నెక్కొండ మార్కెట్ ఛైర్మెన్లు పాలయి శ్రీనివాస్ ,హరీష్ రెడ్డి, పీసీసీ మెంబెర్ రంజిత్ రెడ్డి, పెండెం రామానంద్ పులి నవీన్ , కొయ్యడ రాంబాబు, మెరుగు కుమారస్వామి, పోశాల ఏకంబరం వల్లజి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండలో ఘనంగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మునుగోడు నవంబర్ 9 (నినాదం) :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నల్లగొండ జిల్లా పక్షాన చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. అనంతరం, కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు, బిస్కెట్లు కేకులు ఇవ్వడం జరిగింది. వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడైన డాక్టర్ చంటి ముదిరాజ్ కి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్ కి, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ఎన్నో విజయాలు, మరెన్నో వసంతాలు జరుపుకోవాలని, కోరుకుంటున్నానని అన్నారు. సామాన్యునికి సమాచారం అందజేయడంలో , సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని, ఉండాలనితెలిపారు. మన సంస్థ పోరాటం చేసేది రాష్ట్రం లో ప్రధానంగా ఉచిత విద్య, వైద్యం సాధించాలని, అది మన రాష్ట్రంలో 100% జరగాలని ఆ నినాదంతో ముందుకెళ్తున్నామని, తెలిపారు. ఈ కార్యక్రమం లో, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం వెంకట మధు, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధం వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు బైరు రవి తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభను చాటిన మాంటిస్టోరీ స్కూల్ విద్యార్థులు

**విద్యతోపాటు క్రీడలో రాణించాలి..**
**మాంటిస్టోరీ స్కూల్ కరస్పాండెంట్ గాస్పెర్**

**డోర్నకల్ /మరిపెడ నవంబర్ 09(నినాదం) :** తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల సంఘం (ట్రస్మా ) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో మాంటిస్టోరీ స్కూల్ విద్యార్థులు జూనియర్ కబడ్డీ ఆటలో జిల్లా స్థాయికి ఎంపికై అందరిని అబ్బురపరిచారు.జిల్లాస్థాయిలో 20 మండలాల నుండి 90 ప్రైవేట్ పాఠశాలలు పోటీ లో పాల్గొంటే జరిగిన క్రీడా పోటీలో మాంటిస్టోరీ స్కూల్ విద్యార్థులు జూనియర్ కబడ్డీ ఆటలో విజయకేతనం ఎగురవేసి మొదటి బహుమతిని గెలుచుకున్నారు.మహబూబాద్ టౌన్ సీఐ,ఎస్సై చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు.పాఠశాల కరస్పాండెంట్ గాస్పెర్ జిల్లా స్థాయిలో పాఠశాలకు గుర్తింపు తెచ్చినందుకు విద్యార్థులను ఎంతగానో అభినందించారు.కనీవిని ఎరుగని రీతిలో క్రీడను ప్రదర్శించారని క్రీడాకారులను కొనియాడారు. విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో క్రీడారంగంలో ఉన్నతమైన ఉద్యోగాలు సాధించవచ్చు అన్నారు.నేటి కంప్యూటర్ యుగంలో యువత, విద్యార్థులు స్మార్ట్ ఫోన్ లకు అట్రాక్ట్ అయిపోతున్నారు.క్రీడల్లో రాణిస్తే శరీరకంగా,ఆరోగ్యంగా ఉండడంతోపాటు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు అన్నారు.



# ప్రతి పౌరుడిలో న్యాయ అవగాహన పెంపొందించాలి





**ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం) :** పేద, అణగారిన, వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడ, ప్రతి పౌరుడిలో న్యాయ అవగాహన పెంపొందించడమే న్యాయ సేవాధికార సంస్థల ప్రధాన ఉద్దేశమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టీ.కార్తీక్ రెడ్డి అన్నారు. న్యాయ సేవాధికార చట్టం1987 అమలును స్మరించుకుంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ రజిని సూచన మేరకు ఆదివారం వనపర్తి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రాజీ మార్గమే రాజ మార్గం అంటూ కోర్టు ప్రాంగణం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, సేవలు అందించడమే న్యాయ సేవాధికార సంస్థ ధ్యేయమని, కాబట్టి ఈ న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజలు తమ హక్కుల గురించి, చట్టపరమైన రక్షణా మార్గాల గురించి సేవలు న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా పొందవచ్చని వివరణ ఇచ్చారు. అలాగే లోక్ అదాలత్, ఉచిత న్యాయ సలహా కేంద్రాలు, మధ్యవర్తిత్వ విధానాల ద్వారా తక్షణ పరిష్కారం సాధ్యమని వివరించారు. జిల్లా ప్రజలు న్యాయ సేవల ప్రయోజనాలను వినియోగించుకోవాలని, హక్కుల రక్షణ కోసం చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టం, న్యాయం దృష్టిలో ప్రతిఒక్కరూ సమానమేనన్నారు. ప్రతి ఒకరికి ఉచిత న్యాయ సేవలు, న్యాయ సలహాలు అందాలనే ఉద్దేశంతో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో లోక్అదాలత్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం న్యాయ సేవలపై పాటలు, డప్పు ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, సఖి సెంటర్ ప్రతినిధి కవిత, దివ్య భారతి, సామాజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు




### కీర్య తండా లంబాడీ జేఏసీ కమిటీ అధ్యక్షులుగా కిషన్ నాయక్





**ఖానాపురం నవంబర్ 9 ( నినాదం) :** ఖానాపురం మండలంలోని కీర్య తండా గ్రామ లంబాడి జేఏసీ కమిటీ అధ్యక్షులుగా గుగులోతు కిషన్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లంబాడి జేఏసీ మండల కమిటీ అధ్యక్షులుగా గుగులోతు కిషన్ నాయక్ లంబాడి మండల సలహాదారులు నాయకులు జాటోత్ బాలు నాయక్ ,బాధవత్ బాలకిషన్ ,జాటోత్ సదర్ లాల్ నాయక్ ఆధ్వర్యంలో కీర్య తండా గ్రామంలోని లంబాడి జేఏసీ నూతన కమిటీ ఎన్నుకున్నారు. కీర్యతండా గ్రామ లంబాడి జేఏసీ కమిటీ అధ్యక్షులుగా గుగులోతు కిషన్ నాయక్ ,ఉపాధ్యక్షులు బానోతు రాజు నాయక్ , కో కన్వీనర్ నునావత్ యాకుబ్ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి జేఏసీ ముఖ్య సలహాదారులు బాధవత్ హ్యాట్య నాయక్ , బానోతు రమేష్ నాయక్ ,బానోతు రఘు నాయక్ ,బోడ హర్ష నాయక్ , బోడ సురేష్ నాయక్ బానోతు బాబు నాయక్ ,నునావత్ కిషన్ నాయక్ , బాధవత్ భద్రు నాయక్, అజ్మీరా ఈర్య నాయక్ ,బాధవత్ రవి నాయక్ , బాధవత్ ఆలు నాయక్ ,బోడ రవి నాయక్ ,గుగులోతు యాకుబ్ నాయక్ ,స్వామి నాయక్ ,భద్రు నాయక్ , బాధవత్ భద్ర నాయక్ , అజ్మీరా రామ్య నాయక్ , రాజు నాయక్ తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న ఆదిలాబాద్ జిల్లా జడ్జి



**మహాదేవపూర్ నవంబర్ 9, (నినాదం):** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహాదే వపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆదిలాబాద్ జిల్లా జడ్జి ప్రభాకర్ రావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలేశ్వరం ఆలయం వద్ద ఆయనకు ఆలయ పూజారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం, శుభానంద్ దేవి ఆలయంలో అర్చన చేశారు. అనంతరం జడ్జి దంపతులకు స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి వేదమం త్రాల మధ్య మహదాశిర్వాదాన్ని అందించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## హైకోర్టు న్యాయవాదిగా గిరిజన యువకుడు



**డోర్నకల్/మరిపెడ నవంబర్9 (నినాదం) :** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం దంట్లకుంట తండా మారుమూల గ్రామపంచాయతీ నుండి తెలంగాణ గిరిజన గురుకుల న్యాయ కళాశాలలో లా పూర్తి చేసి నేడు తెలంగాణ హైకోర్టులో భూక్యా శ్రీనివాస్ నాయక్ న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు.సమాజ మార్పు కోసం,సమాజానికి న్యాయం, సేవా మరియు సమానత్వం అందించేందుకు దృఢమైన సంకల్పంతో పనిచేస్తానని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజన యువత నేడు పేదరికానీ జయించి ఉన్నతమైన చదువులు చదివి,భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. లా పూర్తి చేసుకుని పట్టా పొందడం, హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసినందుకు స్నేహితులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలియజేస్తుంటే ఆనందంగా ఉందని తెలిపారు.

### మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై
## ప్రజలకు అవగాహన

**రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి**



**కోదాడ/రూరల్ (నినాదం):** కోదాడ మండల పరిధిలో నల్లబండ గూడెం గ్రామంలో రామాపురం ఎక్స్ రోడ్ నందు రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఆదివారం ప్రజలకు సందేశాలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరమని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలని కోరారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రాచకొండ ప్రభాకర్ పాల్గొని గంజాయి డ్రగ్స్ కు బానిసలు కావడం వల్ల కలిగే అనర్థాలను విచిత్ర వేష ధారణ తో వివరించారు. ఈ సందర్భంగా నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అని నినాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మల్లయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం



**మిర్యాలగూడ నవంబర్ 9 (నినాదం ):** మిర్యాలగూడ మండలం, వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కూలీ కుటుంబం ఎల్లయ్య మార్థమ్మల కుమార్తె సబిత నీట్‌లో మంచి ర్యాంకు సాధించి సిద్దిపేట ఆర్విఎం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందడంతో, ఆమె ప్రభుత్వ పాఠశాలల నుంచి కష్టపడి చదివి సాధించిన విజయాన్ని అభినందిస్తూ గ్రామ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు నలభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. సబ్ ఇన్స్పెక్టర్ సైదులు గౌడ్, ఉపాధ్యాయులు వీరశేఖర్, జర్నలిస్టు ఆరిఫ్, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది, సామాజిక కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భవిష్యత్తులో కూడా విద్యా ప్రయాణంలో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సంఘ ప్రతినిధులు తెలిపారు.

## ఆటోను ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం

**ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు**



**డోర్నకల్/మరిపెడ నవంబర్9(నినాదం) :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని బురహానుపురం గ్రామ శివారులో జాతీయ రహదారి 365పై ఆదివారం సాయంత్రం జరిగినరోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా,మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు.అతివేగంగా వచ్చిన బైక్ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది.సూర్యాపేట జిల్లా అరవపల్లి మండలం ఇటిక్యాల పల్లి గ్రామానికి చెందిన శివరాత్రి చందు (25) మరియు ఖమ్మం జిల్లా సిరిపురం గ్రామానికి చెందిన రాము బురహానుపురం గ్రామంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమానికి చుట్టాల ఇంటికి వచ్చారు.సాయంత్రం ఇద్దరూ ద్విచక్ర వాహనంపై మరిపెడ మండల కేంద్రానికి బయలుదేరారు. ఈ క్రమంలో అతివేగంతో వస్తున్న బైక్ ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో శివరాత్రి చందు అక్కడికక్కడే మృతి చెందగా,రాము చేయి విరిగి తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయాడు.స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో గాయపడిన రామును మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.మరిపెడ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్**

**మహాదేవపూర్ నవంబర్9 (నినాదం):** ఈనెల 15న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఉందని కేసుల పరిష్కారానికి ఇదొక అవకాశం అని కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం ప్రజలకు ఒక సదవకాశమని రాజీమార్గమే రాజ మార్గంగా లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించబడతాయని సంబంధిత కేసుల పార్టీలు తమ కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

# అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి

రేవంత్ రెడ్డి అసత్య ప్రచారాలు, ఆరోపణలు మానుకోవాలి

కాంగ్రెస్ పార్టీ డర్టీ పాలిటిక్స్ చేస్తుంది

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పదకొండున్నర లక్షల కోట్లకు పైగా నిధులు ఇచ్చింది

బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ ప్రతినిధి, నవంబర్ 9.( నినాదం)** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్న బీజేపీ నాయకులకు సహకరించిన మీడియా మిత్రులకు రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావ్, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే లు పాయల్ శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీష్, పైడి రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ లు మల్క కొమురయ్య, అంజిరెడ్డితో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు భూటకపు, అలవికాని హామీలు ఇచ్చి దొడ్డి దారిలో అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. బీజేపీ నాయకులపై అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని, అందులో భాగంగానే ఇప్పటివరకు 11.50 లక్షల కోట్ల రూపాయలు రాష్ట్రానికి కేటాయించిందని అన్నారు. గత 70 ఏళ్లలో ఏ ముఖ్యమంత్రి కూడా అధికారంలో ఉండగా ఒక ఉపఎన్నికల్లో ఇలా ప్రచారం చేయలేదని, కేవలం ముఖ్యమంత్రి సీటు కాపాడుకోవడానికే తప్ప ప్రజలకు మంచి చేద్దామన్న ఉద్దేశం రేవంత్ రెడ్డి కి లేదని ఎద్దేవా చేశారు.

**హామీల ఎగవేతల ప్రభుత్వం... కాంగ్రెస్ ప్రభుత్వం**

ఎన్నికల్లో గెలవడానికి మీరు ఇచ్చిన హామీలు ఒక్కసారి గుర్తుచేసుకోండి అని, మీరు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఏమైంది...? మహిళకు 2500 రూ.ల హామీ ఏమైంది? వృద్ధులకు ఇస్తామన్న 4000/- రూ.ల హామీ ఏమైంది? విద్యార్థులకు ఇస్తామన్న స్కూటీ హామీ ఏమైంది...?? పెళ్లి అయిన ఆడబిడ్డలకు లక్ష రూపాయలతో పాటు ఇస్తామన్న తులం బంగారం హామీ ఏమైంది?? రైతులకు రైతు బంధు ఎగవేశారు, విద్యార్థులకు ఫీ రీయింబర్స్మెంట్ చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారు. విద్యా సంస్థలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఇలా ఒకటా రెండా అలవికాని 420 బూటకపు హామీలు చెప్పి, ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. గత పాలనలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని నాడు చెప్పిన రేవంత్ రెడ్డికి ఏ ఒక్కరిపై కేసు పెట్టక పోవడం, విచారణకు ఆదేశించక పోవడం వెనక ఉన్న మతలబు ఏంటో చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రం లక్షల కోట్ల అప్పుల్లో మునిపోయిందని మేం ప్రభుత్వం లోకి రాగానే గాడిలో పెడతామని అబద్ధపు మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, మీ కాంగ్రెస్ ప్రభుత్వ 23 నెలల పాలనలో ఇప్పటివరకు దాదాపు 2,44,000/- కోట్ల రూపాయలు అప్పు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి మోసం చేశారని, ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న సర్పంచ్ ల బిల్లులు కూడా చెల్లించకుండా దుర్మార్గపు పాలన రేవంత్ రెడ్డి చేస్తున్నారని అన్నారు. కొందరు సర్పంచ్ లు ఆత్మ హత్యలు సైతం చేసుకున్నారని గుర్తుచేశారు.

## కమిషనర్ గారు 8వ వార్డులో డ్రైనేజీ సమస్యను తీర్చండి



-మురికి నీటితో ఉండలేక పోతున్నాం

-శాశ్వత పరిష్కారం చూపాలని వార్డు ప్రజల ఆవేదన

**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధి లోని 8వ వార్డులో మురికి నీరు రోడ్డుపై వచ్చి చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నామని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ను కోరుతున్నారు ప్రజలు. గతంలో కూడా ఈ సమస్యను నినాదంలో వచ్చిన కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు తాత్కాలిక పరిష్కారం చేశారని అయినప్పటికీ సమస్య అలాగే ఉంటుందని ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ ప్రజల సమస్యను పరిష్కరించి ఊరికే నీటి బాధ లేకుండా చేయాలని వారు వేడుకుంటున్నారు. ఒకవైపు మురుకు నీరుతో దుర్గంధం వెదజల్లుతుందని మరోవైపు దోమల బాధతో ఇక్కడ ప్రజలు ఉండలేని పరిస్థితి కనబడుతుందని వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. గతంలో పలకవర్గానికి ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కరించలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి మా అవస్థను అర్థం చేసుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుకుంటున్నారు.

## భూలక్ష్మి-మహాలక్ష్మి బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన



**గోదావరిఖని నవంబర్ 09 (నినాదం):** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామంలో భూలక్ష్మి- మహా లక్ష్మి బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దాతలు గాదె స్రవంతి-సుధాకర్ దంప తులు సర్వహారకులుగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, "ఈ మహోత్సవంలో పాల్గొనే అవకాశం లభించడం నా భాగ్యంగా భావిస్తున్నాను. మన గ్రామ దేవతలు కేవలం భక్తి ప్రతీకలు మాత్రమే కాదు, మన సంస్కృతికి ప్రాణం, గ్రామాల ఆత్మగా నిలుస్తారు" అని పేర్కొన్నారు. అలాగే, "ప్రతి ఇంటిలో శాంతి, సౌభాగ్యం, సుభిక్షం నెలకొనాలని, ఆకెనపల్లి గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని భూలక్ష్మి అమ్మ ఆశీర్వదించమని ప్రార్థించాను" అని అన్నారు. మక్కాన్ సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో "భక్తి, సేవ, సామాజిక బాధ్యతలే మా సమితి యొక్క నిజమైన బలం. ప్రజల శ్రేయస్సు కోసం ప్రతి కార్యక్రమం వెనుక మేము కృషి చేస్తాం" అని మనాలి ఠాకూర్ తెలిపారు. ఈ వేడుకలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అఖండ - 2 ఘన విజయం సాధించాలి

- రాజన్న క్షేత్రంలో సినీ నటుల మొక్కులు



**వేములవాడ, నవంబర్ 09(నినాదం) :** ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న అఖండ 2 సినిమా ఘన విజయం సాధించాలని వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో సినీ నటులు మొక్కులు చెల్లించు కున్నారు. పవిత్ర కార్తీక మాసం సందర్భంగా వెండి తెర హాస్య నటులు, క్యారెక్టర్ ఆర్టిస్ట్ రచ్చ రవి కుటుంబ సమేతంగా విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారాల దేవయ్య వారిని సన్మానించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. వారి వెంట తెలంగాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్టు యూనియన్ జాయింట్ సెక్రటరీ కె రామ్ మోహన్ ఉన్నారు.

## బాలగ్రహాల నిర్మూలనకై అవగాహన సదస్సు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**నిర్మల్ ప్రతినిధి ,నవంబర్ 9. ( నినాదం):** జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనపై సోమవారం నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభించబోతున్నట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిడిఎస్ అధికారులు బృందాలుగా ఏర్పడి, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో బాల్య వివాహాల అనర్థాలు, నిర్మూలన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 14వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. అదేవిధంగా 18 వ తేదీన గ్రామాలలో ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తారని వివరించారు. 20వ తేదీ నుంచి డివిజన్ల వారీగా, వివాహ ఆహ్వాన పత్రికల ప్రింటింగ్ ప్రెస్, డీజే యజమానులు, పూజారులు, పాస్టర్లు, ఖాజీలతో సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. డిసెంబర్ ఒకటవ తేదీ వరకు వివి ధ కార్యక్రమాల రూపేనా జిల్లా ప్రజల్లో బాల్యవివా హాల నిర్మూలలపై అవగాహన కార్యక్రమాలు నిర్వ హించి, సంపూర్ణంగా బాల్యవివాహాలను అరికట్టేలా చర్యలు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలి

**భీమదేవరపల్లి నవంబర్ 9 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండలో ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి గత ఐదు రోజులుగా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ భూపతి శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం రోజు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల శ్రమతో కూడిన బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. అలా కలిగి ఉన్నప్పుడే జీవితంలో లక్ష్యాలను అధిగమిస్తామని అన్నారు.

150 మంది వాలంటీర్ల తో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన కొరకు ర్యాలీ నిర్వహించారు.

## సహ చట్టం సాధన కమిటీ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



**జమ్మికుంట, నవంబర్ 9 (నినాదం):** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా జమ్మికుంట గాంధీ చౌరస్తాలో హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు చెరుకు పైడయ్య, ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్,రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి,జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం ఆదేశాల మేరకు ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శక పాలన కోసం కమిటీ నిరంతరం కృషి చేసిందన్నారు. అవినీతి, లంచగొండితనం నిర్మూలించేందుకు పోరాడుతున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారం చూపే సదుద్దేశంతో పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమా శంకర్, హుజురాబాద్ మండల అధ్యక్షుడు పల్లె సతీష్, కార్యదర్శి రేగళ్ల వినయ్ చందర్, జమ్మికుంట అధ్యక్షుడు నేదురు కుమారస్వామి,ఉపాధ్యక్షులు గోవింద సతీష్, ప్రధాన కార్యదర్శి అక్క పెల్లి నవీన్ కుమార్, దాట్ల దుర్గాప్రసాద్,ఎండి ముస్తఫా, ఇల్లందకుంట అధ్యక్షుడు ఏరుకొండ శ్రీనివాస్, వీణవంక అధ్యక్షుడు తిప్పని సమ్మయ్య, పర్లపల్లి సురేష్, ఆవుల రమేష్, కరుణాకర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

## టిప్పర్ లారీ బైక్ ఢీకొని ఒకరి మృతి



**భీమదేవరపల్లి నవంబర్ 9 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ శివారులోని ఎల్కతుర్తి సిద్దిపేట ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు టిప్పర్ లారీ బైక్ను ఢీకొట్టడంతో బైక్పై వెళ్తున్న మంగళపల్లి గ్రామానికి చెంది బసిరెడ్డి శ్రీనివాస్(48) అనే వ్యక్తి మృతిచెందాడు. అతను తన మనుమడు, మరోక చిన్నారిని తీసుకొని ముల్కనూర్ వైపు వెళ్తున్నాడు. తమవైపు టిప్పర్ లారీ దూసుకొస్తుండని గమనించి ఇద్దరు చిన్నారులను పక్కకు తోసాడు. శ్రీనివాస్ తప్పించుకునే అవకాశం లేకపోవడంతో లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారులు చిన్నచిన్న గాయాలతో బయటపడగా శ్రీనివాస్ మాత్రం తలపగిలి మెదడు బయటకు రావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎసిపి ప్రశాంత్ రెడ్డి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కేసు నమోదు చేసుకున్న ముల్కనూర్ పోలీసులు మృతదేహాన్ని హుజురాబాద్ మార్చురీకి తరలించారు.

## విప్లవ యోధుడు చంద్ర పుల్లారెడ్డి



**నూతనకల్ నవంబర్ 9 (నినాదం):** భారత విప్లవోద్యమానికి కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి చుక్కని అని ఆదివారం 41వ వర్ధంతిని చిల్పకుంట్ల గ్రామంలో అమరుల స్థూపం ముందు దగ్గుల మల్లయ్య జెండా ఆవిష్కరించి భూపాల్ రెడ్డి మాట్లాడారు...ఇంజనీరింగ్ విద్యను మధ్యలో నే వదిలేసి అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం తపించిన విప్లవ సిద్ధాంతకర్త చంద్ర పుల్లారెడ్డి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, వెంకటరెడ్డి, లింగయ్య, రమేష్,పరమేష్,సోమయ్య,రాములు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 4వ టౌన్ ఎస్ హెచ్ఓగా సతీష్



**నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం) :** నగరంలోని 4వ టౌన్ ఎస్ హెచ్ ఓ గా సతీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల నిజామాబాద్ రూరల్, 4వ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా అప్ గ్రేడ్ చేస్తూ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా సతీష్ ను 4వ టౌన్ ఎస్ హెచ్ ఓగా, నిజామాబాద్ రూరల్ కు శ్రీనివాస్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ హెచ్ ఓ సతీష్ గతంలో నిజామాబాద్ నార్త్ సిఐ గా, డిసిఆర్ బి లో పని చేశారు.

## జాతీయస్థాయి పోటీలకు ఏకెవిఆర్ కళాశాల విద్యార్థి



**భీమదేవరపల్లి నవంబర్ 9 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమ దేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో గల ఏ కె.వి.ఆర్ జూనియర్ కళా శాల విద్యార్థి మాడుగుల ఆదిత్య జాతీయస్థాయి పో టీలకు ఎంపికైనట్లు కళాశా ల ప్రిన్సిపల్ భూపతి శ్రీ కాంత్ తెలిపారు. ఇటీవల హైదరాబాదులోని జింకన గ్రౌండ్లో ఎస్ జి ఎఫ్ ఐ రాష్ట్రస్థాయి పోటీలు జరగగా, ఈ పోటీలలో 400 మీటర్ల హడిల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సుదర్శన్ రెడ్డి ప్రిన్సిపల్ శ్రీకాంత్ అధ్యాపకులు మాడుగుల ఆదిత్యాను సన్మానించారు.

## సుచిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సందర్శించిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి



**కీసర, నవంబర్ 09, (నినాదం) :** కీసర మండలం, నాగారం మున్సిపల్ పరిధి సుచిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యుల పిలుపుమేం కు కాలనీని సంద ర్శించిన నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి టీజేఎస్ పార్టీ అధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ రెడ్డి, ఈ సందర్భంగా కాలనీలో ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలు ముప్పు శ్రీనివాస్ రెడ్డికి కాలనీ వాసులు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చుక్కల నాగరాజు, జనరల్ సెక్రెటరీ గోకురాజుకుమార్, లక్ష్మణ్, రఘుపతి రెడ్డి, సుందర్ సాహూ, రామాప్రసాద్, హరి నారాయణ రెడ్డి, నరేష్, ఆంజనేయులు, మాదిరెడ్డి రాజిరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్



**భీమదేవరపల్లి నవంబర్ 9 (నినాదం)** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రోజు భీమదేవర పల్లి ఎస్సీ బాయ్స్ హాస్టల్ ను నాయకులతో కలిసి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్ విద్యార్థులను కలిసి వారితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. హాస్టల్లో విద్యార్థులకు చలికాలం మొదలైన ప్రభుత్వం నుండి దుప్పట్లు గాని రోజువారీగా ఉదయాన్నే వేడి నీళ్లతో స్నానం చేయడానికి గ్రీజర్లు గాని లేవని విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూ సరిగా అమలు చేస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా హాస్టల్లో ఆట వస్తువులు లేవని తెలిపారు హాస్టల్ కి సంబంధించి ప్రత్యేకంగా నైట్ వాచ్మెన్ లేకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాత్రి వేళల్లో భయం వేస్తుందని ఏమైనా అత్యవసరం ఏర్పడితే ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ నిద్రిస్తున్నారని తెలిపారు గత వారం రోజుల క్రితం హాస్టల్లో ఎనిమిదో తరగతి విద్యార్థి మరియు పదవ తరగతి విద్యార్థుల మధ్యన ఇబ్బందులు జరిగిన సంఘటనలు ఏర్పడం వల్ల విద్యార్థులను హాస్టల్ వార్డెన్ ఇంటికి పంపించాడని కనీసం వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వకుండా విద్యార్థులను ఇంటికి పంపడం వలన చదువుకు దూరమవుతారని మరియు మానసికంగా ఇబ్బందులకు గురి అవుతారనిదీనిపై అధికారులు స్పందించి విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు అలాగే ఒక రెగ్యులర్ వాచ్మెన్ నియమించాలని, సంబంధిత జిల్లా అధికారులు వెంటనే స్పందించి సౌకర్యాలు మెరుగుపరిచే విధంగా కృషి చేయాలని తెలిపారు లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు విష్ణు శివ కోటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ఉద్యోగులకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ జారీ చేయాలి

-బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్



**మిర్యాలగూడ నవంబర్ 9 (నినాదం):** గ్రూప్3, గ్రూప్ 4 ఉద్యోగులు, ఉపాధ్యాయులు క్రిమిలేయర్ పరిధి లోకి రారని వారికి నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ జారీ చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపోలు పరమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మిర్యాలగూడ లో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేకమంది ఉద్యోగులు ఉపాధ్యాయులు వివిధ మండలాల్లో తహసిల్దార్ కార్యాలయంలో నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసుకుంటే జారీ విషయంలో మీరు అనర్హులని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. నాన్ క్రిమిలేర్ సర్టిఫికెట్ జారీ విషయంలో తెలంగాణ ప్రభుత్వం సర్కులర్ నెంబర్ ఇ/424/2014 . ది.28.07.2014., జి. ఓ.ఎం. ఎస్.నెంబర్.20. ది.31.10.2017 లో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. డైరెక్ట్ గ్రూప్ వన్, డైరెక్ట్ గ్రూప్ టు సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల వేతనం ఎనిమిది లక్షలు పరిమితి మించినప్పుడు నాన్ క్రిమినల్ సర్టిఫికెట్ కు అనర్హులన్నారు. గతంలో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ ను సంప్రదించినప్పుడు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అన్ని కార్యాలయాలకు మార్గదర్శకాలు పంపడం జరిగిందన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం శోచనీయమన్నారు. ఉద్యోగులకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెటు జారీ చేయని తాసిల్దారులపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తి వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు సలహాలు సూచనల కోసం బీసీ ఉద్యోగుల సంఘాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, బిసి ఉద్యోగుల సంఘం నాయకులు శిరం దాస్ రామ్ దాస్, అంబటి శ్రీనివాస్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి వేడుకలు

**ఖానాపురం నవంబర్ 9 (నినాదం) :** భారత విప్లవ నిర్మాత అమరుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వ వర్ధంతి సందర్భంగా ఖానాపురం మండలం బుధరావుపేటలో నర్సంపేట డివిజన్ కమిటీ కార్యదర్శి షేర్ మధు అధ్యక్షతన చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. భూమి భుక్తి దేశ విముక్తి కోసం పోరాడిన చంద్ర పుల్లారెడ్డికి అరుణారుణ విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ వరంగల్, భూపాలపల్లి, ములుగు, జిల్లా ఉమ్మడి కార్యదర్శి కోడి సోమన్న మాట్లాడుతూ అనేకమంది కమ్యూనిస్టు విప్లవకారులు భూమి భక్తి విభక్తి నిరుద్యోగ సమస్య కోసం తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా ప్రాయంగా అర్పించారన్నారు. అందులో భరతమాత వీర పుత్రుడైన విప్లవకారుడు చంద్ర పుల్లారెడ్డిని కోల్పోయిందన్నారు. చంద్ర పుల్లారెడ్డి 1967 లో రివిజనిస్టులతో తెగదెంపులు తర్వాత దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవ పార్టీని స్థాపించడం జరిగిందని తెలిపారు. వారి మార్గదర్శకంలో గోదావరి లోయ రైతాంగ పోరాటం ఉధృతంగా సాగిందన్నారు, అనంతరం జరిగిన పరిణామాలలో సీపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీగా పార్టీ అవతరించిందని తెలిపారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి తన జీవితం యావత్తు ప్రజలకోసం, భూమి, భుక్తి, దేశ విముక్తి, కోసం అర్పించారని గుర్తు చేశారు. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విప్లవ కమ్యూనిస్టు పార్టీ పేరుతో కామ్రేడ్స్ పిట్టల రామనర్సయ్య, రాయల సుభాష్ చంద్రబోస్ తదితరులతో కలిసి ప్రతిఘటన సాయుధ దళాలను ఏర్పరిచి భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం ప్రజల హక్కుల కోసం పోరాడాడన్నారు. అనంతరం పరిణామ క్రమంలో పుల్లారెడ్డి స్థాపించిన సైదాంతికరించిన పార్టీ కామ్రేడ్ పుల్లారెడ్డి నాయకత్వంలో భారతదేశంలో వివిధ ఎం ఎల్ పార్టీలు ,గ్రూపులు కామ్రేడ్ సత్యనారాయణ సింగ్ లాంటి వారితో కలిసి సీపిఐ (ఎంఎల్ ) గా అవతరించిందన్నారు.

## బిఆర్ఎస్-కాంగ్రెస్ అభ్యర్థుల కోసం జిల్లా నాయకుల ప్రచారం



**వికారాబాద్, నవంబర్ 9(నినాదం):** హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ జిల్లా ఉభయ పార్టీల నాయకులు ఆదివారం చివరి రోజు ఎ న్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటి ప్రచారం నిర్వహించి తమ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు ఎవరికీ వారే విజయం పై ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తదితరులు, బి ఆర్ ఎస్ నాయకులు దయాకర్ రెడ్డి, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పు తీర్చలేక మరణించిన పత్తి రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి



**మునుగోడు నవంబర్ 9 (నినాదం) :** మునుగోడు నియోజకవర్గ, యాదాద్రి భువనగిరి జిల్లా. చౌటుప్పల్ మండలం, అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన, పత్తి రైతు ఇటికాల ఉపేందర్ రెడ్డి ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల సాగు చేసిన పత్తి పంట పాడైపోవడంతో అప్పు తీర్చే మార్గం లేక మానసికంగా కృంగిపోయి మనస్థాపానికి గురై బలవన్మరణం చందడం జరిగింది. అట్టి విషయం తెలుసుకొని వారి మరణం పట్ల చింతిస్తూ... వారి కుటుంబాన్ని పరామర్శించి నేనున్నానని భరోసా కల్పించి వారికి ఆర్థిక సాయంగా 1,00000/- లక్ష రూపాయలు ప్రకటించి పిల్లల చదువులకు సహకరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి.



# యాజమాన్యపు హక్కులు లేని ఆస్తిని ఎలా అమ్ముతావు.?

## 1975 వరకు కిబాల తెరపైకి రాలేదు..!

## 100 కోట్ల కబ్జాపై జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 9 (నినాదం):** జగిత్యాల జిల్లా కేంద్రం ప్రధాన కూడలిలో 100 కోట్ల ఆస్తి కబ్జాపై మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. 70 సంవత్సరాల నుంచి ఓనర్ షిప్ పత్రాలు దాఖలు చేయకుండా కోర్టులను ప్రజలను మోసం చేస్తూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఇంద్ర నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ప్రజా ప్రతినిధులు ప్రజా ఆస్తులను కాపడటం బాధ్యతగా భావించాలన్నారు నా ప్రజా జీవితంలో నా బాధ్యత నిర్వాహణలో భవిష్యత్‌కు ఉపయోగపడేలా ఎస్సారెస్పీ ధరూర్ క్యాంపు ఆస్తులను పరిరక్షించాను అన్నారు..దేవాదాయ ఆస్తులను సైతం కాపాడానన్నారు. మున్సిపల్ ఆస్తులను ప్రభుత్వ ఆస్తులను భావించి కాపడటం బాధ్యతగా భావిస్తున్నా మన్నారు.. 1952 లో జగిత్యాల పట్టణంలో పెట్రోలు, డిజిల్, కిరోసిన్ కోసం ఔట్‌లెట్ ఏర్పాటు కోసం 20 గుంటల స్థలం వివాదంపై కిబాలపై జరిగిందని డ్యాక్యుమెంట్ తెరపైకి వచ్చిందన్నారు. దీనిపై అనేక అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. దారం వీర మల్లయ్యకు స్థలం వినియోగం కోసం ఇచ్చారన్నారు.. 1964 స్థల వివాదం తలెత్తింది. అప్పుడు వారు ఓనర్‌షిప్ దాఖలు చేయలేదన్నారు 1975 వరకు కిబాల పత్రం తెరమీదకు రాలేదు ఆ తర్వాత జిరాక్స్ పత్రం తెచ్చారన్నారు. కిబాల ద్వారా జరిగిందని డ్యాక్యుమెంట్ తెరకెక్కించారు.. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. దార వీరమల్లయ్య ఉన్నాన్ని రోజులు కిబాల ఎందుకు తెరమీదకు రాలేదన్నారు. ఆయన చనిపోయిన తర్వాత మాత్రమే కిబాల పత్రం వచ్చిం



దంటే అనుమానాలకు తావిస్తుందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా యాజమాన్య హక్కులపై ఏ కోర్టులోనూ ప్రయత్నం చేయలేదన్నారు. డివిజన్ బెంచ్ జడ్జిమెంట్‌లో చట్టపరంగా చర్యలు తీసుకునే వరకు కొనసాగించవచ్చని తీర్పుచెప్పారన్నారు 1975 తర్వాత వారసులు కిబాల తెరమీదకు తెచ్చారు..ఎక్కడా కూడా ఓనర్ షిప్‌పై ప్రయత్నాలు చేయలేదు. జిరాక్స్‌పై అభిప్రాయం వ్యక్తం చేయటం సాధ్యం కాదని హైకోర్టు వెల్లడించిందిన్నారు మంచాల కృష్ణ ఒరిజనల్ కిబాలను హైకోర్టుకు, డివిజన్ బెంచ్‌కు దాఖలు చేయలేదన్నారు కేసు గెలువాలంటే ఓరిజనల్ డ్యాక్యుమెంట్ దాఖలు చేయాలి. ఎందుకు చేయలేదు. హైదరాబాద్ లాగా హైడ్రా ఉంటే ఇప్పటికే కూల్చేవారు..వేములవాడలో కోర్టు ఇంజక్షన్ ఉన్నా కొట్టెశారు..కరీంనగర్‌లోనూ స్మితా సబర్వాల్ తొలగించరన్నారు యాజమాన్యపు హక్కులు లేని ఆస్తిని ఇతరులకు ఎలా అమ్ముతావుఅన్నారు అమాయకులకు యాజమాన్యపు హక్కు లేకుండానే కొంత ఆస్తిని అమ్మారన్నారు దారం వీరమల్లయ్యకు ఇవ్వబడింది.. ఇది వారసత్వపు ఆస్తి కాదన్నారు. సీఎం రెవంత్‌రెడ్డి హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ఆస్తులను చేజిక్కించికుందన్నారు. -రూ.100 కోట్ల ఆస్తిని చేజిక్కించుకోవాలన్నారు.

వీరమల్లయ్య ఉన్నన్ని రోజులు కిబాల తెరమీదికి రాలేదని వాస్తవం కాదాఅని ప్రశ్నించారు1952లో ఇస్తే కిబాలలో 1958లో రాశారన్నారు. మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారు.. అందరిపై చర్యలు తీసుకోవాలన్నారు. అండదండలు ఉన్నాయని బెదిరిస్తున్నాడన్నారు. మంచాల కృష్ణ దగ్గరకు రాత్రి పూట పోలేదు.. ఆర్యావైశ్య సంఘం మద్దతు కోసం ఆయన వద్దకు వెళ్లానన్నారు అందుకు ముందు ఆయన పై రెండు సార్లు ఫిర్యాదు చేశానన్నారు జనరేటర్ ప్రమాదకరంగా ఉందని ఫిర్యాదు చేశానన్నారు. జీవన్‌రెడ్డి మంచాల కృష్ణ ఇంటికి వెళ్లాడని పేర్కొనటం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వారి తాతలు కొనుక్కున్నారని సర్టిఫికెట్ ఎలా ఇస్తారన్నారు మీరు డాక్యుమెంట్ చూశారా ఏ పర్పస్ కి ఇచ్చారు ఏంటి మీరు కలెక్టర్ గారు విచారణ కమిటీ వేశారు విచారణ కమిటీ విచారణ చేస్తుందన్నారు ఒక ఎమ్మెల్యే గారు 70 సంవత్సరాల క్రితం వాళ్ల తాతలు ముత్తాతలు కొన్నారని చెప్పడం అనేది విచారణ కమిటీని ప్రభావితం చేస్తుందా చేయదా మీరు విజన కమిటీని ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు ఇదేనా ఒక ఎమ్మెల్యే బాధ్యత మీరే సర్టిఫికెట్ ఇస్తే ఇంకేముందన్నారు. విచారణ కమిటీని ప్రభావితం చేయాలనే ఒక ఆలోచన తోని అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం మున్సిపల్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారు అని ప్రశ్నించారు. సత్యవంతునివి కిబాల ఒరిజనల్‌ను ఎందుకు సమర్పించలేదన్నారు. ఎమ్మెల్యే ఇప్పటికైన వాస్తవాలు పరిశీలించాలన్నారు జడ్జిమెంట్ కాఫీ, కిబాల కాపిని తెప్పించుకుని ఎమ్మెల్యే పరిశీలించాలి. ఇది 100% మున్సిపల్ రెజ్యూమ్ చేసుకోవాలి చేసుకుంటదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెరవేరనున్న వైశ్యుల చిరకాల వాంఛ

### ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కూనంనేని

### ఆర్యవైశ్య జిల్లా కార్యాలయం భవన నిర్మాణానికి రూ.24లక్షలు మంజూరు

### హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు దారా రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్9(నినాదం):** ఎన్నో ఏండ్లుగా జిల్లాలో ఉన్న ఆర్యవైశ్యులు ఎదురు చూసిన సంఘం జిల్లా కార్యాలయం శాశ్వత భవన నిర్మాణ కల త్వరలోనే నెరవేర నున్నది. కొత్తగూడెం నియోజక వర్గ శాసన సభ్యులు కూనం నేని



సాంబశివరావు గెలిచిన అనంతరం వైశ్యులకు సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన హామీ ఇచ్చినట్టుగానే అతి తక్కువ సమయంలోనే వైశ్యుల కోరిక తీర్చారు ఎమ్మెల్యే కూనంనేని. జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యాలయం శాశ్వత భవన నిర్మాణానికి రూ. 24లక్షల నిధులు మంజూరు చేసి తన నిబద్ధతను చాటుకున్నారు. పాల్వంచలో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన వనభోజనాల కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు దారా రమేష్, గౌరవ అధ్యక్షులు పెండ్యాల విజయ భాస్కర్, ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, పొలిటికల్ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ వ్యాపార రంగంలో అడుగు పెడుతున్నారని, కాబట్టి వైశ్యులు కూడా మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యాపార రంగంలో కొత్త ఆవిష్కరణలు చేపట్టాలని తెలిపారు. వైశ్యుల కోరిక మేరకు జిల్లా కార్యాలయం శాశ్వత భవన నిర్మాణానికి రూ.24లక్షలు తన సొంత నిధుల నుండి మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. కాగా జిల్లా కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు దారా రమేష్ హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే జిల్లా కార్యాలయం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తామని పేర్కొన్నారు. కాగా జిల్లా కార్యాలయం భవన నిర్మాణానికి తన తండ్రి పేరు మీద 400 గజాల స్థలం విరాళంగా ఇచ్చిన పొలిటికల్ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు కార్యక్రమానికి విచ్చేసిన ప్రతిఒక్కరూ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ, కొత్తగూడెం, ములకలపల్లి, చంద్రుగొండ తదితర ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# కల్లులో పురుగు కలకలం

**వికారాబాద్, నవంబర్ 8(నినాదం):** తెలంగాణ ప్రాంతంలో స్వచ్ఛమై కల్లు సేవనం సాంప్రదాయ పానీయం. అయితే నేడు అది పూర్తిగా కాలకూట విషంగా మారింది. ఈ విషయాన్ని ఆసరాగా తీసుకుని లారీల కొద్ది కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తున్న విధానం కొనసాగుతున్నది. డిపోలో తయారవుతున్న కల్లులో మృతి చెందిన బల్లిని పోలిన పురుగు వచ్చిన విషయం ఆదివారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. కల్తీ కల్లు తాగి నగరంలో పలువురు మృత్యు వాత పడగా కొందరు మృతి చెందిన విషయం విధితమే. ఇదేవిధంగా కొన్ని సంవత్సరాల క్రితం నవాబుపేట మండలంలో కూడచోటు చేసుకుంది. అయినా చర్యలు లేవు ఏదావిధిగా కల్తీ కల్లు జిల్లా వ్యాప్తంగా ఎరులై



పారుతోంది. ప్రస్తుతం కల్లు వ్యాపారం కార్పొరేట్ వ్యాపారమైయింది. కాంట్రాకర్లు గీతా కార్మికులను బెదిరించి లైసెన్స్ లను లీజుకు తీసుకుని లారీల కొద్ది కల్తీ కల్లును సారాఫరా చేస్తున్న తీరు కొనసాగుతున్నది. ఈ కల్లుకు బానిసలైన వారు నిత్యం కల్లు తాగానిదే రోజు గడవని దుస్థితికి తీసుకువచ్చారు. రెండు రోజులు కల్లు తాగకపోతే వారు మానసికంగా బలహీన పడి మతి బ్రమించి పిచ్చి వాళ్లుగా మారుతు న్నారు. కొందరు తీర్థ యాత్రలకు వెళ్ళి కల్లు దొరకక పిచ్చిగా మారి ఇప్పటి వరకు తిరిగి రాని వారు ఉన్నారని ఆయా మండలాల వారు చెబుతున్నారు. రోగం వచ్చాక వైద్యం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న తరుణంలో రోగాల భారీన పడేసే ఇలాంటి విషయాలను పట్టించుకోవడం లేదనేది పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వమే తేలాచ్చి ల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

## ఘనంగా మల్లన్న కళ్యాణోత్సవం



**అల్వాల్, నవంబర్ 9 (నినాదం):** మచ్చ బొల్లారం ఎంజి నగర్ లో మోహన్ యాదవ్ గృహంలో జరిగిన మల్లన్న కళ్యాణంలో పాల్గొన్న జితేంద్రనాథ్, సురేందర్ రెడ్డి, సర్వేశ్ యాదవ్, వెంకటేష్ గౌడ్, ఆనందరావు, తదితరులు.

NINADAM CINEMA





### వినోదంతో పాటు

## విజ్ఞానం కూడా మా సినిమాలో దొరుకుతుంది : రాజ్ నరేంద్ర

తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరించిన అరుదైన సినిమా 'కలివి వనం'. ఇందులో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. హీరోయిన్‌గా నాగదుర్గ పరిచయమవుతోంది. 'కలివి వనం' సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 21న విడుదల కాబోతుంది. ఈనేపథ్యంలో..తాజాగా, మూవీ మేకర్స్ ట్రైలర్ లాంచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. దర్శకుడు రాజ్ నరేంద్ర మాట్లాడుతూ .. ఈ రోజుల్లో ఒక చిన్న సినిమాకి ఒక గెస్ట్‌ని తీసుకురావడం చాలా కష్టం. గెస్టుల కోసం మేము చాలా రోజులు ట్రై చేశాం. వస్తామన్నారు, రాలేదు. ఒక మంచి సినిమాను ఆదరించడానికి ఈ ఫీల్డ్‌లో ఒక గెస్ట్ కూడా రాలేకపోతున్నారు. ఈరోజు మాకు అండగా ఉన్నది మీడియా మిత్రులు మాత్రమే. వాళ్లే మా బలం, మా బలగం, వాళ్లే మా చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్తారని చెప్పి మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రతి తల్లిదండ్రులను నేను కోరుకునేది ఒక్కటే, ఈ చిత్రాన్ని మీ పిల్లలకు చూయించండి.

ఎందుకు చూయించాలంటే ఇది వాళ్ళ జీవిత శైలిలో ఒక పాఠ్య భాగం లాగా, ఒక పెద్ద భాల శిక్షలో ఒక పేజీ లాగా ఈ సినిమా వాళ్ళ మైండ్‌లో ఉండిపోతుంది. ఇది పిల్లలకు వినోదంతో పాటు విజ్ఞానం కూడా ఈ సినిమాలో దొరుకుతుంది. ఈ నవంబర్ 21 న ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ 'కలివి వనం' ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చెప్పారు.

## మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి మరో హీరో..

### సినిమా పోస్టర్ రిలీజ్!

సూపర్ స్టార్ కుటుంబం నుంచి ఇప్పటికే చాలా మంది సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన విషయం తెలిసిందే. సూపర్ స్టార్ కృష్ణ సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన కొంత కాలంలోనే మంచి పేరు సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి చాలా మంది సినీ ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. ఈ తరుణంలో సూపర్ స్టార్ కుమారుడు మహేష్ బాబు కూడా ఇండస్ట్రీకి పరిచయమై.. కొద్ది కాలంలోనే తండ్రికి



తగ్గ తనయుడు అనిపించారు. ఇకపోతే.. సూపర్ స్టార్ మహేష్ బాబు తనయుడు గౌతమ్ ఎప్పుడు హీరోగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తారో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి మరో వారసుడు టాలీవుడ్‌కు పరియమవుతున్నారు. మహేష్ దివంగత సోదరుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ వెండి తెరపైకి రానున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో తిరుపతిలో జరిగే ఒక ప్రేమ కథ నేపథ్యంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను తాజాగా విడుదల చేశారు. అయితే.. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు కొడుకు వరస అయ్యే జయ కృష్ణ హీరోగా ఎలా మెప్పిస్తాడో చూడాలి.

## లోకేష్ కనగరాజ్ సినిమాలోకి..

# మరో యంగ్ బ్యూటీ..

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రస్తుతం డైరెక్షన్‌కు బ్రేక్ ఇచ్చి.. హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలతో పాటు షూటింగ్ కూడా మొదలవగా.. తాజాగా ఈ సినిమాలో మరో బ్యూటీ జాయిన్ అయినట్లు తెలుస్తుంది. 'D C' టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో లోకేష్ కనగరాజ్ దేవదాసుగా కనిపించనుండగా.. ఆయనకు జోడీగా చంద్ర పాత్రలో బాలీవుడ్ బ్యూటీ వామిక గబ్బి నటించనుంది. అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నుంచి రీసెంట్‌గా టీజర్ రిలీజ్ చేయగా.. ముఖమంతా రక్తంతో కనిపించి ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేశాడు లోకేష్. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో మరో బ్యూటీ సంజన జాయిన్



అయినట్లు టాక్. 'లబ్బర్ పందు, థగ్ లైఫ్' వంటి సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు D C మూవీలో నటించబోతున్నట్లు కోలీవుడ్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. బడా నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నా ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తుండగా.. డిసెంబర్ చివరి నాటికి లేదా వచ్చే ఏడాది జనవరి నాటికి మొత్తం షూటింగ్ పూర్తి చేయాలని బృందం యోచిస్తోందని తెలుస్తుంది.

# ఓటీటీలోకి రొమాంటిక్ మూవీ..

### ఇద్దరు హీరోయిన్లతో రచ్చ..

టాలీవుడ్ హీరోయిన్ రాశిఖన్నా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన తక్కువ సమయంలోనే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది హీరోయిన్ రాశి ఖన్నా. ఇటీవల తెలుసు కదా మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ ఉస్తాద్ భగత్ సింగ్ తో రాబోతుంది. ఇదిలా ఉండగా.. దీపావళి సందర్భంగా గత నెల(అక్టోబర్ 17) లో థియేటర్లలో సందడి చేసిన రొమాంటిక్ డ్రామా మూవీ తెలుసు కదా. ఈ మూవీలో హీరోగా సిద్ధు జొన్నలగడ్డ, కథానాయికలుగా రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి నటించారు. డైరెక్టర్ నీరజా కోన తెరకెక్కించిన ఈ రొమాంటిక్ చిత్రం ఇప్పుడు ఓటీటీ లోకి రానుంది. ఇక, తెలుసు కదా మూవీ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఇందుకోసం చిత్ర నిర్మాతలకు భారీ మొత్తం చెల్లించినట్లు సమాచారం. థియేట్రికల్ వెర్షన్ ముగియడంతో తెలుసు కదా స్ట్రీమింగ్ డేట్ పై అధికారిక ప్రకటన వెలువడింది. ఈ నెల(నవంబర్) 14 నుంచి నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఇదిలా ఉంటే.. తెలుసు కదా మూవీ స్టోరీ ఏంటంటే.. ఈ మూవీలో వరుణ్(హీరో) ఒక అనాథ. ఈ క్రమంలో ఒక రెస్టారెంట్ నడుపుతాడు. అనాథగా ఉన్న వరుణ్ తనకంటూ ఒక కుటుంబం కావాలని ఆశపడతాడు. ఈ సమయంలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంటుంది. వరుణ్ కి అంతకు ముందే రాగా(హీరోయిన్ శ్రీనిధి శెట్టి) అనే అమ్మాయితో బ్రేకప్ అవుతుంది. ఈ సమయంలో అతని జీవితంలోకి అంజలి(హీరోయిన్ రాశి ఖన్నా) వస్తుంది. వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడుతుంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారుతుంది. దీంతో వరుణ్ అంజలిని పెళ్లి చేసుకుంటాడు. అప్పుడే అతని లైఫ్ లోకి ముందు ప్రేమలో పడిన రాగ వస్తుంది. ఇక.. అప్పుడు వరుణ్ ఒక్కసారిగా షాక్ అవుతాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియాలంటే ఈ మూవీ చూడాల్సిందే.



## నన్ను టార్గెట్ చేసి పరువు తీస్తున్నారు..

- అనుపమ పరమేశ్వరన్

కొంతమంది ఆకతాయిలు సెలబ్రిటీలతు టార్గెట్ చేస్తూ మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. స్టార్ హీరోల కానుంచి హీరోయిన్ల వరకు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇటీవల చిరంజీవి కూడా మార్ఫింగ్ ఫొటోలతో ఇబ్బంది పడ్డారు. తాజాగా, ఇప్పుడు ఓ యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్‌కు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. అయితే ఇందులో షాకింగ్ ట్విస్ట్ ఒకటి ఉంది. ఇన్నాళ్లు ఇలా చేస్తుంది.. అబ్బాయిలే అని అంతా అనుకున్నారు. కానీ అనుపమ ఫొటోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేసింది మాత్రం ఓ 20 ఏళ్ల అమ్మాయి అని తెలిసి అంతా భయపడిపోతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ అనుపమ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ నోట్ షేర్ చేసింది. "కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో నా పోస్టులు పెడుతున్నారు. ముందు పట్టించుకోలేదు. అయితే నా ఫొటోలను మార్ఫింగ్ చేసి ఏకంగా నా కుటుంబ సభ్యులతో నా స్నేహితులకు, సెలబ్రిటీలకు కూడా షేర్ చేశారని తెలుసుకుని చాలా బాధపడ్డాను. ఆపై ఎలాంటి ఆధారాలు లేకుండానే నా గురించి తప్పుడు సమాచారం వైరల్ చేస్తున్నారు. వాటిని చూసి ఎవరో కావాలనే టార్గెట్ చేసి చేస్తున్నారని తెలుసుకున్నాను. ఒకే వ్యక్తి చాలా అకౌంట్లతో ఈ సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తెలిసింది. నేను ఏదైనా పోస్ట్ పెట్టినా తప్పుడు కామెంట్లు చేస్తున్నారు. అందుకే నేను కేరళ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. వాళ్ళు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చెపట్టారు. అందులో నిజాలు బయటకు వచ్చాయి. ఇదంతా చేసింది తమిళనాడులో ఓ 20 ఏళ్ల యువతి అని తెలిసి షాక్ అయ్యాను. తన భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఆమె వివరాలను ప్రపంచానికి చెప్పదలుచుకోలేదు. చట్టం తన పని తాను చూసుకుంటుందని వదిలేస్తున్నాను. యువత మేలుకోవాలనే ఈ విషయాన్ని చెబుతున్నా. చేతిలో ఫోన్, ఉందని సోషల్ మీడియా అకౌంట్ ఉందని ఒకరి పరువు తీసే హక్కు మీకు లేదు. ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలి. చట్టం అందరికీ సమానమే"అని రాసుకొచ్చింది. దీంతో ఈ విషయం తెలిసి యువతులు భయపడిపోతున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787